జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | సోమవారం 9 జూన్ 2025 | సంపుటి : 15 | సంచిక : 268 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## ఆడబిడ్డలను అవమానించిన వారిని

# ఉపేక్షించేది లేదు

- అమరావతి ఆడబిడ్డలపై అనుచిత వ్యాఖ్యలు..
- స్పందించిన సీఎం చంద్రబాబు
- మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటాం
- రాజకీయ కక్షతో మహిళలపై నిస్సిగ్గుగా మాట్లాడారు
- మన తల్లులు, చెల్లెళ్లపై చేసిన వ్యాఖ్యలు క్షమించరాని నేరం

**అమరావతి**

సాక్షి మీడియాలో రాజధాని అమరావతిలోని ఆడబిడ్డలను అవమానించిన వారిని ఉపేక్షించేది లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలోని మహిళలపై సాక్షి మీడియాలో ప్రసారమైన అనుచిత వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆదివారం రాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రాజకీయ కక్షతో మహిళలపై నిస్సిగ్గుగా మాట్లాడారని - మిగతా3లో



## దేశంలో కోవిడ్ కలకలం

- ఆరు వేలు దాటిన యాక్టివ్ కేసులు
- కోవిడ్‌తో దక్షిణాది రాష్ట్రాల్లో ఆరుగురు మృతి
- కేరళలో ముగ్గురు, కర్ణాటకలో ఇద్దరు, తమిళనాడులో ఒకరు మృతి



## ముదురుతున్న తొక్కిసలాట వివాదం

- సీఎంపై గవర్నర్‌కు ఫిర్యాదు
- సీఐడీ దర్యాప్తునకు ఆదేశించినప్పటికీ నిరసనల దాడి తగ్గుముఖం పట్టడం లేదు
- సీఎం నిర్లక్ష్యంతోనే తొక్కిసలాట చోటుచేసుకుని 11 మంది మృతికి దారితీసిందని ఫిర్యాదు



## 2026లో తమిళనాట బీజేపీ గెలుపు తథ్యం

- కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా
- అవినీతి డీఎంకే పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారు
- తమిళనాడులోనే కాకుండా పశ్చిమబెంగాల్‌లో కూడా బీజేపీ సత్తా చాటుతుంది

## రాజధానిపై కుట్రలు చేసేవారిపై


# కఠిన చర్యలు తప్పవు



- "అమరావతిపై వ్యాఖ్యలతో మహిళలను అవమానించారు
- అమరావతిలో విలసిల్లిన బౌద్ధాన్ని అవహేళన చేశారు
- ఆ ప్రాంత చారిత్రక, ఆధ్యాత్మిక సంపదను విస్మరించవద్దు
- విశ్లేషకుడి ముసుగులో కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృతమైన కుట్ర ఉంది.
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**అమరావతి**

రాజధాని అమరావతిపై అనుచిత వ్యాఖ్యలతో మహిళలను అవమానించారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మండిపడ్డారు. సాక్షి మీడియాలో ఓ చర్చ సందర్భంగా అమరావతి ప్రాంత మహిళలపై జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను ఉపముఖ్యమంత్రి ఖండించారు. రాజధానిపై కుట్రలు చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. జర్నలిస్ట్ ముసుగులో అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై ప్రజలు, అధికారులు విశ్లేషించాలని అభిప్రాయపడ్డారు. ఆ వ్యాఖ్యలతో తమకు సంబంధం - మిగతా3లో



## మహిళల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం

- "విద్యా, క్రీడలు, స్టార్టప్, సైన్స్ ఇలా అన్ని రంగాల్లో మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారు
- అంతర్జాతీయ వేదికలపైనా మన దేశ కీర్తిని పెంచుతున్నారు
- అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు
- మహిళా సాధికారతే లక్ష్యంగా ఎన్డీఏ సర్కార్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది.
- ప్రధాని నరేంద్ర మోదీ

## పట్టణ పేదరిక నిర్మూలనకు కృషి..

- ఏపీ మెప్మాకు అవార్డుల పంట
- వివిధ కేటగిరీల్లో నామినేట్ అయిన 14 ప్రాజెక్టులకుగాను 9 ప్రాజెక్ట్స్‌కు ప్లాటినం అవార్డులు
- పట్టణ ప్రాంతాల మహిళలకు సాధికారత కల్పించడంలో ఏపీ మెప్మా కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే.

## కమీషన్ల కక్కుర్తితో ప్రాజెక్ట్‌ను

# నాశనం చేస్తున్నారు

- లోపభూయిష్టంగా పోలవరం నిర్మాణం
- అంతర్జాతీయ నిపుణుల పరిశీలనలో బయటపడ్డ డొల్లతనం
- చంద్రబాబు అవినీతికి పరాకాష్టగా నాసిరకం పనులు
- నిపుణుల హెచ్చరికలను పట్టించుకోకపోతే పోలవరం ప్రాజెక్టే ప్రశ్నార్థకం
- డయాఫ్రం వాల్ డిజైన్లను మార్చేశారు
- కాంక్రీట్ నాణ్యతలోనూ రాజీ
- ఇదే కొనసాగితే ప్రాజెక్ట్ ఉనికికే ప్రమాదం



**రాజమహేంద్రవరం**

కమీషన్ల కక్కుర్తితో పోలవరం ప్రాజెక్టును సీఎం చంద్రబాబు సర్వనాశనం చేస్తున్నాడని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి మార్గాని భరత్ మండిపడ్డారు. రాజమహేంద్రవరం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో జరుగుతున్న అవకతవకలను తాజాగా ప్రాజెక్ట్‌ను పరిశీలించిన అంతర్జాతీయ నిపుణుల కమిటీ తన నివేదికలో బయటపెట్టిందని అన్నారు. సీడబ్ల్యూసీ - మిగతా3లో

# పాక్‌లో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే ప్రమోషన్లు.. లేదంటే బేడీలు




**వాషింగ్టన్:** ప్రపంచంలోనే కరుడుగట్టిన ఉగ్రవాది, అల్‌ఖైదా అగ్రనేత ఒసామా బిన్‌లాడెన్‌ను పట్టించడంలో సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ)కి సాయం చేసిన డాక్టర్ షకీల్ అఫ్రీదీపై పాకిస్థాన్ కఠిన చర్యలు తీసుకోవడాన్ని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. షకీల్ అఫ్రీదిని విడుదల చేయాలంటూ అమెరికా చట్టసభ సభ్యుడు బ్రాడ్ షెర్మన్ చేసిన డిమాండ్ సరియైనదేనన్నారు. షకీల్ అఫ్రిదీని విడుదల చేయాలని పాకిస్థాన్ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. ఒకవేళ అదే జరిగితే.. 9/11 నాటి ముంబయి ఉగ్రదాడుల బాధితులకు న్యాయం జరగడంలో కీలక ముందడుగు పడినట్లవుతుందన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. పహల్గాం ఉగ్రదాడి, అనంతరం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' గురించి వివరించేందుకు శశిథరూర్ నేతృత్వంలోని అఖిలపక్ష కమిటీ.. అమెరికాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం జరిగిన సమావేశంలో బ్రాడ్ షెర్మన్.. పాకిస్థాన్ వైద్యుడి ప్రస్తావన తీసుకొచ్చారు. దీనిపై తాజాగా శశిథరూర్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. "బ్రాడ్ షెర్మన్ డిమాండ్‌ను స్వాగతిస్తున్నాం. బిన్ లాడెన్‌కు పాకిస్థాన్ ఆశ్రయం కల్పించింది. ఆయన ఎక్కడ ఉన్నాడన్న సమాచారాన్ని లీక్ చేశాడన్న కారణంతో ఓ వైద్యుడిని అక్రమంగా అరెస్టు చేసి, చిత్ర హింసలు పెడుతోంది. ఒక వేళ ఆ వ్యక్తే ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే అవార్డులు, రివార్డులు వచ్చేవి." అంటూ పాక్ సైన్యాధ్యక్షుడిగా ఉన్న జనరల్ ఆసిం మునీర్‌కు.. దేశంలో అత్యున్నత సైనిక హోదా కలిగిన 'ఫీల్డ్ మార్షల్'గా పాక్ ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించిన విషయాన్ని పరోక్షంగా దుయ్యబట్టారు. అఫ్రీదీ పాకిస్థాన్‌కు చెందిన వైద్యుడు. లాడెన్ కుటుంబసభ్యులకు సంబంధించిన డీఎన్ఏ నమూనాలను సేకరించేందుకు సీఐఏ పోలియో టీకా కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఆయన సాయం చేశారు. ఈ క్రమంలో 2011లో అబొట్టాబాద్ మిలిటరీ కంటోన్మెంట్ శివారులోని ఓ సురక్షిత ప్రాంతంలో ఉన్న లాడెన్‌పై అమెరికా దాడి చేసి హతమార్చింది. ఇదంతా అఫ్రీదీ వల్లనేనని భావించిన పాక్ అధికారులు వెంటనే అఫ్రీదిని అరెస్టు చేశారు. 2012లో అక్కడి కోర్టు ఆయనకు 33 ఏళ్లు జైలు శిక్ష విధించింది. అప్పటి నుంచి అతడు జైల్లోనే ఉంటున్నారు.

# ప్రభుత్వ డాక్టర్‌కు ఊరట.. సీఎం జోక్యంతో తప్పిన సస్పెన్షన్ ముప్పు



**ఇంటర్నెట్ డెస్క్:** గోవా ఆరోగ్య శాఖా మంత్రి విశ్వజిత్ రాణె ఆగ్రహానికి గురైన ప్రభుత్వ డాక్టర్ రుద్రేశ్‌కు ఊరట లభించింది. సీఎం ప్రమోద్ సావంత్ జోక్యంతో ఆయనకు సస్పెన్షన్ ముప్పు తప్పింది. డా. రుద్రేశ్‌ను సస్పెండ్ చేయబోమని సీఎం ఆదివారం పేర్కొన్నారు. 'డా.రుద్రేశ్ కుట్టికార్‌ను సస్పెండ్ చేయబోమని గోవా ప్రజలకు భరోసా ఇస్తున్నాను' అని సీఎం తెలిపారు. ప్రజలకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం, మెడికల్ టీమ్ కట్టుబడి ఉందని అన్నారు. ప్రజల జీవితాలను కాపాడుతున్న వైద్యులు, వైద్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. డా.రుద్రేశ్ కుట్టికార్ గోవా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి విశ్వజిత్ ఆ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలకు వచ్చారు. ఓ వైద్యుడు పేషెంట్‌లకు అందుబాటులో ఉండేందుకు నిరాకరించారన్న ఫిర్యాదు అందడంతో మంత్రి ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా డా.రుద్రేశ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు నోటిని అదుపులో పెట్టుకోవాలి. మీరు డాక్టర్. సాధారణంగా నాకు కోపం రాదు. మీరు మాత్రం ప్రవర్తన నియంత్రించుకోవాలి. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా పేషెంట్లతో మర్యాదగా నడుచుకోవాలి' అని అన్నారు. ఆ తరువాత ఆసుపత్రి సూపరింటెండెంట్ వైపు చూస్తూ.. 'ఆయన స్థానంలో మరో సీఎమ్ఓను నియమించండి. ఆయన సస్పెన్షన్ ఫైలుపై నేను సైన్ చేస్తాను. వెంటనే ఆయన సస్పెండ్ కావాలి. ఇలా నేను ఎప్పుడూ అమర్యాదగా మాట్లాడింది లేదు. కానీ దీన్ని మాత్రం సహించను' అని మంత్రి ఆదేశించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విమర్శలు వెల్లువెత్తాయి. మంత్రిపై గోవా పీసీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. మంత్రి తన అధికారదర్పం ప్రదర్శించారని, ఇది తలవంపులు తెచ్చే ఘటన అని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే జోక్యం చేసుకున్న గోవా సీఎం.. డాక్టర్‌ను సస్పెండ్ చేయట్లేదని తాజాగా పేర్కొన్నారు.

# భగ్గుమన్న మణిపూర్.. ఏటీ నేత అరెస్టుతో ఉద్రిక్తత



**ఇంఫాల్/గౌహతి/న్యూఢిల్లీ:** మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. కొందరు యువకులు బృందంగా ఏర్పడి, తాము పెట్రోల్ పోసుకుని, నిప్పంటించు కుంటామని బెదిరింపులకు దిగారు. వీరు మెయిటీ కమ్యూనిటీకి చెందిన అరంబై టెంగోల్ (ఏటీ) సంస్థ కీలక నేత కనన్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేయడంతో నిరసనలకు దిగారు. కనన్ సింగ్ మెయిటీ, కుకీ జాతి ఘర్షణల్లో పాల్గొన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. భద్రతా దళాలు ఏటీ నేత కనన్ సింగ్‌ను అరెస్టు చేసిన దరిమిలా ఇంఫాల్‌లో శనివారం రాత్రి నిరసనలు చెలరేగాయి. నిరసనకారులు రోడ్డుపై టైర్లు తగలబెట్టి రోడ్లను దిగ్బంధించారు. ఆ సమయంలో కాల్పుల శబ్దం కూడా వినిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. నల్లని టీ-షర్టులు ధరించిన యువకుల బృందం పెట్రోల్ బాటిళ్లతో రోడ్లపై నిరసనకు దిగింది. 2024 ఫిబ్రవరిలో జరిగిన అదనపు పోలీసు సూపరింటెండెంట్ మోయిరంగ్థెం అమిత్ ఇంటిపై దాడి , ఒక సీనియర్ పోలీసు అధికారి కిడ్నాప్‌లో కనన్ సింగ్ ప్రధాన నిందితుడు. అప్పుడు అతను రాష్ట్ర పోలీసు కమాండో యూనిట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. విధులలో నిర్లక్ష్యం కారణంగా అప్పట్లో అతనిని సస్పెండ్ చేశారు. ఆ తర్వాత కనన్ సింగ్ ఏఐలో భాగస్వామిగా మారాడు. నిందితుడు కనన్ సింగ్ తిరుగుబాటు గ్రూపు కుకి నేషనల్ ఆర్మీ (కేఎన్ఏ)లో కీలకంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కాగా ఏటీ అనేది కుకీ గ్రామాలపై దాడులకు దిగుతున్న రాడికల్ మెయిటీ మిలీషియా అని కుకీ తెగలు ఆరోపిస్తున్నాయి. పోలీసు ఆయుధాల దోపిడీ కేసుల్లో పలువురు ఏటీ సభ్యులు కూడా ఉన్నారు. కాగా కుకీ, జోమి, హ్మార్ తెగలు పలు తిరుగుబాటు గ్రూపులలో భాగస్వామ్యం వహిస్తున్నాయి. ఈ తెగలకు చెందిన వారిలో చాలామంది మణిపూర్ హింసలో పాల్గొన్నారనే ఆరోపణలున్నాయి. గతంలో చోటుచేసుకున్న మణిపూర్ హింసాయుత ఘటనల్లో 260 మందికి పైగా జనం ప్రాణాలు కోల్పోయారు. 50 వేలమంది నిరాశ్రయులయ్యారు.

## 2026లో తమిళనాట బీజేపీ గెలుపు తథ్యం

**చెన్నై:** వచ్చే ఏడాది జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని కూటమి విజయం సాధించడం తథ్యమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. అవినీతి డీఎంకే పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. తమిళనాడులోనే కాకుండా పశ్చిమబెంగాల్‌లో కూడా బీజేపీ సత్తా చాటుతుందన్నారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కార్యకర్తలతో మధురైలో ఆదివారంనాడు జరిగిన సమావేశంలో అమిత్‌షా ప్రసంగించారు.

**మోదీ నిధులు ప్రజలకు చేరడం లేదు**

అధికార డీఎంకే అవినీతి, ప్రభుత్వ వైఫల్యాలను అమిత్‌షా విమర్శలు గుప్పిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 10 శాతం హామీలను కూడా అమలు చేయలేదని అన్నారు. ఎన్ని వాగ్దానాలు అమలు చేసారో జాబితా ఇవ్వాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌ను సవాలు చేసారు. తమిళంలో ఇంజనీరింగ్ విద్యతో సహా హైయర్ ఎడ్యుకేషన్‌ను పట్టించుకోవడం లేదన్నారు. కల్తీ మద్యం మరణాల నుంచి టీఏఎస్ఎంఏసీలో రూ.39,000 కోట్ల స్కామ్ వరకూ డీఎంకే 100 శాతం విఫల ప్రభుత్వంగా నిలిచిందని ఆరోపించారు. స్టాలిన్ ప్రభుత్వం కేంద్ర నిధులను దుర్వినియోగం చేసిందని, కీలకమైన అభివృద్ధి పథకాలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. మోదీ నిధులు తమిళనాడు ప్రజలకు చేరడం లేదని, వాటిని డీఎంకే దారిమళ్లిస్తోందని ఆరోపించారు.

**ఎన్నికల కదనరంగం**


రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు బీజేపీ కార్యకర్తలందరికీ చాలా కీలకమని, ప్రతి ఒక్కరూ చేతులు పైకెత్తి విజయ సంకల్పం చేయాలని అమిత్‌షా ఉత్తేజపరిచారు. బీజేపీ ఇటీవల సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, ఒడిశాలో గెలిచామని, హర్యానాలో అధికారాన్ని నిలుపుకొన్నామని, 26 ఏళ్ల తర్వాత ఢిల్లీలో తిరిగి అధికారంలోకి వచ్చామని చెప్పారు. జనాభా ఆధారిత నియోజకవర్గాల పునర్విభజన వల్ల తమిళనాడుకు పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గిపోతుందంటూ డీఎంకే ఆందోళనపై మాత్రం అమిత్‌షా ఎలాంటి ప్రస్తావన చేయలేదు.

# రాహుల్ 'ఫిక్సింగ్' వ్యాసానికి సీఎం ఫడ్నవీస్ కౌంటర్ ఆర్టికల్



**ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో(2024)మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఆరోపిస్తూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఒక ప్రముఖ పత్రికలో వ్యాసం రాశారు. దీనిపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందిస్తూ, రాహుల్ ఆర్టికల్‌కు కౌంటర్‌గా మరో పత్రికలో వ్యాసం రాశారు. కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ)లోని శరద్ పవార్ వర్గం, శివసేనలోని ఉద్ధవ్ థాకరే వర్గాల కూటమి ఊహించని ఓటమిని చవిచూసిందని పేర్కొంటూ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ విధానాన్ని రాహుల్ గాంధీ తప్పుపట్టారు. దీనిపై 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో వ్యాసం రాశారు. దీనికి కౌంటర్‌గా సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ రాసిన వ్యాసం నేడు(ఆదివారం)ఒక మరాఠీ దినపత్రికలో ప్రచురితమయ్యింది. దానిలో ఫడ్నవీస్ కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారని, అందుకే వారు ఇప్పుడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లను తప్పుబడుతూ, ప్రజాస్వామ్య ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్రలో జరిగే ప్రతి ఎన్నికల్లోనూ ఈవీఎంలపై ప్రశ్నలు లేవనెత్తడం ప్రతిపక్ష పార్టీలకు అలవాటుగా మారిందన్నారు. రాహుల్ గాంధీ వైఫల్యాన్ని అంగీకరించలేని నేత అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచిన ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలు సరైనవేనా? అంటూ ఫడ్నవీస్ ప్రశ్నించారు. కాంగ్రెస్, ఎన్‌సీపీలోని శరద్ పవార్ వర్గం, ఉద్ధవ్ థాకరే శివసేనల మహా వికాస్ అఘాడి కూటమి నవంబర్ 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని 288 అసెంబ్లీ స్థానాల్లో 46 స్థానాలను మాత్రమే గెలుచుకుంది. అప్పటి మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ, బీజేపీల మహాయుతి కూటమి 235 సీట్లను గెలుచుకుంది. బీజేపీ ఒంటరిగా 132 సీట్లను గెలుచుకుంది. ఇది రాష్ట్ర చరిత్రలో రికార్డుగా నిలిచింది.

## మహిళల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం



**దిల్లీ:** మహిళల అభివృద్ధి కోసం ఎన్డీఏ సర్కార్ చేపట్టిన పథకాలు, కార్యక్రమాలను ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి గుర్తు చేశారు. మహిళల నేతృత్వంలో సాధించిన విజయాలను ప్రస్తావించారు. కేంద్రంలో వరుసగా మూడోసారి మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటై రేపటికి ఏడాది పూర్తి కావొస్తోంది. ఈ నేపథ్యంలోనే 11 ఏళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "విద్యా, క్రీడలు, స్టార్టప్, సైన్స్ ఇలా అన్ని రంగాల్లో మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపైనా మన దేశ కీర్తిని పెంచుతున్నారు. అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఎన్డీఏ సర్కార్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. స్వచ్ఛ భారత్ ద్వారా వారి గౌరవాన్ని కాపాడడం నుంచి జన్‌ధన్ ఖాతాలతో వారిని ఆర్థికంగా బలోపేతం చేసేంత వరకు ఎన్నో పథకాలు అమలు చేశాం. పేద మహిళల ఆరోగ్యం దృష్ట్యా 'ఉజ్వల్ యోజన' పథకం కింద గ్యాస్ సిలిండర్లు అందించాం. 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన'తో పేదలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇచ్చాం. ప్రతి ఆడబిడ్డను రక్షించేందుకు, వారు ఉన్నతంగా ఎదిగేందుకు 'బేటీ బచావో, బేటీ పడావో'ను అమలు చేశాం. పేదలు, రైతులు, యువత కోసం ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని మీరంతా చూశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా 11 ఏళ్లుగా కృషి చేస్తున్నాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## దేశంలో కోవిడ్ కలకలం



**ఢిల్లీ:** భారత్‌లో రోజురోజుకూ కోవిడ్-19 యాక్టివ్ కేసులు పెరగడం ఆందోళన రేకెత్తిస్తోంది. దేశంలో కొత్తగా 1,131 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో కేసుల సంఖ్య ఆరు వేలు దాటింది. దేశంలో ఆదివారం ఉదయం 8 గంటల నాటికి కోవిడ్-19 యాక్టివ్ కేసుల సంఖ్య 6,133కి చేరుకుందని ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కోవిడ్‌తో దక్షిణాది రాష్ట్రాల్లో ఆరుగురు మృతి చెందారు. కేరళలో ముగ్గురు, కర్ణాటకలో ఇద్దరు, తమిళనాడులో ఒకరు మృతి చెందారు. కేరళలో 1950, గుజరాత్‌లో 822, బెంగాల్‌లో 693, మహారాష్ట్రలో 595, కర్ణాటకలో 366, ఏపీలో 86, తెలంగాణలో 10 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కోవిడ్ మృతుల సంఖ్య కూడా పెరగడంతో మరో 'కరోనా వేవ్'ముంచెత్తుతుందా అన్న భయాలు సైతం వివిధ వర్గాల ప్రజల్లో నెలకొన్నాయి. కేరళలో అత్యధిక పాజిటివ్ కేసులు నమోదు కాగా, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమబెంగాల్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ తర్వాతి స్థానాల్లో నిలుస్తున్నాయి. కేరళలో శనివారం నాటికి (గత 24 గంటల్లో) 192, గుజరాత్‌లో 107, పశ్చిమబెంగాల్‌లో 58, కర్ణాటకలో 15, ఆంధ్రప్రదేశ్‌లో 12 కొత్త యాక్టివ్ కేసులు వెలుగు చూశాయి. అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లోనూ యాక్టివ్ కేసులు పెరుగుతున్నాయి. ప్రస్తుతం కేసుల వ్యాప్తికి కారణమైన ఒమిక్రాన్ సబ్‌వేరియెంట్లు, లీనియేజ్‌లు ఎగువ శ్వాసకోశ వ్యవస్థ (అప్పర్ రెస్పిరేటరీ) పైనే ప్రభావం చూపుతున్నందున పెద్దగా భయపడాల్సిన పనిలేదని వైద్య నిపుణులు అంటున్నారు.

## ముదురుతున్న తొక్కిసలాట వివాదం



**బెంగళూరు:** చిన్నస్వామి స్టేడియం వద్ద జూన్ 4న జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతిచెందిన ఘటనపై కర్ణాటక ప్రభుత్వం పలు సస్పెన్షన్లు, సీఐడీ దర్యాప్తునకు ఆదేశించినప్పటికీ నిరసనల దాడి తగ్గుముఖం పట్టడం లేదు. కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యేలు, పార్లమెంటు సభ్యులు విధాన సౌధలోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట ఆదివారం నిరసనలు తెలిపారు. సీఎం, డిప్యూటీ సీఎం రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేసారు. ఇదే సమయంలో, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై గవర్నర్ గిరీష్ కుమార్‌కు బెంగళూరు నివాసి ఒకరు ఫిర్యాదు చేసారు. సీఎం నిర్లక్ష్యంతోనే తొక్కిసలాట చోటుచేసుకుని 11 మంది మృతికి దారితీసిందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. బెంగళూరులోని కొట్టిగేపల్య నివాసి అయిన గిరిష్ కుమార్ ఈ ఫిర్యాదు చేశారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీల్ విజయోత్సవంలో పాల్గొనాలంటూ ముఖ్యమంత్రి ప్రజలను వ్యక్తిగతంగా ఆహ్వానించారని, తగినంత భద్రతా చర్యలు తీసుకోకుండానే ఆయన ప్రజలను ఆహ్వానించారని ఫిర్యాదుదారు ఆరోపించారు. ఆర్‌సీబీ వంటి ప్రైవేట్ క్రికెట్ ఫ్రాంచైస్ కోసం గ్రాండ్ రెసెప్షన్‌కు ఆతిథ్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని గిరిష్ కుమార్ ప్రశ్నించారు. ఐపీఎల్ అనేది కమర్షియల్ వెంచర్ అని, ఇందులో నేషనల్ ప్రైడ్ కంటే లాభాల ఉద్దేశమే ఉంటుందని పేర్కొన్నారు. క్రీడాకారులను ఫ్రాంచైస్‌లు కొనుగోలు చేసి డబ్బులు కోసం ఆటలు నిర్వహిస్తుంటాయని, దేశం కోసమో, రాష్ట్రం కోసమో కాదన్నారు. ఇలాంటి సెలబ్రేషన్లను నేషనల్ హీరోలైన సైనికులకో, ఒలంపిక్ అథ్లెట్ల్ కోసమో చేసే సెలబ్రేషన్స్‌తో పోల్చకూడదన్నారు. ఆర్‌సీబీ టీమ్‌కు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమానాశ్రయంలో స్వాగతం పలకాల్సిన అవసరం కూడా లేదని ఆయన అన్నారు. పౌరులను కాపాడే బాధ్యతలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఇందుకు బాధ్యులను గుర్తించాలని ఆ ఫిర్యాదులో గిరీష్ కుమార్ కోరారు.

# 'కమీషన్ల కక్కుర్తితో ప్రాజెక్ట్‌ను నాశనం చేస్తున్నారు'

-మొదటిపేజీ తరువాయి

ఆమోదించిన దానికి భిన్నంగా దయాఫ్రం వాల్ డిజైన్లు, కాంక్రీట్ నాణ్యతలో ప్రమాణాలు లేకపోవడం, లోపభూయిష్టమైన విధానాలతో మొత్తం ప్రాజెక్ట్‌నే ప్రమాదంలోకి నెట్టేట్టుగా కూటమి సర్కార్ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరంపై ప్రభుత్వం మొద్దునిద్ర వీడి, అంతర్జాతీయ నిపుణుల కమిటీ చేసిన సిఫారస్‌ల మేరకు ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకువెళ్ళాలని డిమాండ్ చేశారు. ఇంకా ఆయనేమన్నారంటే.... చంద్రబాబు సీఎం అయ్యాక గతంలో చేసిన తప్పులనే మళ్ళీ పునరావృతం చేస్తూ పోలవరం ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేస్తున్నారు. గతంలో చేసిన తప్పుల నుంచి ఇప్పటికీ కూటమి ప్రభుత్వం పాఠాలు నేర్చుకోకుండా కమీషన్ల కక్కుర్తితో రూ.990 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోంది. గతంలో సబ్ కాంట్రాక్టు పనులు చేసే బావర్స్ కంపెనీకి నేరుగా దయాఫ్రం వాల్ నిర్మాణ పనులు అప్పగించేశారు. దీంతో పనుల్లో జాప్యం, నాణ్యతాలోపం కొట్టొచ్చినట్టు కనపడుతోందని అంతర్జాతీయ నిపుణుల కమిటీ తాజాగా పీపీఏ, సీడబ్ల్యూసీలకు ఇచ్చిన ఒక నివేదికలో వెల్లడించింది. సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్‌ను తుంగలో తొక్కి 1.5 మీటర్ల మందంతో కాకుండా 0.9 మీటర్ల మందంతో బావర్ సంస్థ దయా ఫ్రం వాల్ పనులు చేస్తోందని అంతర్జాతీయ నిపుణుల కమిటీ ఎత్తిచూపింది. సీడబ్ల్యూసీ ఆమోదించిన మందం కంటే 0.6 మీటర్లు మందం తగ్గించి పనులు చేస్తున్నారని తప్పుపట్టింది. కాంక్రీట్ మందం సగానికి సగం తగ్గించేసినట్టు నిపుణుల కమిటీ తన నివేదికలో బట్టబయలు చేసింది. రాబోయే రోజుల్లో 190 టీఎంసీల నీటిని నిల్వచేసే పోలవరం ప్రాజెక్టుకు ఏదైనా జరిగితే ఉభయ గోదావరి జిల్లాలు కూడా తుడిచిపెట్టుకుని పోయే ప్రమాదం ఉంది. ఇది ముమ్మాటికీ క్షమించరాని నేరం. పునర్ నిర్మాణం చేసే పనుల్లో కూడా కనీస బాధ్యత తీసుకోవడం లేదు.

**నిపుణుల పరిశీలనతో బయటపడ్డ డొల్లతనం**

పోలవరం ప్రాజెక్టు పనుల్లో ఎదురవుతున్న సవాళ్లను



అధిగమించడానికి ఏడాది క్రితం సియాన్ హించ్‌బెర్గర్, మెస్సర్స్ సీ రిచర్డ్ డొన్నెల్లి, గియానో ఫ్రాంకో డీ క్యాప్పో, డేవిడ్ పాల్ సభ్యులతో కూడిన అంతర్జాతీయ నిపుణుల కమిటీని సీడబ్ల్యూసీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ నాలుగోసారి మే నెల 5 నుంచి 9వ తేదీ వరకు పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. పనులపై అధికారులు, కాంట్రాక్టు సంస్థలతో సమీక్షించింది. క్షేత్ర స్థాయి పర్యటనలో గుర్తించిన అంశాలు, అధికారుల సమీక్షలో వెల్లడైన విషయాలు ఆధారంగా ఈ నెల 4న పీపీఏ, సీడబ్ల్యూసీలకు అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చింది. ప్రాజెక్టు పనుల్లో లోపాలను ఎత్తిచూపుతూ, వాటిని సరిదిద్దుకోవడానికి చేపట్టాల్సిన చర్యలను ఆ నివేదికలో సిఫార్సు చేసింది.

**నిబంధనలకు విరుద్ధంగా దయాఫ్రం వాల్ పనులు**

పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) గ్యాప్-2లో కేంద్ర జల సంఘం ఆమోదించిన డిజైన్‌కు విరుద్ధంగా పనులు చేస్తుండటాన్ని అంతర్జాతీయ నిపుణుల కమిటీ తీవ్రంగా ఆక్షేపించింది. మందం తగ్గించటంపై తక్షణమే సమీక్షించి, తగిన నిర్ణయం తీసుకోవాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీకి సూచించింది. దీంతోపాటు దయాఫ్రం వాల్ నిర్మాణంలో వినియోగిస్తున్న టీ-16 ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమంలో నీటి శాతం అధికంగా ఉన్నట్లు అంతర్జాతీయ నిపుణుల బృందం గుర్తించింది. ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమం 32 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద నాణ్యంగా ఉంటుందని, కానీ దయాఫ్రం వాల్‌లో వినియోగిస్తున్న కాంక్రీట్ మిశ్రమం ఉష్ణోగ్రత 35 డిగ్రీలు ఉందని ఎత్తి చూపింది. గత మూడు నెలల్లో 52 ప్యానళ్లతో దయాఫ్రం వాల్ పనులు చేశారని, అందులో 9 ప్యానళ్ల పరిధిలో దయా ఫ్రం వాల్ ఉపరితలంపై ఎయిర్ బబుల్స్ (సీపేజీ) ఉన్నట్లుగా చెప్పింది. ప్రాజెక్టు భద్రత దృష్ట్యా, సీపేజీ ఉన్న ప్యానళ్ల పరిధిలో దయా ఫ్రం వాల్ పైభాగంలో 1 నుంచి 2 మీటర్ల లోతు వరకు తొలగించి, మళ్ళీ కొత్తగా వేయాలని పీపీఏకు సూచించింది. దయాఫ్రం వాల్ నిర్మాణంలో ఒక ప్యానల్‌ను మరో ప్యానల్‌తో నిలువునా జత చేసేటప్పుడు 7.5 సెంటీమీటర్లకు బదులుగా కనీసం పది సెంటీ మీటర్ల పొడవున ఓవర్ ల్యాప్ చేయాలని సూచించింది. అప్పుడే సీపేజీకి సమర్థవంతంగా అడ్డుకట్ట వేయొచ్చని పేర్కొంది.

**ప్రాజెక్ట్ పనుల్లోనూ తీవ్ర జాప్యం**

ప్రధాన డ్యాం గ్యాప్-2లో దయా ఫ్రం వాల్ పనులను 66 వేల చదరపు మీటర్ల పరిధిలో చేయాలి. నిర్దేశించుకున్న షెడ్యూలు ప్రకారం 2025 జూన్ నాటికి 28 వేల చదరపు మీటర్ల పరిధిలో దయాఫ్రం వాల్ పనులు పూర్తి చేయాలి. 2025 ఏప్రిల్ నాటికి 15 వేల చదరపు మీటర్ల పరిధిలో పనులు పూర్తి చేయాల్సి ఉండగా, 12 వేల చదరపు మీటర్ల పరిధిలో మాత్రమే పూర్తయ్యాయి. దాదాపు 3 వేల చదరపు మీటర్ల పరిధిలో పనులు వెనుకబడినట్లు నిపుణుల కమిటీ తేల్చింది. దాదాపు 35 రోజులు వెనుకబడి ఉన్నారు. పనుల్లో జాప్యానికి కాంట్రాక్టు సంస్థ బావర్ చెబుతున్న కారణాలు సహేతుకంగా లేవని నిపుణుల కమిటీ కుండబద్దలు కొట్టింది. దయాఫ్రం వాల్ ప్యానళ్లను అత్యంత కఠిన శిల (సౌండ్ హార్డ్ రాక్) లోపలికి రెండు మీటర్ల లోతు వరకు దించితేనే, సీపేజీని సమర్థవంతంగా నియంత్రించవచ్చని పేర్కొంది. అలా చేయడం వల్లే పనులు ఆలస్యమవుతున్నాయని చెప్పడం విడ్డూరంగా ఉందని కమిటీ చెప్పింది.' అని పేర్కొన్నారు.

# ఆఖరి నిమిషంలో ప్రభుత్వం చేసిన పచ్చిమోసంతో టీచర్లలో ఆందోళన

**నెల్లూరు:** రాష్ట్ర వ్యాప్తంగా టీచర్ల బదిలీల ప్రక్రియను కూటమి సర్కారు ప్రహసనంగా మార్చేసిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ బదిలీల్లో మ్యానువల్ ఆప్షన్ అమలు చేస్తామని మాట ఇచ్చిన ప్రభుత్వం ఆఖరి నిమిషంలో ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్స్‌ను తప్పనిసరి చేయడం ద్వారా మొత్తం ఉపాధ్యాయలోకంను పచ్చిగా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేష్‌కు రెడ్‌బుక్‌పై ఉన్న శ్రద్ధలో కాస్తైనా విద్యాశాఖపై లేకపోవడం వల్లే రాష్ట్రంలో విద్యావ్యవస్థ అధ్వన్నంగా మారిందని ధ్వజమెత్తారు. తక్షణం ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు మ్యానువల్ విధానంలోనే బదిలీ ప్రక్రియ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇంకా ఆయనేమన్నారంటే... తాజాగా కూటమి ప్రభుత్వం టీచర్ల బదిలీలకు సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ రోజు నుంచి 48 గంటల్లో ఆన్‌లైన్ బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలంటూ, ఒక్కో టీచర్ 2500 ఆప్షన్స్ పెట్టుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ అస్తవ్యస్త నిర్ణయాల వల్ల రాష్ట్రంలో 1.20 లక్షల మంది ఎస్జీటీలకు సంబంధించి అటు హెచ్‌ఎం పదోన్నతులు లేకుండా చేశారు. మరోవైపు 48 గంటల్లో ఒక్కో టీచర్ 2500 ఆన్‌లైన్ బదిలీ అప్షన్స్ పెట్టుకోవాలంటూ ఒత్తిడి చేయడంతో తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

**టీచర్లను ఎలా మోసం చేశారంటే...**

టీచర్ల బదిలీలకు సంబంధించిన చట్టానికి విరుద్దంగా రోజుకోరకంగా నిబంధనలను మార్చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం టీచర్లకు వెన్నుపోటు పొడిచింది. 35 వారాల పాటు ప్రతి శుక్రవారం మీటింగ్‌లు పెట్టి మ్యానువల్ కౌన్సిలింగ్ ద్వారానే బదిలీలు చేస్తానని చెప్పి నమ్మించారు. తరువాత అసెంబ్లీలో మాత్రం మ్యాన్‌వల్‌కు బదులు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ చేస్తామని చట్టం తీసుకువచ్చారు. దీనిపై టీచర్లు ఆందోళన వ్యక్తం చేయడంతో అధికారులు చట్టంలో ఉన్న దానిని పక్కకుపెట్టి మ్యాన్‌వల్ బదిలీలనే చేస్తామని హామీ ఇచ్చారు. గత మే నెలలో ఆన్‌లైన్ బదిలీలకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తుండటంతో డీఈఓ కార్యాలయాల ముందు మే 25న ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చాయి. దీనితో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టీచర్ యూనియన్లతో ఒక మీటింగ్ పెట్టి చట్టప్రకారం ఆన్‌లైన్ బదిలీలు ఉన్నా కూడా, దానిని పక్కకు పెట్టి మ్యానువల్ బదిలీలే చేస్తామని హామీ ఇవ్వడంతో టీచర్ యూనియన్లు ఆందోళనను విరమించుకున్నారు. అదే క్రమంలో ప్రభుత్వం



మే 25న బదిలీలకు సంబంధించి జారీ చేసిన జీఓ 22లో ఖచ్చితంగా ఆన్‌లైన్ బదిలీలే చేస్తామని స్పష్టం చేసింది. ఇంతకంటే మోసం ఎక్కడైనా ఉంటుందా? దీనిపై టీచర్ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పొరపాటుగా ఆ జీఓ జారీ చేశామని, మ్యానువల్ బదిలీలే చేస్తామంటూ టీచర్ సంఘాలకు అధికారులు హామీ ఇచ్చారు. ఇప్పుడు హటాత్తుగా బదిలీలపై తాజా ఉత్తర్వులు జారీ చేశారు. ఇలా పదేపదే టీచర్లను నమ్మించి, నిలువుగా దగా చేస్తూనే ఉన్నారు.

**బదిలీల ప్రక్రియ అస్తవ్యస్తం**

గత ప్రభుత్వం జారీ చేసిన 117 జీఓను రద్దు చేసి, కూటమి ప్రభుత్వం తొమ్మిది రకాల స్కూల్స్‌ను తీసుకువచ్చింది. బదిలీల కోసం వెబ్ అప్షన్స్‌లో ఫౌండేషన్, బేసిక్, మెడల్ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ అనే నాలుగు ఆప్షన్స్ కనిపించాల్సి ఉంది. కానీ కేవలం ఎంపీపీ, యుపీ స్కూల్స్ అని మాత్రమే పెట్టారు. దీనితో టీచర్లలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. తాము ఆప్షన్ ఇచ్చే స్కూల్ ఏ కేటగిరిలోకి మార్పు చెందిందో తెలియక ఇబ్బంది పడుతున్నారు. రేపు సాయంత్రంతో వెబ్ అప్షన్స్ గడువు ముగుస్తోంది. తొమ్మిదిరకాల స్కూల్స్‌గా మార్చిన నేపథ్యంలో కొన్ని మండలాల్లో బేసిక్ ప్రైమరీ స్కూల్స్ ఎక్కువగా పెడితే, మరికొన్ని మండలాల్లో ఫౌండేషన్ స్కూల్స్‌ను ఎక్కువగా పెట్టారు. ఎక్కడా హేతుబద్దత అనేది లేకుండా చేశారు. తెలుగుదేశం నాయకులు చెప్పినట్లుగా స్కూల్స్ కేటగిరిని మార్చారు. ఆర్జేడీ, డీఈఓ, ఎంఈఓలతో సంబంధం లేకుండా, నిబంధనలకు అనుగుణంగా ఏ స్కూల్ ఏ కేటగిరిలో ఉండాలని నిర్ణయించకుండా, టీడీపీ నాయకులు సూచించినట్లుగా స్కూల్స్‌ను మార్చేశారు. టీచర్లు ఎన్ని సంవత్సరాలు, ఎంత దూరంలో పనిచేశారనే దానిపై పాయింట్స్ ఇస్తారు. దాని ప్రకారమే బదిలీల్లో ప్రాధాన్యత ఉంటుంది. కానీ ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో ఈ పాయింట్స్ కేటాయింపుల్లో అవకతవకలకు పాల్పడుతున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని చూపి టీచర్లను భయపెట్టాలని అనుకుంటున్నారు. రాజకీయ ఒత్తిళ్ళతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే, రాబోయే రోజుల్లో ఇబ్బంది పడతారు. ఎనిమిది అకడమిక్ ఇయర్స్ పూర్తయితే బదిలీ చేస్తామనే నిబంధనలు ఉంటే, ఎనిమిది క్యాలెండర్ ఇయర్స్ పూర్తి కాలేదంటూ సాకులు చూపి పాయింట్స్ ఇవ్వడం లేదు. అలాగే దాదాపు 4000 మంది స్కూల్ అసిస్టెంట్‌లు సర్‌ప్లస్‌గా మారిపోయారు. వారిని నిబంధనలకు విరుద్దంగా ప్రైమరీ స్కూల్‌కు కేటాయిస్తున్నారు. ఇరవై ఏళ్ళ సర్వీస్ ఉన్న స్కూల్ అసిస్టెంట్‌ను కూడా పీఎస్ హెచ్‌ఎంగా మోడల్ స్కూల్స్‌కు పంపడం దారుణం. దీనివల్ల ఎస్‌జీటీలకు పీఎస్ హెచ్‌ఎం పదోన్నతి రాకుండా పోయింది.

**పదో తరగతి మూల్యాంకనంతో పరువు పోయింది**

మంత్రి నారా లోకేష్ అసమర్థత కారణంగా, పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో చూపిన నిర్లక్ష్యంతో విద్యాశాఖ పరువు పోయింది. పదోతరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు తొలి మెట్టు. అటువంటి పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరిగాయో అందరికీ తెలుసు. నెల్లూరుకు చెందిన విద్యార్థిని సాయి కుందనకి అన్ని సబ్జెక్ట్‌ల్లో తొంబైకి పైగా మార్కులు వస్తే, హిందీ సబ్జెక్ట్‌లో 34 మార్కులు వచ్చాయి, బాలికను ఫెయిల్ చేశారు. ఆమె రీవాల్యుయేషన్ పెట్టుకుంటే 90 మార్కులు వచ్చాయి. నెల రోజుల పాటు ఆ విద్యార్థి ఎంత వేదన చెంది ఉంటారో అర్థం చేసుకోవాలి. బొర్రా శశింద్రారెడ్డికి గణితంలో 32 మార్కులు వేశారు. అన్నింటిలో మంచి మార్కులు వచ్చిన ఈ విద్యార్థి తిరిగి రీ వాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే 72 మార్కులు వేశారు. దీనిపైన మళ్ళీ రీకౌంటింగ్ చేయించుకుంటే 78 మార్కులు వచ్చాయి. ప్రొద్దుటూరుకు చెందిన గంగిరెడ్డి మోక్షితను సోషల్ లో 21 మార్కులతో ఫెయిల్ చేశారు. రీవాల్యుయేషన్‌లో 84 మార్కులు వచ్చాయి. ఇలా అనేక మంది విద్యార్థుల జవాబుపత్రాలను తీసుకువస్తే, ఎంత దారుణంగా వాల్యుయేషన్ చేశారో అర్థమవుతుంది. ఒక సబ్జెక్ట్‌ను దిద్దడానికి పదిరోజులు సమయం ఇచ్చే పరిస్థితి ఉంటే, ఆరు రోజుల్లో పూర్తి చేయాలని ఒత్తిడి చేశారు' అని చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు.

# బిల్డర్లకు అదిరిపోయే గుడ్ న్యూస్

**నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారాభివృద్ధి కోసం బిల్డర్లకు బంపరాఫర్ ప్రకటించింది. బహుళ అంతస్తులకు సంబంధించిన డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ ఛార్జీలను బిల్డర్లు ఇకపై వాయిదా పద్ధతిలో చెల్లించే అవకాశం కల్పించింది. ఇంపాక్ట్ ఫీజు, లేబర్‌సెస్ వంటివి విడతలవారీగా వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ ఛార్జీలను కూడా ఇదే పద్ధతిలో చెల్లించేలా వెసులుబాటు కల్పించింది. దీనికి సంబంధించి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ ప్రభుత్వం రూ.15 లక్షలలోపు ఫీజులైతే ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది.. రూ.15 లక్షల నుంచి రూ.75 లక్షలలోపు ఫీజు 12 నెలల్లో నాలుగు విడతలుగా చెల్లించాల్సి ఉంటుంది.. 12% వడ్డీ ఉంటుంది. అలాగే రూ.75 లక్షలపైన ఉంటే 24 నెలల్లో 8 వాయిదాల్లో 12% వడ్డీతో సమాన వాయిదాల్లో చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బహుళ అంతస్తుల నిర్మాణ ప్రాంతంలో ఇప్పటివరకూ 10% పుర, నగరపాలక సంస్థలకు తనఖా పెడుతున్నారు.. ఇకపై 15 శాతానికి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకేసారి ఛార్జీలను చెల్లించాల్సి రావడం తమకు ఆర్థికంగా ఇబ్బంది అవుతోందని.. ఈ రుసుముల్ని వాయిదా పద్ధతిలో జమ చేసే అవకాశం కల్పించాలని ఇటీవల ప్రభుత్వాన్ని బిల్డర్లు రిక్వెస్ట్ చేసింది. వెంటనే ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకుంది. ఛార్జీల పెంపుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్ స్వాగతించారు, హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బహుళ అంతస్థుల యజమానులకు ఊరట దక్కనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్, బిల్డర్ల కోసం కీలక నిర్ణయాలు తీసుకుంది. భవన నిర్మాణాలతో పాటుగా పన్నుల చెల్లింపుల విషయంలో కొన్ని వెసులుబాటు కల్పించారు. తాజాగా రుసుముల చెల్లింపుల విషయంలో కూడా వెసులుబాటు కల్పించారు. బిల్డర్లు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఆనందంలో ఉన్నారు.. ఈ రుసుముల్ని వాయిదాల పద్ధతిలో చెల్లించడం తమకు సులభంగా ఉంటుందని

## ఆడబిడ్డలను అవమానించిన వారిని ఉపేక్షించేది లేదు

-మొదటిపేజీ తరువాయి

మండిపడ్డారు. మన తల్లులు, చెల్లెళ్లపై చేసిన వ్యాఖ్యలు క్షమించరాని నేరమన్నారు. రాజకీయ, మీడియా ముసుగులో వికృత పోకడలు పోతున్నారంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వికృత పోకడలను తీవ్రంగా ఖండిస్తున్నాని ఆయన పేర్కొన్నారు. స్త్రీ జాతికి వైఎస్ జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలను వైఎస్ జగన్ ఇప్పటికీ ఖండించక పోవడం విచారకరమని తెలిపారు. రాజధానిపై విషం చిమ్మే కుట్రలో భాగమే ఇలాంటి వ్యాఖ్యలని సీఎం చంద్రబాబు వివరించారు. మహిళలపై ఉద్దేశపూర్వకంగా, నీచాతినీచంగా మాట్లాడారన్నారు. మొత్తం మహిళా సమాజాన్నే అవమానించారన్నారు. ఇలాంటి నీచ సంస్కృతికి కూటమి ప్రభుత్వం చెక్ పెడుతుందని స్పష్టం చేశారు. విష సంస్కృతికి తిరుగుబాటుగా గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. అయినా వారి వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు.

**రాజధాని అమరావతిపై వైఎస్ జగన్‌కు ఎందుకంత అక్కసు?**

ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. అమరావతి మహిళలపై నీచమైన వ్యాఖ్యలు చేయడం దారుణమని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఇలా మాట్లాడటం సరికాదన్నారు. రాష్ట్ర గౌరవాన్ని దిగజార్చేలా సాక్షి చానల్‌లో మాట్లాడారన్నారు. రాజధాని అమరావతిపై వైఎస్ జగన్‌కు ఎందుకంత అక్కసు? అంటూ ఆమె ప్రశ్నించారు. అమరావతి అంటే వేల మంది రైతుల త్యాగమని ఈ సందర్భంగా ఆమె అభివర్ణించారు. అమరావతి వేశ్యల రాజధాని అని హీనంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆ పార్టీ నేతలపై మండిపడ్డారు. ఏపీ అభివృద్ధి చెందుతోందని వైసీపీ నేతల్లో అక్కసు మొదలైందన్నారు. రాజధాని అమరావతిపై అక్కసు వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. అసభ్య వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీని వెనుక ఎవరున్నా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. వైఎస్ జగన్‌రెడ్డి, భారతీరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సాక్షి చానల్‌పైనా చర్యలు ఉంటాయని హోంమంత్రి అనిత హెచ్చరించారు. జర్నలిస్టు కృష్ణంరాజు తప్పు చేశాడని.. అతని భార్య, కూతురుని ట్రోల్ చేయడం తప్పని మంత్రి అనిత పేర్కొన్నారు.

## రాజధానిపై కుట్రలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవు

-మొదటిపేజీ తరువాయి

లేదంటూ సాక్షి ఛానల్ తప్పించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. కులముద్రలు వేసి మహిళలను అవమానిస్తున్నారంటూ ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇక్కడ విలసిల్లిన బౌద్ధాన్నీ అవహేళన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి ప్రాంతానికి బలమైన చారిత్రక, ఆధ్యాత్మిక, బౌద్ధ ధర్మ నేపథ్యం ఉన్న విషయాన్ని విస్మరించవద్దని చెప్పుకొచ్చారు. రాజధాని కోసం భూములిచ్చిన వారిలో 32 శాతం ఎస్సీ, ఎస్టీ.. 14 శాతం బీసీ రైతులు ఉన్నారని వివరించారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు చెందిన సాక్షి మీడియాలో చర్చ కార్యక్రమం వేదికగా చేసిన కామెంట్లు ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతున్నాయి. అయితే ఈ చర్చ కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను.. ఈ ప్రోగ్రామ్‌లో కొమ్మినేని శ్రీనివాసరావు ఖండించకపోగా.. ఆయన వ్యంగ్యంగా కామెంట్ చేయడంపైనా పెద్దఎత్తున ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇక ఆ మీడియా యాజమాన్యం సైతం దీనిని సమర్థించుకొనే విధంగా.. ఈ వ్యవహారంతో తమకు సంబంధం లేదని స్పష్టం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. ఇప్పటికే ఈ వ్యాఖ్యలపై రాజధాని ప్రాంత రైతులు, మహిళలు పెద్దఎత్తున ఉద్యమ బాట పట్టారు. 24 గంటల్లో స్పందించకుంటే.. సాక్షి కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాంటి వేళ ఆ వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత వరుసగా స్పందించారు. మహిళలపై వ్యాఖ్యలు చేసిన వారిని వదిలిపెట్టబోమని తేల్చి చెప్పారు.

## పట్టణ పేదరిక నిర్మూలనకు కృషి..

**అమరావతి :** చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలనపై గతేడాది కాలంగా ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)కు ప్రతిష్టాత్మక స్కాచ్ అవార్డులు వరించాయి. వివిధ కేటగిరీల్లో నామినేట్ అయిన 14 ప్రాజెక్టులకుగాను 9 ప్రాజెక్ట్స్‌కు ప్లాటినం అవార్డులు దక్కించుకుంది. పట్టణ ప్రాంతాల మహిళలకు సాధికారత కల్పించడంలో ఏపీ మెప్మా కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. వివిధ పథకాల ద్వారా మహిళలకు జీవనోపాధి కల్పిస్తూ.. ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటుంది. నివాసం, బ్యాంక్ లింకేజి పథకాలు, లైవ్ లీ హుడ్ ట్రాకర్, ఈ - కామర్స్ అమ్మకాలు, స్కిల్ డెవలప్‌మెంట్, జీవనోపాధి యూనిట్లు, ప్రేరణ సఖి, వీధి వ్యాపారుల మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం, దుర్భర జీవితాన్ని గడిపే వారిని ఆర్థికంగాపైకి తీసుకువచ్చే పథకాలకు ఈ అవార్డుల వచ్చాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 20వ తేదీన న్యూఢిల్లీలో జరిగే సదస్సులో స్కాచ్ ప్లాటినం అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్. తేజ్ భరత్.. ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ అవార్డులు దక్కినందుకు సీఎం చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణతోపాటు ఇతర ఉన్నతాధికారులకు మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007 జులైలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఏర్పాటు అయింది. నగరపాలిక, పురపాలక సంస్థల్లో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లోని మహిళలతో సంఘాలను ఏర్పాటు చేసి వారికి పొదుపుతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే.

## శత్రువులు ఎక్కడో ఉండరు... టీడీపీ నేతలకు పక్కలో బల్లెంగా నేతలు

**గుంటూరు :** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుంది. ఈ ఏడాదిలోనే తెలుగుదేశం పార్టీకి చెందిన అనేక మంది కార్యకర్తలు, నేతలు హత్యకు గురయ్యారు. అయితే అనేకచోట్ల టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు ఈ హత్యలకు కారణమని గుర్తించారు. ప్రకాశం జిల్లాలో వీరయ్య చౌదరి హత్య కేసును పరిశీలించినా, తర్వాత జరిగిన పల్నాడు జంట హత్య కేసులను చూసినా.. తర్వాత తాజాగా అనంతపురంలో టీడీపీ నేత సుధాకర్ నాయుడు హత్యకు కుట్ర కోణం పరిశీలించినా వీటి వెనక ఒకే పార్టీకి చెందిన నేతలుండటం విశేషం. ఆధిపత్య పోరు, అనేక విషయాల్లో భాగస్వామ్యం మధ్య తలెత్తిన విభేదాలు వంటివి ఈ ఘటనలకు కారణాలుగా చెబుతున్నారువీరయ్య చౌదరి హత్యను పరిశీలిస్తే మద్యం, ఇసుకతో పాటు అనేక కాంట్రాక్టు పనులకు తమకు అడ్డుతగులుతున్నారని సొంత సామాజికవర్గానికి చెందిన టీడీపీ నేతలే హత్యచేయించారు. పల్నాడు జంట హత్యలు చేసింది కూడా టీడీపీ నేతలే. అయితే దీని వెనక వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు అతని సోదరుడు ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ జంట హత్యలకు పాల్పడింది మాత్రం టీడీపీకి చెందిన వారే కావడం విశేషం. ఇక తాజాగా అనంతపురంలో సుధాకర్ నాయుడును హత్య చేయడానికి భారీ స్కెచ్ వేశారు. దీని వెనక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరులు ఉన్నారన్న ఆరోపణలు బలంగా వినిపించడంతో అధినాయకత్వం కూడా సీరియస్ అయింది.గత ఎన్నికల్లో ప్రభాకర్ చౌదరిని కాదని దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ కు అధినాయకత్వం టిక్కెట్ ఇచ్చింది. కూటమికి గత ఎన్నికలలో ఫుల్లు హవా రావడంతో దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ఎన్నికయ్యారు. మొన్నటి ఎన్నికల్లో దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ గెలుపు కోసం సుధాకర్ నాయుడు తీవ్రంగా శ్రమించారు. సుధాకర్ నాయుడుకు కూడా దగ్గుబాటి ప్రసాద్ ఎన్నికల సమయంలో ప్రాధాన్యత ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. ఇద్దరూ టీడీపీ నేతలే కావడంతో పెద్దలకు ఈ సమాచారాన్ని పోలీసులు అందించారు. సుధాకర్ నాయుడును ఎస్పీ జగదీశ్ పిలిచి విచారించారు.సుధాకర్ నాయుడును హత్య చేసేందుకు ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ అనుచరులు ప్లాన్ చేశారని పోలీసులు రహస్యంగా విచారణ జరిపి నివేదిక పంపారు. దీంతో ఇద్దరు టీడీపీ నేతలు కావడంతో పాటు ఇద్దరి నేతల అవసరం పార్టీకి ఉండటంతో టీడీపీ నాయకత్వం అమరావతికి రావాలని పిలిచినట్లు తెలిసింది. ఇద్దరిలో ఎవరిది తప్పు అన్నది తేల్చి క్లాస్ పీకే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాణాలు తీసుకునేంత స్థాయిలో విభేదాలు ఎందుకు వస్తున్నాయన్న దానిపై ప్రస్తుతం టీడీపీ నాయకత్వం దృష్టి పెట్టింది.

## సంపాదకీయం


# పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు

పట్టుగొమ్మలు'పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు' అని మహాత్మాగాంధీ అన్నారు. పల్లెలు అభివృద్ధి సాధిస్తేనే దేశాభివృద్ధి సాధ్యం. అక్షరాస్యత, పరిశుభ్రత, స్వచ్ఛత, మద్యానికి దూరంగా ఉండటం, మౌలిక వసతులు కల్పన ద్వారా గ్రామాలు త్వరగా అభివృద్ధి సాధిస్తాయి. ఈ గ్రామానికి మూడు వైపుల నుంచి రెండు లైన్ల రోడ్లు, రోడ్లకిరువైపులా చెట్లతో గ్రామంలోకి స్వాగతం పలుకుతున్నట్టుగా ఉంటుంది.

గత ఎనిమిదేండ్లుగా నా పరిశోధనలో ఈ గ్రామం అన్నిరంగాల్లో స్వయం సమృద్ధి సాధించి మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. ఈ గ్రామం మత సామరస్యానికి పుట్టినిల్లు. ఈ గ్రామ జనాభా సుమారు 5,000, ఓటర్ల సంఖ్య సరిగ్గా 2400. సామాజిక వర్గాల వారీగా కుటుంబాలు ఎస్టీ: 5, ఎస్సీ: 230, బీసీ: 630, ఓసీ: 65, ముస్లిం మైనారిటీ: 40. ఈ గ్రామ రెవెన్యూ రికార్డుల ప్రకారం భూమి విస్తీర్ణం 4,192 ఎకరాలు. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 3,300 ఎకరాల భూమి ఉన్నది. ఒక కుమ్మరి సామాజిక వర్గం తప్ప అన్ని కులాల వారు, అన్ని మతాల వారున్నారు. ఇదీ స్థూలంగా ఆ గ్రామ స్వరూపం. ఆ ఊరి పేరు తునికి ఖల్సా, మండలం వర్గల్, జిల్లా సిద్దిపేట. 1950, మే 21 వరకు ఈ గ్రామాన్ని తునికి అనే పేరుతో పిలిచేవారు. ఈ ప్రాంతంలో తునికి ఆకు (బీడీలు చేసే ఆకు) ఎక్కువగా లభించడంతో తునికి అనే పేరు వచ్చినట్టు చెప్తారు. ఖల్సా అనగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా కలిగి ఉన్న భూములని అర్థం. ఈ గ్రామంలో ఇప్పటికి దాదాపు 500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. (ఖల్సా అంటే స్వచ్ఛమైనది.) 1950, మే 22 నుంచి ఈ గ్రామాన్ని తునికి ఖల్సాగా ప్రభుత్వం పేరు మార్చింది. ఈ గ్రామం చుట్టుపక్కల తునికి పేరుతో తునికి మక్త, తునికి బొల్లారం గ్రామాలున్నాయి. ఈ గ్రామం నెహ్రూ ఓఆర్ఆర్‌కు 20 కిలోమీటర్ల దూరంలో, రాజీవ్ రహదారికి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఇక్కడ అన్నిరకాల రాజకీయ పార్టీలున్నాయి. ఇక్కడి వ్యవసాయ భూములు స్థానికులకు 1,113 ఎకరాలు, స్థానికేతరులకు 1,203 ఎకరాలున్నాయి. భూమి ఉన్న కుటుంబాల సంఖ్య 534, భూమి లేని కుటుంబాల సంఖ్య 396. సామాజిక వర్గాల వారీగా భూమి ఉన్న కుటుంబాల వివరాలు: ఎస్టీ: 0, ఎస్సీ: 135, బీసీ: 363, ఓసీ: 36, మైనారిటీ: 25. ఇక్కడి ప్రజలందరూ వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడికి వంటిమామిడి కూరగాయల మార్కెట్ దగ్గరగా ఉండటంతో ఆధునిక పద్ధతిలో కూరగాయలు సాగుచేస్తారు. కూరగాయలు, ఆకుకూరలు, వరి, ఆలుగడ్డ ఇక్కడి ప్రధాన పంటలు. ప్రధాన సాగునీటి వసతి బోర్లు, చెరువు కుంటలు. కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంతో ఇక్కడ భూగర్భ జలాలు పెరిగాయి. కూరగాయలు పండించడంతో ఇక్కడ రైతు, రైతు కూలీలకు నిత్యం పని దొరుకుతున్నది. రైతులకు, రైతు కూలీలకు చేతిలో ఎప్పుడూ డబ్బులుంటాయి. సుమారు 32 జతల ఎడ్లు, 46 ట్రాక్టర్లు, 19 ట్రాలీ ఆటోలు, 5 ప్యాసింజర్ ఆటోలు, 21 కార్లు, దాదాపు ప్రతి ఇంటికి ఒక సైకిల్ మోటార్ ఉన్నాయి. చాలామందికి పాలిచ్చే బర్రెలున్నాయి. 80 శాతం మంది అక్షరాస్యులే. ఇంత పెద్ద గ్రామంలో ఒక హోటల్, ఒక స్వీట్‌షాప్, ఐదు బెల్ట్ షాపులు మాత్రమే ఉన్నాయి. యువత కూడా వ్యవసాయం పనులు, రకరకాల కంపెనీలలో ఎవరి పనులకు వారు వెళ్లిపోవడం మూలంగా ఇక్కడ ఆరోగ్యకరమైన వాతావరణం ఉన్నది. ఇక్కడి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటున్నది. తక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. రెండు కుటుంబాలు మినహా దాదాపు అన్ని కుటుంబాలు వారి స్తోమతకు తగ్గట్టుగా అవసరాలు తీర్చుకునే స్థితిలో ఉన్నారు. ఇక్కడ పంచాయితీలు చాలా తక్కువ. చిన్న, చిన్న పంచాయితీలను కూడా గ్రామ పరిధిలో పరిష్కరించుకుంటారు. పోలీస్ స్టేషన్ వరకు ఈ గ్రామస్థులు పోరు అంటే అతిశయోక్తి కాదు. రాజకీయాలు, రాజకీయ పార్టీలు ఎన్నికల వరకే, ఎన్నికల తెల్లారి చాలా ఆత్మీయంగా కలిసి ఉంటారు. ఈ గ్రామం వర్గల్ మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ గ్రామ పంచాయతీలో 12 వార్డులున్నాయి. గ్రామ పంచాయతీలో 9 మంది సిబ్బంది పనిచేస్తారు. ఒక ట్రాక్టర్ ఉన్నది. గ్రామం ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంటుంది. ఐదు వాటర్ ట్యాంకులు, ప్రతి ఇంటికి మిషన్ భగీరథ, వంటగ్యాస్ కనెక్షన్ ఉన్నది. వ్యక్తిగత మరుగుదొడ్లున్నాయి. ఇక్కడ ఎక్కువగా ఆర్‌సీసీ ఇండ్లున్నాయి. ఈ ఊరు మాంసం విక్రయాలకు పేరుగాంచింది. గ్రామంలోని ప్రతి వీధికి సూచిక బోర్డులను ఏర్పాటుచేశారు. పార్కు, పార్కులో తెలంగాణ తల్లి, బతుకమ్మ విగ్రహాలు, జాతీయ జెండా ఉన్నది. గ్రామంలో చాలామంది జాతీయ నాయకుల విగ్రహాలున్నాయి. ఈ గ్రామంలో నూతన పంచాయతీ భవనం, జాతీయ బ్యాంకు, కరెంటు సబ్‌స్టేషన్, శ్మశానవాటిక, హైస్కూల్, ప్రైమరీ స్కూల్, అంగన్వాడీ కేంద్రం, ప్రైవేట్ పాఠశాల, రైతువేదిక, గ్రామ దేవతలు, అన్ని కులాలకు చెందిన పెద్ద పెద్ద దేవుని గుళ్లు, మసీదులున్నాయి. ఏటా ఏదో ఒక కులంవారు వారి వారి కులదేవతలకు పెద్ద ఎత్తున పండుగలు చేస్తారు. ఊరు నిండా సిమెంట్ రోడ్లు. గత ప్రభుత్వంలో 98 డబుల్ బెడ్‌రూంలు కట్టి అర్హులకు అందజేశారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా/ చేయూత పింఛన్ల వంటి పథకాలతో పాటు వృద్ధాప్య పింఛన్లు 179, వితంతు పింఛన్లు 184, వికలాంగుల పింఛన్లు 36, బీడీ వర్కర్స్ పింఛన్ 18, ఒంటరి మహిళల పింఛన్లు 9 మందికి వస్తున్నది. అటు వ్యవసాయం, ఇటు కంపెనీలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల మూలంగా ప్రజల చేతిలో డబ్బులాడుతున్నాయి. గత ఎనిమిదేండ్ల నా పరిశోధనలో ఈ గ్రామం స్వయం సమృద్ధి సాధించి ఆర్థికపరమైన ఇబ్బందులకు గురికాకుండా ఉన్నది. గత పదేండ్లుగా ఒక రైతు, ఇద్దరు రైతుకూలీలు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ గ్రామంలో ప్రస్తుతం ఒక ఎకరా భూమి ధర రూ. ఒక కోటి పైన పలుకుతున్నది. పనిలో, సమష్ఠి నిర్ణయాలలో, గ్రామాభివృద్ధిలో ఈ గ్రామం మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నది.

# కులగణన ఎలా జరగాలి

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కులగణన నిర్ణయం వెనుకబడిన కులాలకు సామాజిక న్యాయాన్ని అందించడంలో ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించనుంది. 2011లో జనగణనలో కులగణన చేస్తామని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ప్రకటించి, మరుసటి రోజే మళ్లీ అలా చేయబోమని, ప్రత్యేకించి సామాజిక, ఆర్థిక, కులగణన చేస్తామనీ చెప్పి, ఆ సోషల్ ఎకానమిక్ క్యాస్ట్ సెన్సెస్ రిపోర్టు కూడా బయటపెట్టలేదు. తర్వాత ఆ సెన్సెస్‌లో తప్పులున్నాయని చేతులు దులుపుకుని, రిపోర్ట్‌ను బుట్టదాఖలు చేసింది. అలా ఐదువేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. ఈసారైనా కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణనను చిత్తశుద్ధితో చేయాలి. గత అనుభవాల దృష్ట్యా కులగణనను పారదర్శకంగా, నిజాయితీతో జరపాలి. ఈ దిశగా పలు పద్ధతులను పాటించాల్సిన అవసరం ఉంది. 1) కుల గణన సెన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలోనే జరగాలి. గతంలో కాంగ్రెస్ సోషియో, ఎకానమిక్ కులగణన చేసినప్పుడు గ్రామీణ ప్రాంతంలో రూరల్ డెవలప్‌మెంట్ శాఖ, పట్టణ ప్రాంతంలో అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ వారు దాన్ని చేపట్టారు. వీరికి ఆ వృత్తి నైపుణ్యం లేక ఆ సెన్సెస్ తప్పుల తడకగా మారింది. సెన్సెస్ డిపార్ట్‌మెంట్‌లో శిక్షణ పొందిన అధికారుల ద్వారా జరిగితేనే ఈ ప్రక్రియకు ఒక విశ్వసనీయత ఏర్పడుతుంది. 2) కులగణన జనగణనలో అంతర్భాగం కావాలి. దీని కొరకు సెపరేట్ ఫారం ఉండకూడదు. ఉంటే కొత్త సమస్యలు పుట్టుకొస్తాయి. 3) ఈ సెన్సెస్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల లెక్కలు మాత్రమే గాక, అన్ని కులాల లెక్కలు తీయాలి. అదే విధంగా ముస్లింలలో, క్రిస్టియన్స్‌లో ఉన్న కులాల లెక్కలు కూడా గణించాలి. 4) ప్రతి కులానికి ఒక కోడ్ నంబర్ ఇవ్వాలి. లేదంటే అనేక కులాలు పుట్టుకు వచ్చి డాటా స్వచ్ఛత దెబ్బ తింటుంది. ఉదాహరణకు ఒకే కులాన్ని ఒకే రాష్ట్రంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. ఉదాహరణకు చాకలి వారిని కొన్ని ప్రాంతాల్లో రజక అంటారు, కొన్ని ప్రాంతాల్లో ధోబి అంటారు. వీరందరినీ ఒకే కోడ్ నంబర్‌లోకి తీసుకొచ్చినట్టయితే కులాల లెక్కలు సరిగ్గా వస్తాయి. అలాగే ఓసీ కులాలకు కూడా కోడ్ నంబర్ ఇవ్వాలి. రాష్ట్రాలవారీ కులాల లిస్టులను తయారుచేసి వాటికి కోడ్ నెంబర్ ఇచ్చి పేపర్ ప్రకటనలు ఇవ్వాలి. ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత తుది లిస్టును ప్రకటించాలి. ముస్లిం, క్రిస్టియన్ మతాలలోని కులాల క్రోడీకరణ జరగాలి. 5) ప్రస్తుతమున్న సెన్సెస్ ఫారంలో కాలం నెంబర్ 8లో కులాల వివరాలు తెలియపరచవలసి ఉంటుంది. కాలం నెంబర్ 8లో ఎస్సీ అయితే ఎస్సీ అని టిక్ చేసి కింద 8%బీ%లో ఏ కులమో తెలియచేయాలి. అదేవిధంగా ఎస్టీ అయితే ఎస్టీ అని టిక్ చేసి క్రింద 8%దీ%లో తెగ వివరాలు చెప్పాలి. ఇక్కడ




బీసీ లేదా ఓబీసీ అనే కాలమ్ సృష్టించాలి. దాని కింద బీసీ, ఓబీసీ అనే కాలమ్స్ ఉండాలి. ఎందుకంటే, ఉదాహరణకు తెలంగాణలో 134 కులాలు బీసీ లిస్టులో ఉన్నాయి. కాని కేంద్ర ఓబీసీ లిస్టులో 86 కులాలు మాత్రమే ఉన్నాయి. మరి అక్కడ వ్యక్తి ఏ విధంగా సమాధానం ఇవ్వాలి అన్న ప్రశ్న ఉద్భవిస్తుంది. రాజ్యాంగ రీత్యా ఆర్టికల్ 342%బీ%1 ప్రకారం కేంద్రం తన స్వంత ఓబీసీ లిస్ట్‌ను కలిగి ఉండవచ్చును. అదేవిధంగా రాష్ట్రాలు ఆర్టికల్ 342%బీ%3 ప్రకారం తమ స్వంత లిస్ట్ కలిగి వుండవచ్చు. అందువలన ఈ రెండు కాలమ్స్ ఉండటం శ్రేయస్కరం. అయితే మొదట ఈ లిస్టులు పత్రికలలో ప్రకటించాలి. అలాగే ఓసీ కాలమ్ కూడా సృష్టించాలి. అక్కడ కూడా కింద కులాల లిస్ట్ కోడ్ నంబర్లతో ఉండాలి. ముస్లిం, క్రిస్టియన్ ఇతర మతాలకు కూడా కాలమ్స్ సృష్టించాలి. వారి కులాలను కూడా క్రోడీకరించి కోడ్ నంబర్స్ ఇవ్వాలి. 6) ప్రస్తుత సెన్సెస్ ఫార్మేట్‌లో 29 కాలమ్స్ మాత్రమే ఉన్నాయి. ఇందులో ఆర్థికపరమైన డాటా పెద్దగా సేకరించడం లేదు. కేవలం కుల డాటా సేకరించి భూమి, ఆర్థిక వివరాల డాటా సేకరించకపోతే బీసీల సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం తేటతెల్లం కాదు. కాబట్టి సెన్సెస్ కాలమ్స్ కొన్ని పెంచాలి. అదేవిధంగా ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఓటర్ ఐడి కార్డ్స్ సమాచారాన్ని కూడా సేకరించాలి. 7) ఈ సెన్సెస్‌ను జాతీయ జనాభా రిజిస్టర్‌కు లింక్ చేయకుండా ఉంటే మంచిది. లేనట్టయితే అనవసర రాజకీయాలకు దారితీసి డాటా సమగ్రత దెబ్బతినే అవకాశం ఉంది. 8) సెన్సెస్‌లో డాటా సేకరణ డిజిటల్‌గాను, మాన్యువల్‌గాను కూడా జరగాలి. కొండ ప్రాంతాలలో సెల్ ఫోన్ సిగ్నల్స్ తక్కువ కాబట్టి మాన్యువల్ సెన్సెస్ ఉపయుక్తం. 9) సేకరించిన సమాచారం గోప్యంగా ఉంచాలి. అది వ్యక్తి ప్రైవసీకి భంగం కలగకుండా భద్రపరచాలి. 10) సెన్సెస్ ఆఫ్ ఇండియా ఆక్ట్ 1948 ద్వారా సెన్సెస్ జరుగుతుంది. ఇప్పుడు అన్ని మతాలలోని కులాల జనగణన జరుగుతుంది కాబట్టి ఆ సెన్సెస్ చట్టాన్ని కూడా అవసరమైన మేరకు సవరించాలి. అదేవిధంగా ఒక స్వతంత్ర సెన్సెస్ కమిషన్ వేసి ప్రజాభిప్రాయం ద్వారా ఫార్మేట్స్‌ను రూపొందించి చట్టంలో కావాల్సిన మార్పులు చేర్పులు చేసి ఈ కులగణనను చేయాలి. 11) భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టే అన్ని సర్వేలలో కూడా ఓబీసీ కాలమ్స్ చేర్చి వివరాలు సేకరించాలి. 12) కేంద్ర ప్రభుత్వం కులగణన షెడ్యూల్‌కు ఎంతోముందునుంచే తగు ప్రచారాన్ని కల్పించాలి, ప్రజలను సమాయత్త పరచాలి. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవికత. కులం ఎక్కడ ఉందో అక్కడ వివక్ష కూడా ఉంటుంది. అందుకే ఈ కులగణన ఒక రోగ నిర్ధారణ పరికరం. రోగం సరిగా తేలితే అప్పుడు చికిత్స సులభం. కాబట్టి ఈ ప్రక్రియ మొత్తం పారదర్శక విధానాలతో జరగాలి. భారతదేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా, మానవ అభివృద్ధి సూచీలో 130వ ర్యాంకులోనే మిగిలిపోయింది. ఈ కులగణన ద్వారా సామాజిక, ఆర్థిక, అవసరమైతే రాజకీయ అంశాలను లెక్కించి రాబోయే కాలంలో తగు విధాన నిర్ణయాలు, ప్రణాళికలు రచించి మానవాభివృద్ధి సూచికలలో, ముఖ్యంగా విద్యా ఆరోగ్యాలలో మన స్థానాన్ని మెరుగుపరుచుకోవచ్చు.

# సైద్ధాంతిక నిబద్ధతకు నిలువుటద్దం

నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, ఏళ్ళతరబడి ఉద్యమాల్లో, అజ్ఞాత వాసంలో గడిపిన అలుపెరుగని కమ్యూనిస్టు నిస్వార్థ పోరాట యోధుడు చండ్ర రాజేశ్వరరావు. కమ్యూనిస్టు పార్టీకి ఆరున్నర దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో సేవలందించిన నిబద్ధత కలిగిన మహా నేత రాజేశ్వరరావు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి 28 సంవత్సరాల సుదీర్ఘ కాలం నేతృత్వం వహించిన రాజేశ్వరరావు జీవితం సైద్ధాంతిక నిబద్ధతకు, నిజాయితీకి నిలువుటద్దం. చండ్ర రాజేశ్వరరావు భారత కమ్యూనిస్టు పార్టీ తొలితరం అగ్రనాయకుల్లో ఒకరు. పేరుకు తగినట్టుగానే ప్రత్యర్థులపై చండ్ర ప్రచండత్వం ప్రదర్శించేవారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులతో మమేకమైన కమ్యూనిస్టు ఆయన. ఎంతటి వారితో నైనా తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించేవారు. నెహ్రూ, ఇందిరాగాంధీలు తీసుకున్న నిర్ణయాల్లో ప్రజోపయోకరాలను సమర్థించినా, నిరంకుశ చర్యలను వ్యతిరేకించిన నిష్పక్షపాతి ఆయన.పీడిత, తాడిత జనోద్ధరణ కోసం ఎంతో ఉజ్వలమైన భవిష్యత్‌ను వదులు కుని కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించిన ఆయన పేదల హృదయాల్లో చిర స్థాయిగా నిలిచారు. పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, తరిమెల నాగిరెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి, తదితర పార్టీ అగ్రనాయకులతో కలిసి, దశాబ్దాల పాటు రాష్ట్రంలోనే కాక, దేశంలోని పలు ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేశారు. కృష్ణా జిల్లా చల్లపల్లి మండలంలోని మంగళాపురం గ్రామంలో 1914 జూన్ ఆరవ తేదీన పెద్ద భూస్వాముల కుటుంబంలో జన్మించిన రాజేశ్వరరావు కమ్యూనిస్టు పార్టీలో చేరిన తరువాత ఆ భూస్వాములకు వ్యతిరేకంగా, భూమి లేని నిరుపేదల తరఫున దశాబ్దాలపాటు పోరాటం జరిపారు. రాజేశ్వరరావు ప్రాథమిక విద్యాభ్యాసం మంగళాపురంలో, సెకండరీ విద్య చల్లపల్లిలోనూ సాగింది. బందరు హిందూ స్కూలులో ఎస్సెస్సెల్సీ పూర్తిచేశారు. విద్యార్థి దశలోనే రాజేశ్వరరావు క్రీడాకారునిగా, పేదల పాలిట ఆత్మీయునిగా పేరొందారు. మహాత్మా గాంధీ పిలుపుపై సాగిన ఉప్పు సత్యాగ్రహంలో వలంటీర్‌గా పని చేశారు. యుక్తవయసులోనే విప్లవ భావాల పట్ల ఆకర్షితులయ్యారు. మహాత్మాగాంధీ ఉద్యమాల్లో పనిచేస్తున్నా, విప్లవ కిశోరాలైన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ వంటివారి పట్ల ఆరాధనా భావాన్ని పెంచుకున్నారు. బెనారస్ హిందూ యూనివర్శిటీలో చదువుకుంటున్న రోజుల్లోనే ఆయన హిందూ, ముస్లిం ఐక్యత కోసం ఎంతోకృషి చేశారు. కమ్యూనిస్టు నాయకులను ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం మీరట్ కుట్ర కేసులో ఇరికించి జైళ్ళలో పెట్టినప్పుడు వారు విడుదల చేసిన ప్రకటన రాజేశ్వరావును ఉత్తేజపర్చింది. వామపక్ష భావాలున్న విద్యార్థులందరినీ ఐక్యపర్చి సాటి విద్యార్థులతో కలిసి ఒక స్టడీ సర్కిల్‌ని ఏర్పాటు చేశారు. తరువాత అది 'యంగ్ కమ్యూనిస్టు లీగ్'గా అవతరించింది.బెనారస్ హిందూ యూనివర్శిటీలో చదువుకునే రోజుల్లోనే మతవాద, మితవాద వర్గాలను ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి రాజేశ్వరరావు. తరచుగా



ఘర్షణలకు దిగడం, కమ్యూనిస్టు వర్గానికి నాయకత్వం వహించడంతో బిఎస్సీ పూర్తి కాకముందే ఆయన యూనివర్శిటీ నుంచి టీసీ తీసుకుని బయటికి వచ్చారు. బెనారస్‌లో ఉండగానే ఆయన లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యారు. జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ రష్యా సందర్శించి వచ్చిన తరువాత సోషలిజం, స్వాతంత్ర్య పోరాటంలో కార్మిక, కర్షక పాత్ర, వర్గ సంఘాలు, వర్గ పోరాటాల పేరిట రాసిన వ్యాసాలు రాజేశ్వరరావును విశేషంగా ఆకర్షించాయి.అదే సందర్భంలో ఆయన మహాత్మా గాంధీని కలిసిన విద్యార్థి బృందంలో ఉన్నారు. తరువాత ఆయన విశాఖలో మెడిసిన్‌లో చేరినా, ఆయన కమ్యూనిస్టు భావాల ప్రచారానికి నిడమర్తి ఉమారాజేశ్వరరావు ప్రభృతులతో కలిసి స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేశారు. కమ్యూనిస్టు భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఉద్యమంలో చురుకుగా పాల్గొనడం వల్ల ఆయన చదువు బెనారస్‌లోనూ, విశాఖలోనూ సవ్యంగా సాగలేదు. తండ్రి అభిమతానికి వ్యతిరేకంగా ఆయన సావిత్రమ్మతో వివాహాన్ని అతి నిరాడంబరంగా దండల మార్పుతో చేసుకున్నారు. వారి వివాహానికి ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు మద్దూరి అన్నపూర్ణయ్య పెళ్ళిపెద్దగా వ్యవహించారు. సావిత్రమ్మ కూడా భర్త మార్గంలోనే కమ్యూనిస్టు ఉద్యమం ప్రచారం కోసం జీవితాంతం కృషిచేశారు. వివాహానికి గుర్తుగా మెడలో వేసుకున్న గొలుసు రాయిని తీయించి ఎర్ర నక్షత్రాన్ని వేసుకోవడం ఆమె నిబద్ధతకు నిదర్శనం. పార్టీ నిర్ణయం మేరకు పూర్తి కాల కార్యకర్తగా పనిచేయడం కోసం ఆమె శాంతినికేతన్‌లో చదువు కోవాలనే ఆకాంక్షను బలవంతంగా అణగ దొక్కుకున్నారు. కృష్ణా జిల్లాలో కమ్యూనిస్టుపార్టీ విస్తరణకు రాజేశ్వరరావు దంపతులు విశేషంగా కృషిచేశారు. కార్మిక, కర్షక సంఘాలను ఏర్పాటు చేసి, మంగళాపురం కూలీల పోరాటానికి, చల్లపల్లి జమిందారు అక్రమాలపై ఉద్యమానికి నేతృత్వం వహించారు. కృష్ణాజిల్లా తిరువూరు తాలూకాలో నైజాం సరిహద్దున ఉన్న తునికిపాడుకు వచ్చిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి ప్రభృతులు నైజాంలో పరిస్థితి గురించి వివరించారు. ఆ క్రమంలోనే రాజేశ్వరరావుకు... ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చిర్రావూరి లక్ష్మీనరసయ్య ప్రభృతులు కూడా రావడంతో వారందరితో రాజేశ్వరరావుకు పరిచయాలు ఏర్పడ్డాయి. క్రమంగా తెలంగాణాలో అనేకసార్లు పర్యటించి తెలంగాణలో పార్టీ నిర్మాణానికీ, భువనగిరి ఆంధ్ర మహాసభ నిర్వహణకు తోడ్పడ్డారు. తెలంగాణా కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకులను సమన్వయ పర్చడంలో,సాయుధ పోరాటంలో కీలకపాత్ర వహించారు. భారత విప్లవోద్యమం గురించి స్టాలిన్‌తో చర్చించేందుకు అజయ్ ఘోష్, ఎస్ఏ డాంగే, బసవ పున్నయ్యలతో పాటు రాజేశ్వరరావు మాస్కో వెళ్ళారు. రాజేశ్వరరావు ఎంత పెద్ద నాయకుడైనా ఏమాత్రం అభిజాత్యాన్ని ప్రదర్శించకుండా, నిరంతరం ఏదో తెలుసు కోవాలనే తపనతో ఉండేవారు. పుచ్చలపల్లి సుందరయ్య పట్ల ఎంతో గౌరవం ఉన్నా, అవిభక్త కమ్యూనిస్టు పార్టీ చీలినప్పుడు ఆయన భారత కమ్యూనిస్టు పార్టీకి నేతృత్వం వహించారు. రాజేశ్వరరావు సిద్ధాంతాలతో ఏనాడూ రాజీ పడలేదు. ఇందిర ప్రభుత్వం తీసుకున్న ప్రగతి శీల చర్యలకు మద్దతు ఇస్తూనే, ఆమె నిరంకుశ పోకడలను తీవ్రంగా వ్యతిరేకించే వారు. 1970వ దశకంలో దేశవ్యాప్తంగా కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో సాగిన భూ ఆక్రమణ ఉద్యమం పార్టీ ప్రతిష్ఠను పెంచి, అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ ఉద్యమం విజయవంతం కావడంలో రాజేశ్వరరావు పాత్ర గణనీయం. ఆయన పిత్రార్జిత ఆస్తిలో తన వాటాను పూర్తిగా పార్టీకోసం వెచ్చించారు. పార్టీకి ఆయన విరాళంగా ఇచ్చిన లక్షలాది రూపాయిలతో ఆరోజుల్లో వందలాది ఎకరాలను కొనగలిగి ఉండేవారనేది వాస్తవం.ఆయన ఢిల్లీ వెళ్ళినా,ఎక్కడికి వెళ్ళినా పార్టీ కార్యాలయాల్లోనే బస చేయడం, తన బట్టలను తానే ఉతు క్కోవడం నిరాడంబర జీవితం తానికి ప్రబల నిదర్శనాలు. అక్టోబర్ విప్లవం 60వ వార్షికోత్సవాల సందర్భంగా భటిండాలో జరిగిన పార్టీ మహాసభలో ఆమోదించిన తీర్మానం చరిత్రాత్మకమైనది. రాజేశ్వరరావు సోవియట్ యూనియన్‌లో గోర్బాచెవ్ ప్రవేశపెట్టిన సహకార వ్యవసాయం, కాంట్రాక్ట్ సేద్య విధానాలను రాజేశ్వరరావు సమర్థించారు. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తరువాత సంభవించిన పరిణామాల పట్ల ఆయన చివరి రోజుల్లో ఎంతో కలత చెందారు. ప్రపంచంలో ఎక్కడ ప్రగతి శీల పోరాటాలు జరిగినా వాటికి ఆయన మద్దతు ప్రకటించేవారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు అనేక సమస్యలపై ఒకే అభిప్రాయాన్ని కలిగి ఉన్నప్పటికీ, సిపిఎం వ్యతిరేక ధోరణి వల్ల ఉభయ కమ్యూనిస్టు పార్టీల పునరేకీకరణ ప్రక్రియ ఆలస్యమవుతోందని ఆవేదన చెందేవారు. ఆయన ఎన్నో పురస్కారాలను పొందినా,1994 లో పొందిన సోవియట్ యూనియన్ ఆర్డర్ ఆఫ్ లెనిన్ పురస్కారం అత్యంత ప్రతిష్ఠాకరమైనది. సుదీర్ఘకాలం పార్టీకోసం అహర్నిశలు కృషిచేసిన రాజేశ్వరరావు 80 వ ఏట 1994 ఏప్రిల్ 9వ తేదీన హైదరాబాద్‌లో కన్నుమూశారు.

# కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు పై ఉన్న శ్రద్ధ ప్రజలకి ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారు.

మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి..

**పాతపట్నం జూన్08, ప్రజా జ్యోతి న్యూస్..** టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలకు అన్యాయం జరుగుతోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' వంటి హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆగ్రహం వ్యక్తం చేసారు. ముఖ్యంగా 'ఆడబిడ్డ నిధి' పథకం పేరుతో మహిళలను మోసం చేశారన్నారు. సంవత్సరానికి రూ.18,000 ఇస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని, ఈ పథకానికి 'సమాధి కట్టారన్నారు. సుమారు 1.80 కోట్ల మంది అర్హులైన మహిళలకు 'పంగనామం' పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం అమలు చేసిన 'వైఎస్సార్ ఆసరా', 'అమ్మ ఒడి' వంటి పథకాలను టీడీపీ కూటమి నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వ మోసపూరిత వాగ్దానాలు మహిళలకు శాపంగా మారాయని అన్నారు. 'ఆడబిడ్డ నిధి' పథకం రద్దు పేద, మధ్యతరగతి కుటుంబాలకు తీరని అన్యాయమని, ఆడపిల్లల చదువు, పెళ్లి ఖర్చులకు ఆర్థిక భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమానికి వ్యతిరేకంగా పనిచేస్తోందని, ఇది ఆడపిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్నా, ఎన్నికల్లో ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీలతో పాటు 143 వాగ్దానాల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. పిల్లలు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, రైతులు అందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పాఠశాలలు, ఆసుపత్రులు సహా అన్ని రంగాలు తిరోగమనంలో ఉన్నాయన్నారు. 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలుతో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలు, బాలికలు, దళితులకు రక్షణ కరువైందన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి అమ్మ ఒడి కింద రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి ఎగనామం పెట్టారని, గతేడాది బకాయిలతో కలిపి ప్రతి పిల్లాడికి ఈ ఏడాది రూ.30వేలు చొప్పున 'అమ్మకు వందనం' పథకాన్ని అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తొలి ఏడాది ఎగ్గొట్టారని, ఈ హామీని వెంటనే అమలు చేయాలన్నారు. దీపం పథకంలో ప్రతి కుటుంబానికి ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించినా, ఈ పథకాన్ని వెంటనే సంతృప్త స్థాయిలో అమలు చేయాలని, మూడు గ్యాస్ సిలిండర్ల డబ్బులను నేరుగా లబ్ధిదారులైన మహిళల ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు. వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో "జగనన్న ఈబీసీ నేస్తం" పథకం ద్వారా అగ్ర కులాల్లోని పేద మహిళలకు ఆర్థిక సహాయం అందించబడింది. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం అగ్ర కులాల్లోని పేద మహిళల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. అగ్ర కులాల్లోని పేదల కోసం ఎటువంటి ప్రత్యామ్నాయ పథకాలు అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు .స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవింద రావు ఇసుక



అక్రమ త్రవ్వకాలు, కబ్జాలతో సంపాదన ఆర్జిస్తున్నారని, నియోజకవర్గ అభివృద్ధి శూన్యం అన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, దీనివల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆమె హెచ్చరించారు.

## మహిళలను కించపరిచిన వారిపై చర్యలు చేపట్టండి..

రాజధానిపై విషం కక్కి మహిళలను కించపరచడం పై ఆగ్రహం వ్యక్తం చేసిన పాతపట్నం మహిళలు..

పాతపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన తెలుగు మహిళలు




**పాతపట్నం జూన్ 08 ప్రజాజ్యోతి న్యూస్** ఇటీవల సాక్షి టీవీ లైవ్ డిబేట్ లో అమరావతి వేశ్యల రాజధాని అంటూ రాజధాని నిర్మాణం పైన రాష్ట్ర మహిళలు పైన కించపరిచే విధంగా విమర్శలు చేయడం పట్ల తమ మనోభావాలు దెబ్బతిన్నాయని పాతపట్నం మండల తెలుగు మహిళలు పాతపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది రాజధాని నిర్మాణం పైన మరియు మహిళల పైన ఆరోపణలు చేసిన సాక్షి టీవీ యాజమాన్యం పైన, కొమ్మినేని శ్రీనివాసరావు,వివిఆర్ కృష్ణంరాజుల పై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు ఫిర్యాదు చేసిన వారిలో పాతపట్నం మండలం తెలుగు మహిళా అధ్యక్షురాలు బంటుపల్లి జయలక్ష్మి,రోహిణి, అనుమంచిపల్లి శ్రావణి తదితరులు ఉన్నారు..

## పామిడి పట్టణంలో పదో వార్డులో నివాసముంటున్న బోయ పాండు కిడ్నీ వ్యాధితో ఆదివారం ఉదయం మరణించారు






**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** పామిడి పట్టణంలో పదో వార్డులో నివాసముంటున్నటువంటి బోయ పాండు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆదివారం ఉదయం మరణించారు జనసేన పార్టీ నాయకులు ఏమాత్రం ఆలోచన చేయకుండా అభాగ్యులకు అండగా జనసేన పార్టీ నాయకులు పాండు తల్లి లక్ష్మమ్మకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమంలో లాయర్ సతీష్ కత్రిమల సుబ్బు వడ్డే రాము శరత్ జమీర్ షేక్షావలి రోషన్ సలీం తదితరులు పాల్గొన్నారు

## ముగిసిన వేసవి కంప్యూటర్ శిక్షణ తరగతులు

**గుంతకల్లు జూన్ 8 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు పట్టణంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ లో వేసవి కాలం సెలవుల్లో శిక్షణ పొందిన 150 మంది విద్యార్థు లకు శస్త్ర జూనియర్ కళాశాల లో థియరీ పరీక్షలు నిర్వహిం చినట్లు సంస్థ డైరెక్టర్ టి.జయన్న ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పరీక్ష పత్రాలను కళాశాల కరస్పాండెంట్ బి.శేఖర్ మరియు గుత్తి బ్రాంచి డైరెక్టర్ అరుణ్ కుమార్ విడుదల చేశారు.ఈ పరీక్ష లను గుత్తి బ్రాంచి డైరెక్టర్ అరుణ్ కుమార్ పర్యవేక్షణలో సజావుగా జరిగాయి.పరీక్షలు అనంతపురం సంస్థ డైరెక్టర్ జయన్న మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రతీ విద్యార్థి కి కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి మారుతున్న టెక్నాలజీ పరంగా ప్రతీ ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానా న్ని అలవరుచుకొని నూతన నైపుణ్యాలను పెంపొందించు కోవడానికి నిరంతరం ప్రయత్ని స్తూ ఉండాలని తెలిపారు. అదేవిదంగా వేసవి కాలం శిక్షణ తదనంతరం డిగ్రీ, డిప్లొమా,బిటెక్ విద్యార్థులకు మరియు



నిరుద్యోగులకు కంప్యూటర్ శిక్షణ ను కొనసాగి స్తూ వారిని స్వయం ఉపాధి వైపు అడుగులు వేయించడం జరుగుతున్నదని గత 19 సంవత్సరాలుగా ఎంతోమంది నిరుద్యోగులు శిక్షణ పొంది వివిధ రంగాలలో స్థిరపడినట్లు జయన్న తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎక్జామినర్ నరేష్ మరియు సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజధాని నిర్మాణం పై అక్కసుతోనే వైసిపి వారు కించపరిచే వ్యాఖ్యలు చేస్తున్నారు

**పాతపట్నం జూన్ 8 ప్రజా జ్యోతి న్యూస్.** ఆంధ్రప్రదేశ్ కు రాజధాని లేకుండా చేయడమే జగన్ అజెండా.. మహిళల పై కించపరిచే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం...పాతపట్నం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు. సాక్షాత్తు దేశ ప్రధానమంత్రి విచ్చేసి శంకుస్థాపన చేసిన ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణం పై ఇటీవల సాక్షి ఛానల్ లైవ్ చర్చా వేదికలో ప్రముఖ జర్నలిస్టులుగా చలామణి అవుతున్న వైసిపి సానుభూతిపరులు కొమ్మినేని శ్రీనివాసరావు,వివిఆర్ కృష్ణంరాజులు అమరావతి వేశ్యల రాజధాని అంటూ రాజధాని పైన మహిళ పైన అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నామని పాతపట్నం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పైల బాబ్జి అన్నారు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల ఈరోజు పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలోని శాసనసభ్యులు వారి కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ మొదటినుంచి ఆంధ్రప్రదేశ్ కు రాజధాని లేకుండా చేయడమే జగన్ లక్ష్యమని అన్నారు మహిళలపైన కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినందుకు సాక్షి యాజమాన్యం పైన, సదరు వ్యక్తులపైన చట్టపరంగా




చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో పాతపట్నం పట్టణ అధ్యక్షులు సైలాడ సతీష్,మండల ప్రధాన కార్యదర్శి మడ్డు రామారావు ,అక్కంధ్ర సన్యాసిరావు,శివాల చిన్నయ్య ,శాసనపురి వెంకటరావు,సిరిపురం శంకరరావు, నందిగామ ఆనందరావు,కలమట భుజంగరావు,గోరిశెట్టి దుర్గారావు,దాసరి రమణ,రావాడ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు

## డ్రోన్ సహాయంతో ఓ పెన్ డ్రింకింగు రైడ్స్ నిర్వహించిన పోలీసులు.





విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్..

**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** నేర నియంత్రణలో డ్రోన్స్ వినియోగిస్తున్న విజయనగరం జిల్లా పోలీసులు. శివారు ప్రాంతాల్లో ఓ పెన్ డ్రింకింగు, పేకాట, కోడి పందాలు ఆడుతున్న వారిపై డ్రోన్స్ తో నిఘా. విజయనగరం పట్టణం వన్ టౌన్, టూ టౌన్ పోలీసు స్టేషను పరిధిలోని శివారు ప్రాంతాల్లో జూన్ 7న ఓపెన్ డ్రింకింగు చేస్తున్న వారిపై పోలీసులు డ్రోన్స్ సహాయంతో రైడ్స్ నిర్వహించి, ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకొని, వారిపై 'ఓపెన్ డ్రింకింగు' కేసులు నమోదు చేసారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ - విజయనగరం 1వ, 2వ పట్టణ పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో 2వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలోని పూల్బాగ్ కాలనీ నందిగుడ్డి ప్రాంతంలోను, 1వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలోని కనపాక, అయ్యన్నపేట ఏరియాల్లో బహిరంగ ప్రదేశాల్లో ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిపై డ్రోన్ను పంపి, ఆయా ప్రాంతాల్లో కొంతమంది వ్యక్తులు ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్నట్లుగా గుర్తించి, రైడ్స్ నిర్వహించినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. వన్ టౌన్ పోలీసు స్టేషను పరిధిలో ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిపై ఆరు కేసులు, టూ టౌన్ పోలీసు స్టేషను పరిధిలో ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిపై 11 కేసులను నమోదు చేసామన్నారు. పేకాట, ఓపెన్ డ్రింకింగు, ట్రాఫిక్ రెగ్యులేషను, జాతర్లు, దర్నాల నిర్వహణలో అనుమానస్పద వ్యక్తుల ఆచూకీని కనిపెట్టేందుకు డ్రోన్ వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. నేర నియంత్రణలోను, శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు డ్రోన్స్ ను వినియోగించాలని, శివారు ప్రాంతాలపై నిఘా పెట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమాని ఓబులేష్ ని పరిమర్శించిన జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి





**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** పామిడి పట్టణం 4వ వార్డ్ చెందిన కాంగ్రెస్ పార్టీ అభిమాని ఓబిలేసు ని పరామర్శించినజిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి మరియు ఆర్గనైజేషన్ సెక్రటరీ పెమ్మక చెన్నకేశవ రెడ్డి సర్పంచ్ నాగేశ్వర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి విభూది కాసిం , మూడో వార్డు మండల సుధాకర్ సెల్ సీనా గారు, శివ , జన ,మరియు కార్యకర్తలు నాయకులు పాల్గొనటం జరిగింది

## పామిడి పట్టణంలో తన అమ్మ పేరుతో మొక్కను నాటిన రాష్ట్ర బిజెపి ఎమ్మెల్సీ సోమ వీర్రాజు



**పామిడి జూన్ 8 ప్రజా జ్యోతి న్యూస్** అనంతపురం జిల్లా పామిడి పట్టణం నందు గల జూనియర్ కళాశాలలో చాయ్ పే చర్చ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎమ్మెల్సీ సోమ వీర్రాజు తన అమ్మ పేరుతో జూనియర్ కళాశాల నందు మొక్కను నాటడం జరిగినది. పామిడి బిజెపి మండల అధ్యక్షులు అంజి నాయక్ అధ్యక్షతన చాయ్ పే చర్చా కార్యక్రమం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు ఆంధ్రప్రదేశ్ బిజెపి రాష్ట్ర మాజీ అధ్యక్షులు ప్రస్తుత ఎమ్మెల్సీ సోమ వీర్రాజు, జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర యువ మోర్చా అధ్యక్షులు మిట్ట వంశి, అనంతపూర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సింగంశెట్టి విశ్వనాథ్, జిల్లా ఉపాధ్యక్షులు ఓబులయ్య , గుంతకల్ అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, కిషన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తిమ్మారెడ్డి యువర్ మోర్చా రాయలసీమ జోనలించార్జ సూర్య ప్రకాష్, హరీష్ యాదవ్, యువర్ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, గుత్తి టౌన్ అధ్యక్షులు బిసి వెంకటప్ప, రూరల్ అధ్యక్షులు చంద్రశేఖర్, పామిడి హాస్పిటల్ డైరెక్టర్ లక్ష్మీదేవి, బిజెపి పామిడి మండల ప్రధాన కార్యదర్శి ఎం కె కుమారస్వామి, బిజెపి సీనియర్ నాయకులు పవన్ కుమార్, మనోజ్ కుమార్, పామిడి యువమోర్చా అధ్యక్షులు విష్ణుకాంత్ జనసేన మండల అధ్యక్షులు ధనంజయ, తెలుగుదేశం టిడిపి అధ్యక్షులు ముసలి రెడ్డి , పామిడి టిడిపి మాజీ చైర్మన్ గౌస్ పీర్, టిడిపి రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి బొల్లు శ్రీనివాస్ రెడ్డి, గుత్తి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్. ప్రభాకర్ చౌదరి, మాజీ ఎంపీటీసీ జింకల సంజీవ, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షులు మంజు, బజరంగ్దళ్ మండల అధ్యక్షులు రాజా కుళ్ళాయప్ప, యువకులు మేధావులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## భవానీ మాత ఆలయంలో 23 విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం లో పాల్గొన్న లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు...





**కొత్తూరు జూన్ 08 ప్రజాజ్యోతి న్యూస్** కొత్తూరు మండల కేంద్రంలో నేతాజీ నగర్ కాలనీలో గల భవానీ మాత ఆలయంలో 23 విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం లో లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు, లోతుగెడ్డ లక్ష్మీ నారాయణ నాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు బోర శ్రీరాములు,పడాల వెంకట క్రిష్ణ , వంజరాపు సునీల్, గేదెల బాబురావు, చెంగల తవుడు(గురు భవాని స్వామి) మొదలగు వారు పాల్గొన్నారు.

# నాటుసారా నియంత్రణే లక్ష్యంగా "కార్డన్ అండ్ సెర్చ్" ఆపరేషన్.







విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్.

**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము :** జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ ఆదేశాలతో గుర్ల పిఎస్ పరిధిలోని దేవునికనపాక గ్రామంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన పోలీసు అధికారులు, సిబ్బంది. ఒకేసారి గ్రామంలో అన్ని ఇండ్లలోను, బహిరంగ ప్రదేశాల్లో సోదాలు నిర్వహించిన అధికారులు, పోలీసు.గ్రామ శివార్లలో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చేసిన పోలీసులు. రికార్డు సక్రమంగాలేని ఆరు మోటారు సైకిళ్ళును సీజ్ చేసి, పోలీసు స్టేషనుకు తరలించిన పోలీసులు. ప్రజల రక్షణ, భద్రత, నేరాలు, నాటుసారా అక్రమ రవాణ నియంత్రణే లక్ష్యంగా గుర్ల పోలీసు స్టేషను పరిధిలోని దేవుని కనపాక గ్రామంలో జూన్ 8న, వేకువ జామున 5గంటలకు చీపురుపల్లి సిఐ శంకరరావు ఆధ్వర్యంలో సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బంది "కార్డన్ అండ్ సెర్చ్" ఆపరేషన్" నిర్వహించి, ఇండ్లలోను, బహిరంగ ప్రదేశాల్లో ఆకస్మికంగా సోదాలు నిర్వహించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - చీపురుపల్లి సర్కిల్, గుర్ల పోలీసు స్టేషను పరిధిలోగల దేవుని కనపాక గ్రామంలో నాటుసారా నియంత్రణకు 'కార్డన్ అండ్ సెర్చ్' నిర్వహించామన్నారు. గ్రామంలో నివాసం ఉన్న అనుమానిత వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసేందుకు, ప్రజల రక్షణకు భరోసా కల్పించేందుకు చీపురుపల్లి సిఐ శంకరరావు ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని గుర్ల, గరివిడి, బుదరాయవలస ఎస్ఐలు, 35 మంది పోలీసు సిబ్బందితో బృందాలుగా ఏర్పడి గ్రామంలోను, గ్రామ శివార్లలోను సోదాలు నిర్వహించామన్నారు. గ్రామంలో అన్ని ఇండ్లలో ఆకస్మికంగా సోదాలు నిర్వహించి, అవరిచత వ్యక్తుల వివరాలు సేకరించి, వారి వ్రేలి ముద్రలను ఎం.ఎస్.సి.డి. పరికరాలతో తనిఖీలు చేసామన్నారు. అదే విధంగా వారి వద్ద లభించిన వాహనాల రికార్డులను పరిశీలించి, రికార్డులు సక్రమంగాలేని ఆరు ద్విచక్ర వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం గుర్ల పోలీసు స్టేషనుకు తరలించామన్నారు. అనుమానిత వ్యక్తులు పారిపోయేందుకు అవకాశం ఉన్న బృందాలతో ముందుగానే దిగ్బంధనం చేసాయన్నారు. ప్రజల రక్షణ, భద్రతకు భరోసా కల్పించాలని, నాటుసారా తయారీని నియంత్రించాలనే లక్ష్యంతోనే "కార్డన్ అండ్ సెర్చ్" ఆపరేషన్ జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో గ్రామం లోని శివారు ప్రాంతాల్లో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన 400లీటర్ల బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చేసామన్నారు. రాబోయే రోజుల్లో ఇదే తరహాలో జిల్లాలో మరికొన్ని ప్రాంతాల్లో "కార్డన్ అండ్ సెర్చ్" ఆపరేషన్స్ ఆకస్మికంగా చేపట్టనున్నామన్నారు. ఈ అపరేషన్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందితో జిల్లా ఎస్పీ మమేకమై "కార్డన్ అండ్ సెర్చ్" ఉద్దేశ్యాన్ని, ఆపరేషన్ లో అధికారులు, సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను జిల్లా ఎస్పీ వివరించి, ప్రజలెవ్వరితో దురుసుగా వ్యవహరించ వద్దని దిశా నిర్దేశం చేసారు. కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషనులో ఎటువంటి నిషేధిత వస్తువులు, గంజాయి, నాటుసారావంటివి లభ్యం కాలేదన్నారు. "కార్డన్ అండ్ సెర్చ్" ఆపరేషను తరువాత గ్రామస్థులతో చీపురుపల్లి సిఐ శంకరరావు సమావేశమై, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, నాటుసారా తయారీకి, అక్రమ రవాణకు స్వస్తి పలకాలని, ఉపాధి పొందేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని గ్రామస్థులకు చీపురుపల్లి సీఐ సూచించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ "కార్డన్ అండ్ సెర్చ్" ఆపరేషన్లో చీపురుపల్లి సీఐ శంకరరావు, గుర్ల ఎస్ఐ పి.నారాయణరావు, గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావు, బుదరాయవలస ఎస్ఐ లోకేష్ మరియు 35 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అమిలినేని మధు పుట్టినరోజు వేడుకలు



**జూన్ 8 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** రాష్ట్ర టిఎన్టియుసి కార్యనిర్వాహణ కార్యదర్శి అమిలినేని మధు పుట్టినరోజు వేడుకలను తీర్చారు 10వ వార్డు మెంబర్ రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు వేడుకలలో భాగంగా తిరుపతిలోని రుయా ఆసుపత్రి వద్ద కేకును కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని అమిలినేని మధుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఆ తరువాత భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా దామినేడు 10వ వార్డు మెంబర్ రమేష్ మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కరుణాకటాక్షములతో అమిలినేని మధు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని అలాగే రాబోయే కాలంలో స్వామివారి దయతో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకున్నట్లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ బి ఎం ఎస్ నాయకులు బాలకృష్ణ మనీ యుగంధర్ రెడ్డి గరుడ రూపెన్స్ జస్వంత్ ఆర్ జె యూత్ టిడిపి ముఖ్య నాయకులు అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మక్కా సాయిబాబు నాయుడు ను పరామర్శించిన

### శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు పిసిని చంద్రమోహన్



**జి.సిగడాం ,ప్రజా జ్యోతి న్యూస్ :** జి సిగడాం మండలం పెంట గ్రామంలో ఇటీవల సయాటిక్ బ్యాక్ పెయిన్ తో బాధపడుతున్న తూర్పు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మక్కా సాయిబాబు నాయుడిని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు , తూర్పు కాపు జాతీయ అధ్యక్షులు , రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్ర మోహన్ పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో రాజాం ఎ.ఎం.సి చైర్మెన్ పొగిరి సురేష్ బాబు , భూపతి అర్జున్ రావు , మక్కా అంజి, గిరిబాబు , కొనారి సత్యన్నారాయణ , పెంట గ్రామ నాయకులు ,కార్యకర్తలు ఉన్నారు.

## అమరావతిపై కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు ఎస్సీ కమిషన్ చైర్మన్ కె ఎస్ జవహర్

### సాక్షి మీడియాకు ఎస్సీ కమిషన్ సమన్లు



**కొవ్వూరు/ తాళ్లపూడి, జూన్8, ప్రజాజ్యోతి న్యూస్** రాజధాని అమరావతిపై సాక్షి మీడియా చేస్తున్న ప్రసారాలను తీవ్రంగా ఖండించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ కమిషన్ ద్వారా వారిపై తగిన చర్యలు తీసుకోవాలని, దళితుల మనోభావాలను కాపాడాలని, దళిత రాజధాని అమరావతి అభివృద్ధికి ఎటువంటి ఆటకం లేకుండా చూడాలనికోరుతూ ఆదివారం రాష్ట్ర ఎస్సి కమిషన్ చైర్మన్ కె.ఎస్ జవహర్ ను కొవ్వూరు పట్టణం లోని కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేసిన అమరావతి దళిత జే.ఏ.సి చిలకబసవయ్య ఈ సందర్భంగా జవహర్ సానుకూలంగా స్పందిస్తూ రాజధాని పై విషం చిమ్మిన వారిపై కమిషన్ తగిన చర్యలు తీసుకుంటూ వారికి నోటుసులు అందజేసి, సమన్లు జారీ చేయటం జరుగుతుందని స్పష్టం చేశారు.అమరావతిని కించపరిచే ప్రయత్నాలపై దళితుల నుంచి వచ్చిన ఫిర్యాదులనేపథ్యంలో, సాక్షి ఛానల్‌కు మరియు సంబంధిత బాధ్యులకు సమన్లు జారీ చేస్తున్నట్లు తెలిపారు రాజధాని అమరావతి ప్రాంతం ఎస్సీ నియోజకవర్గంలో ఉంది. ఈప్రాంతంలో దళితులు అధికంగా ఉన్నారు. అమరావతిని కించపరిచే విధంగా ప్రసారాలు చేయడం అనేది కేవలం ప్రాంతాన్ని కాదు, ఆ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేఅని ఆయన స్పష్టం చేశారు ఇదే సందర్భంలో భవిష్యత్తులో మరెవరైనా అమరావతిని కించపరిచే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ ప్రాంతంపై విషం చిమ్మే ప్రయత్నాలు చేస్తే ఎస్సీ కమిషన్ ఉపేక్షించేది లేదు అని అన్నారు ఈ కార్యమంలో కన్వీనర్ మేరుగ సరిత పెద్దమాను కోటమ్మ , కంభంపాటి రాజేశ్వరి, మేరుగ రమణమ్మ తదితరులు ఉన్నారు

## అంకాలమ్మ జాతర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధా



**బద్వేల్ జూన్ 8 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలం కోన రాజుపల్లె, కామసముద్రం గ్రామాల్లో జరుగుతున్న అంకాలమ్మ జాతర వేడుకలకు సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి , సుబ్బారెడ్డి, పలువురు నాయకుల ఆహ్వానం మేరకు ఈరోజు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా గారు వేడుకలకు విచ్చేసారు. వారు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం జరిగిన తేనేటి విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బాల ఆర్గనైజేషనల్ సెక్రెటరీ రాళ్లపల్లి నరసింహులు, యూత్ లీడర్ సుధాకర్ రెడ్డి, గంగిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, వీరారెడ్డి, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి,జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణ రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గడ్డి మందు తాగి చనిపోయిన యువకుడు.



**శృంగవరపుకోట ప్రజా జ్యోతి రిపోర్టర్ సురేంద్ర.** ఎస్ కోట మండలం, గౌరీపురం గ్రామానికి చెందిన సేనాపతి సాయికుమార్, వయస్సు 26 సంవత్సరాలు, ఇటీవల కాలంలో తరచూ కడుపునొప్పితో బాధపడుతుండేవాడు, ఆ బాధను భరించలేక పోయేవాడు ఇలా ఉండగా తేదీ 02.06.2025 న రాత్రి సుమారు 9:30 గంటల ప్రాంతంలో సాయికుమార్ కు భరించలేనంత కడుపునొప్పి రావడంతో అక్కడికి అందుబాటులో ఉన్న గడ్డి మందును తాగినాడు ఇది తెలుసుకున్న అతని తండ్రి సేనాపతి అప్పారావు గారు అతనిని వెంటనే ఎస్ కోట గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకొని రాగా వాళ్ళు అక్కడ ప్రథమ చికిత్స జరిపి అక్కడ నుండి విశాఖపట్నం కిమ్స్ హాస్పిటల్ కు తీసుకొని వెళ్ళినారు అక్కడ కొన్ని రోజులు చికిత్స అనంతరం కేజీహెచ్ హాస్పిటల్ విశాఖపట్నం కి తీసుకుని వెళ్లి అక్కడ చికిత్స జరిగిన తర్వాత అతనికి తగ్గిందని అనిపించి ఇంటికి తీసుకొని వచ్చినారు తదుపరి తేదీ 08.06 2025 తెల్లవారు జామున సుమారు రెండు గంటల ప్రాంతంలో సాయికుమార్ విపరీతమైన కడుపునొప్పి రావడంతో అక్కడికక్కడే ఇంటి దగ్గరే చనిపోయినాడు వెంటనే వారి నాన్నగారు మరియు చుట్టుపక్కల వాళ్ళు ఎస్ కోట గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకొని వచ్చినారు దీనిపై తగు చర్య తీసుకోవలసినదిగా %వా.ఖశ్మీ% పోలీస్ స్టేషన్ కు సాయికుమార్ తండ్రి అయిన సేనాపతి అప్పారావు గారు ఫిర్యాదు చేసినారు దీనిపైన .కోట పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## బొడ్డవర చెక్ పోస్ట్ వద్ద స్కూటీ లో గంజాయి.



**శృంగవరపుకోట ప్రజా జ్యోతి రిపోర్టర్ సురేంద్ర.** తేదీ 08.06.2025 న ఉదయము 06.15 గంటల సమయంలో ఎస్. కోట మండలం, బొడ్డవర విలేజ్, బొడ్డవర చెక్ పోస్ట్ వద్ద ఎస్. కోట పోలీస్ వారు వాహనాలు తనిఖీ చేస్తుండగా, విశాఖపట్నం కు చెందిన ఇద్దరు వ్యక్తులు 1). ఆశిష్ కుమార్, విశాఖపట్నం, 2). లికిత్, , విశాఖపట్నం అను వారు 40 6505 రిజిస్ట్రేషన్ నెంబర్ గల స్కూటీ మీద 1.810 కేజి ల గంజాయి ని అరకు నుండి విశాఖపట్నం ఆక్రమముగా రవాణా చేస్తూ పట్టుబడగా, వారి పై ఎస్. కోట పోలీస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విజయవంతంగా డీసీఎంఎస్ చైర్మన్‌గా శ్రీ గొంప క్రిష్ణ ప్రమాణ స్వీకారం.





**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** విజయనగరం జిల్లాలో ఎంతో గర్వకారణమైన రోజు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప క్రిష్ణ విజయవంతంగా డీసీఎంఎస్ (డీసీఎంస్) చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమం విజయనగరం డీసీఎంఎస్ కార్యాలయంలో ఘనంగా జరిగింది.వారు ప్రజాసేవ పట్ల చూపిన నిబద్ధత, పట్టుదల, ప్రజల పట్ల ఉన్న ఆదరణ ఈ పదవికి ఆయనను అర్హునిగా నిలిపాయి. డీసీఎంఎస్ చైర్మన్ పదవిలో ఆయన నియామకం ద్వారా, జిల్లా వ్యాప్తంగా సహకార రంగంలో మరింత అభివృద్ధి జరగనుందన్న నమ్మకం అందరిలో ఏర్పడింది. ప్రమాణ స్వీకారం అనంతరం, ఆయన తనకు మద్దతుగా నిలిచిన ప్రజలకు, పార్టీ నేతలకు, అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, రైతుల శ్రేయస్సు కోసం, డీసీఎంఎస్ ద్వారా అనేక పథకాలు తీసుకువచ్చే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శృంగవరపుకోట టిడిపి కుటుంబం భారీ ర్యాలీగా గొంప క్రిష్ణ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి విజయనగరం డీసీఎంస్ వరకు వెంటాడుతూ వారి సేవా యాత్రలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా గొంప క్రిష్ణ అభినందనలు తెలుపుతూ అనేక మంది నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ రోజు విజయనగరం చరిత్రలో ఒక గౌరవనీయమైన మైలురాయిగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ., సెర్ప్, ఎన్.ఆర్.ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ,మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి ,విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ,విజయనగరం శాసన సభ్యురాలు అదితి విజయలక్ష్మి గజపతి రాజు పుష్పపతి ,శృంగవరపుకోట శాసన సభ్యురాలు .కోళ్ళ లలిత కుమారి ,నెల్లిమర్ల శాసన సభ్యురాలు. లోకం నాగ మాధవి ,చీపురుపల్లి శాసన సభ్యుడు శ్రీ కిమిడి కళావెంకటరావు , రాజాం శాసన సభ్యుడు కొండ్రు మురళి , బొబ్బిలి శాసన సభ్యుడు ఆర్.వి.ఎస్.కె.కె. రంగారావు పార్వతీపురం శాసన సభ్యుడు బోనెల విజయ చంద్ర ,బుడా చైర్మన్ తెంటు లక్ష్మినాయుడు , ఆంధ్ర ప్రదేశ్ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ( నూనెగింజల అభివృద్ధి) ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి , విశాఖ డీసీఎంస్ చైర్మన్ కోట్ని బాలాజీ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మరియు విజయనగరం డీసీసీబీ చైర్మన్ కిమ్మిడి నాగార్జున మరియు శృంగవరపుకోట నియోజవర్గ నాయుకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు




**జూన్ 8 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా స్థానిక తిరుచానూరు శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. నాట్యాచర్యులు నాట్య కళా రత్న శ్రీమతి సతియ ఆనంద రెడ్డి,శక్తిలయ నాట్యపల్లి, చెన్నై వారి చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మలై మాత్రిన అంటూ సాగే ఈ పాటతో మొదలై అలైపాయుధే కన్నా, ఆంగీకం భవనం, మురుగన్ గౌతగం, కాక్కై సిరగినిలే, నాన్ ఓరు విలైయాట్టు బొమ్మాయ్య, బో శంభో, మూషిక వాహన, ఓంశక్తి, గణేశా గౌతగం, స్నేక్ డ్యాన్స్, మంగళం తదితర పాటలకు కళాకారులు హార్జిత, రీతిక, అక్షరశ్రీ, సాగశ్ర, మధుశ్రీ, అనుశ్రీ, లక్షికా, జోష్ణ, మనసా శ్రీ, మేఘ శ్రీ, ప్రతీక్ష, తులసి శ్రీ, అనుశ్రీ, తదితరులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ప్రేక్షకుల చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమం ఏర్పాట్లను శిల్పారామం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుధాకర్ పర్యవేక్షించారు. అనంతరం కళాకారులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో నృత్య శిక్షకురాలు సతీయ ఆనంద రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## 48 ఎర్రచందనం దుంగలు స్వాధీనం...నలుగురు స్మగ్లర్లు అరెస్టు




**జూన్ 8 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** అన్నమయ్య జిల్లా తంబల్లపల్లి అటవీప్రాంతంలో 48ఎర్రచందనం దుంగలతో పాటు ఒక మోటారు సైకిల్ ను స్వాధీనం చేసుకుని, నలుగురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ శ్రీ ఎల్. సుబ్బారాయుడు గారి ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీ పీ. శ్రీనివాస్ గారి ఆదేశాలతో ఎస్పీ శ్రీ జి. బాలిరెడ్డి మార్గ నిర్దేశకత్వంలో ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ మురళీధరరెడ్డి టీమ్ శనివారం అన్నమయ్య జిల్లా బురకాయల కోట అటవీ ప్రాంతం చేరుకుని, స్థానిక అటవీ అధికారులు జయప్రసాదరావు, మోహన్ రెడ్డి, షబీన్ తాజ్ ల సహకారం తో వేపూరి కోట ఫారెస్ట్ బీటు పరిధిలో డంపింగ్ పాయింట్ల తనిఖీ చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున వీరు అన్నగారి పల్లి సమీపంలోని వంకగట్టు వద్ద ఒక మోటారు సైకిల్ కనిపించింది. దానిని సమీపించడంతో అప్పటికే అక్కడ గుమికూడి ఉన్న కొందరు పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. ఆప్రాంతంలో తనిఖీ చేయగా అక్కడ 48 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని అన్నమయ్య జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. వారితో పాటు ఎర్రచందనం దుంగలు, మోటారు సైకిల్ ను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రైతులకు మేలు చేసేది కూటమి ప్రభుత్వమే.

**నియోజకవర్గంలో 80 మంది రైతులకుక్రిషి ట్రాక్టర్లు,పరికరాలు అందజేసిన మంత్రి రామానాయుడు.**

**పాలకొల్లు మే 8 ప్రజాజ్యోతి ప్రతినిధి :** రాష్ట్రంలో రైతులకు మేలు చేసేది కూటమి ప్రభుత్వం మాత్రమేనని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పాలకొల్లు నియోజకవర్గంలో 50 శాతం సబ్సిడీపై 80 మంది రైతులకు క్రిషి ట్రాక్టర్లు,వ్యవసాయ పరికరాలను జిల్లా కలెక్టర్ నాగరాణి, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ లతో కలిసి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అందజేశారు .ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో రైతులను పట్టించుకోలేదని, వ్యవసాయ శాఖను మూసివేసాడన్నారు .నేడు చంద్రబాబు అధికారంలోకి రాగానే రైతాంగానికి అవసరమైన పనులకే అధిక ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో ఇన్పుట్ సబ్సిడీ హెక్టార్కు 20 వేలు ఇస్తే జగన్ ప్రభుత్వం 16,వేలు కు తగ్గించిందని, నేడు హెక్టార్కు 25వేలు పెంచి అందించనుందన్నారు .వైసిపి పాలనలో డ్రెయిన్లు లో గాని, కాలువల్లో గాని ఒక్క తట్ట మట్టి కూడా తీయలేదని తెలిపారు.లాభసాటి వ్యవసాయం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే కూటమీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి వెంకటేశ్వరరావు,



పాలకొల్లు ఏడి పార్వతి, పాలకొల్లు, పోడూరు ఏవోలు రాజశేఖర్, సత్యనారాయణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జడ్ వెంకటేశ్వరరావు ఏ డి పార్వతి, కె.వి.కె ఉండి శాస్త్రవేత్త మల్లికార్జునరావు జిల్లా ఉద్యాన శాఖ అధికారి విజయానంద్ సర్పంచ్ చొప్పల రజిని,కోడి విజయభాస్కర్ ,పెనుమత్స వెంకట రామసూరి,నెక్కంటి ఆదినారాయణ,పాముల రజని కుమార్ గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, అంగర చిన్న పెనిమిషా ,సత్యనారాయణరాజు ,కుడక కోటేశ్వరరావు, పెనుమత్స వెంకట సత్యనారాయణ రాజు, బీఎస్ఎన్ఎల్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురం గ్రామంలో ఆలయ పునః నిర్మాణానికి శంకుస్థాపన



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** ధర్మపురం గ్రామంలో ఆలయ పునః నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఉన్న ఆలయం చిన్నదిగా ఉండటం , శిధిలావస్థకు చేరుకోవడం తో నూతన ఆలయం నిర్మాణానికి గ్రామస్తులు నిర్ణయించారు. ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మెన్, ఎ.ఎం.సి మాజీ ఛైర్మెన్ అన్నెపు రాము ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు నిర్ణయించిన ముహూర్తం లో పూజాది కార్యక్రమాలు , హోమాలు నిర్వహించి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. రూ. 50 లక్షలతో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామ యువత సిద్ధమయ్యారు. గ్రామస్తులు , భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని కమిటీ ఛైర్మెన్ రాము తెలిపారు.

## పామిడి మండలం బజరంగ దళ్ అధ్యక్షులుగా రాజా కుల్లాయి స్వామిని ఎన్నిక

**జూన్ 8 పామిడి ప్రజా జ్యోతి న్యూస్:** అనంతపురం జిల్లా పామిడి పట్టణం శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుక క్షేత్రమునందు విశ్వహిందూ సంస్థ లో భాగమైనటువంటి బజరంగ దళ్ పామిడి మండల అధ్యక్షులుగా రాజా కుల్లాయిస్వామిని మరియు సహా సేవాక్ గా సుబ్రహ్మణ్యం ఆచారి ని నూతనంగా విశ్వహిందూ సంస్థ రాష్ట్ర కార్యదర్శి రవి, బిజెపి మండల అధ్యక్షులు అంజి నాయక్ మరియు గుత్తి ప్రఖండ అధ్యక్షులు గుప్తా వీరి ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది.



ఈ సందర్భంగా రాజా కుళ్ళాయి స్వామి మాట్లాడుతూ ఇచ్చిన కర్తవ్యం మేరకు అప్పగించిన బాధ్యతను తప్పకుండా నిర్వర్తిస్తానని హిందూ సనాతన ధర్మాన్ని కాపాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తూ గోవులను రక్షిస్తూ హిందూ దేవాలయాలను కాపాడుతూ సమాజంలో జరుగుతున్న అశ్రీలతను వ్యతిరేకిస్తూ బజరంగ్ దళ్ సమస్త కు ఎల్లవేళల కృషి చేస్తానని ఈ సభాముఖంగా తెలియజేశారు.

## వైయస్ భారతి రెడ్డి పై తెదేపా నేతలు ఫిర్యాదు

**కంచికచర్ల, జూన్ 08 (ప్రజాజ్యోతి)** నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య ఆదేశానుసారం కంచికచర్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోగంటి బాబు సూచనలతో ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణానికి స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన మహిళా రైతులను మాత్రమే కాదు యావత్ మహిళా జాతి బాధపడేలా సాక్షి టీవీ లో అత్యంత జుగుప్సాకరంగా మాట్లాడిన సాక్షి జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు ఏపీటీవీ జర్నలిస్ట్ కృష్ణంరాజు మీద కఠిన చర్యలు తీసుకోవాలని ఇలాంటి అభ్యంతరకర వ్యాఖ్యలు ప్రసారం చేసిన సాక్షి టీవీ యజమాని భారతి రెడ్డి మీద కూడా చర్యలు తీసుకోవాలని కంచికచర్ల ఆదివారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన తెదేపా మహిళా నేతలు మరియు నాయకులు . ఈ సందర్భంగా వారు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చీడ పురుగుగా మారిన సాక్షి ఛానెల్ ను బహిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో మండల మహిళా



అధ్యక్షురాలు నలనాగుల అరుణ, షేక్ మున్నీ, కంచికచర్ల మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గుత్తా ఓంకార్, షేక్ బాజీ, గుత్తా రమేష్ ,మణికంఠ, నియోజకవర్గ ఐటిడిపి ప్రధాన కార్యదర్శి భాగవతుల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మృతదేహానికి నివాళులర్పించిన వైసీపీ

నాయకుడు నల్లేరు విశ్వనాథరెడ్డి



**బద్వేల్ జూన్ 8 (ప్రజా జ్యోతి న్యూస్** పోరుమామిళ్ల రేంజి ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నందు ( వెంకటాపురం ఏరియా బీట్ ఆఫీసర్ గా) విధులు నిర్వహిస్తున్న మేరువ రామాంజనేయులు గారు బద్వేల్ కు వెళ్తూ రోడ్డు మార్గములో హార్ట్ స్ట్రోక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గం వైయస్సార్సీపి అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పామిడి మండలం బజరంగ దళ్ గోశాలఅధ్యక్షులుగా పామిడి సుబ్రహ్మణ్యం ఆచారి ఎన్నిక





**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** అనంతపురం జిల్లా పామిడి పట్టణం శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుక క్షేత్రమునందు విశ్వహిందూ సంస్థ లో భాగమైనటువంటి బజరంగ దళ్ పామిడి మండల అధ్యక్షులుగా రాజా కుల్లాయిస్వామిని మరియు బజరంగ దళ్ సహా సహాయక్ గా సుబ్రహ్మణ్యం ఆచారి ని నూతనంగా విశ్వహిందూ సంస్థ రాష్ట్ర కార్యదర్శి రవి, బిజెపి మండల అధ్యక్షులు అంజి నాయక్ మరియు గుత్తి ప్రఖండ అధ్యక్షులు గుప్తా వీరి ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాజా కుళ్ళాయి స్వామి మాట్లాడుతూ ఇచ్చిన కర్తవ్యం మేరకు అప్పగించిన బాధ్యతను తప్పకుండా నిర్వర్తిస్తానని హిందూ సనాతన ధర్మాన్ని కాపాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తూ గోవులను రక్షిస్తూ హిందూ దేవాలయాలను కాపాడుతూ సమాజంలో జరుగుతున్న అశ్రీలతను వ్యతిరేకిస్తూ బజరంగ్ దళ్ సమస్త కు ఎల్లవేళల కృషి చేస్తానని ఈ సభాముఖంగా తెలియజేశారు.

## జనసేన జెండా దిమ్మెను ఆవిష్కరించిన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను

**కంచికచర్ల, జూన్ 08 (ప్రజాజ్యోతి)** కంచికచర్ల మండల పరిధిలో పరిటాల గ్రామ జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జండా దిమ్మెను ఆవిష్కరించిన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను అనంతరం, నందిగామ జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్ళపల్లి రమాదేవి మరియు కూటమి నాయకులతో కలిసి జెండా ఎగురవేశారు.ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ నందిగామ మరియు జగ్గయ్యపేట నియోజకవర్గాలు ప్రజా రాజధాని అమరావతి దగ్గరలో ఉండటం శుభపరిణామమని, రెండు నియోజకవర్గాలలో గ్రామాల్లో వ్యవసాయంతో పాటుగా పరిశ్రమలు రావాలని ఆకాంక్షించారు. గతంలో రాష్ట్రానికి రాజధాని ఏది అంటే చెప్పలేని పరిస్థితి నుండి ఇవాళ ప్రజా రాజధాని అమరావతి అని చెప్పగలుగుతున్నాం అంటే అది కూటమి ప్రభుత్వ ఘనతే అని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రజా రాజధాని అమరావతికి కొత్త రైల్వే లైన్ మంజూరు చేయించడం తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు భవిష్యత్తులో మరెన్నో కేంద్ర , రాష్ట్ర పరిశ్రమలు రాబోతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటులో జనసేన పార్టీ అధ్యక్షులు , రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ త్యాగం మరియు వ్యూహం ఎంతో ఉందని తెలిపారు. పవన్ కళ్యాణ్ ఒక నిబద్ధతతో ఎంతో నిజాయితీతో ప్రభుత్వంలో పనిచేస్తున్నారని , అదే విధంగా కూటమి పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల పై దృష్టి నిలపాలని, రాబోవు ఎన్నికలలో మరల కూటమి పార్టీలు కలిసికట్టుగా విజయం సాధించాలని , దాని కోసం ప్రతి గ్రామంలో జనసేన పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని జనసైనికులను కోరారు.అనంతరం కంచికచర్ల నుండి పరిటాల గ్రామం వరకు జనసైనికులు భారీ స్వాగత ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొలియశెట్టి



శ్రీకాంత్ కంచికచర్ల జనసేన పార్టీ అధ్యక్షులు నాయిని సతీష్ కంచికచర్ల తెలుగుదేశం మండల అధ్యక్షులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి బాబు చలమల మధు, బొమిశెట్టి భాస్కరావు, దేవిరెడ్డి శ్రీనివాస్ గ్రామ జనసేన నాయకులు ?పురమా కాళేశ్వరం, కొమ్మ నరేష్, పురమ వెంకట ప్రసాద్, బ్రహ్మం, జగ్గయ్యపేట జనసేన నాయకులు షౌకత్ అలీ, తునికిపాటి శివ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షులు కే.సురేంద్ర నాథ్ రెడ్డి మృతి

**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండలం పరిధిలోని ఉప్పర్లపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కె. ప్రభాకర్ రెడ్డి కుమారుడు, వైయస్సార్సీపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షులు కే సురేంద్ర నాథ్ రెడ్డి(55) ఆదివారం ఉదయం మృతి చెందారు. ఇటీవల హైదరాబాద్ కార్పొరేట్ ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. అయితే మరల హైదరాబాద్ కు వైద్యం మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. మృతి చెందిన సురేంద్ర నాథ్ రెడ్డి సోదరుడు శ్రీనివాస్ రెడ్డి అమెరికాలో నుంచి వచ్చిన తర్వాత అంతక్రియలు ఉప్పర్లపల్లె గ్రామంలో నిర్వహిస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రత్యేక వేదిక



**బాపట్ల జూన్ 8 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజలు తమ వినతులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. అర్జీదారులు మీకోసం.ఏపీ %ఎవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ% వెబ్‌సైట్ ద్వారా కూడా తమ వినతులను నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే, దరఖాస్తుల స్థితిని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా కాల్ చేయవచ్చునని కలెక్టర్ తెలిపారు

## మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం



**బద్వేల్ జూన్ 8 (ప్రజా జ్యోతి న్యూస్)** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మరియు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు యోగాంధ్ర 2025 ప్రచారం లో భాగంగా మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన మైదుకూరు రోడ్డు వీరారెడ్డి కాలేజ్ దగ్గర యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమీషనర్ నరసింహా రెడ్డి గారు మాట్లాడుతూ యోగా అనేది ఒక వ్యక్తి తన శరీరానికి, మనసుకు మరియు ఆత్మకు సంబంధించిన సమతుల్యతను సాధించడం జరుగుతుందన్నారు. మానసిక ,శారీరక ఆనందం పొందడంతో పాటు ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించడానికి సహాయపడుతుందన్నారు. ఒత్తిడిని తగ్గించడానికి మానసిక స్పష్టతను పెంచడానికి తోడ్పడుతున్నారు. అనంతరం యోగ ట్రైనర్ నంద గోపాల్ సూచనల ప్రకారం యోగ సాధన చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఆఫీసు సిబ్బంది, సచివాలయం సిబ్బంది, మెప్మా సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను ఘనంగా సన్మానించిన లాయర్ సురేష్ నాయక్ అతని బృందం

**గుంతకల్లు జూన్ 8 (ప్రజా జ్యోతి):** ఆలూరు పట్టణానికి చెందిన లాయర్ సురేష్ నాయక్ మరియు అతని బృందం ఆదివారం గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాంని మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యేకు శాలువాలు, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లాయర్ సురేష్ నాయక్ మాట్లాడుతూ గుమ్మనూరు జయరాం ఎలక్షన్ ప్రచారంలో ప్రతి కులానికి రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తానని హామీ ఇవ్వడం జరిగినది. అందులో భాగంగా గుంతకల్లు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్టి కి కేటాయిం చడం, రాష్ట్రస్థాయిలో మెంబర్ లు గుంతకల్లు నియోజవర్గ ఎస్టి లకు కేటాయించడం శుభ పరిణామం, అంతేకాకుండా బంజారాల ఆరాధ్య దైవమైన టువంటి సంత శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు 50 లక్షల రూపాయలు తెలుగుదేశం ప్రభుత్వంలో నిధులు కేటాయించడం ఎస్టి లు అందరూ కూడా గర్వపడుతు న్నారని, అందుకు కృతజ్ఞతగా ఆదివారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ను కలిసి పూలుమాలవేసి, శాలువాతో ఘనంగా సత్కరించడం కోసం రావడం జరిగిందని, అతి త్వరలో నియోజవర్గ స్థాయిలో ఎస్టీ లందరూ తరఫున కృతజ్ఞత అభినందన సభ కూడా ఏర్పాటు చేస్తాము అని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ కచ్చితంగా ప్రతి కులానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించ డమే మా కుటుంబం యొక్క ముఖ్య ఉద్దేశం అని వారు మాకు సూచించడం జరిగింది.. తప్పకుండా మీరు ఏర్పాటు చేసేటువంటి కార్యక్రమానికి వస్తానని కూడా మాకు హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం నియోజవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి పలు సమస్య లను ఆయన దృష్టికి తీసుకువెళ్లి, వినతి పత్రం కూడా అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గిరిజన



నాయకులు, అనంతపూర్ పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మోహన్ నాయక్, శివ శంకర్ నాయక్, ఎర్రిస్వామి నాయక్, సప్లయర్ భాస్కర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కై జూలై రెండో తారీఖున నిరసనగలం జయప్రదం చేయండి

బీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అంజి

**ప్రజా జ్యోతి దేవనకొండ:** బోయ వాల్మీకి సమితి మండల కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు సమావేశం జరిగింది ఈ సమావేశం కు అధ్యక్షత దేవనకొండ మండల అధ్యక్షుడు పరమేష్ అధ్యక్షత వహించగా ఈ సమావేశాన్ని ఉద్దేశించి ముఖ్య అతిధులు బివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు అంజి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో వాల్మీకి బోయలను కొన్ని జిల్లాలు శ్రీకాకుళం నుండి ఏలూరు జిల్లా వరకు ఎస్టీ రిజర్వేషన్లు ఉన్నారు విజయవాడ నుండి రాయలసీమ జిల్లాల వరకు బీసీఏ గా పరిగణీయంలోకి తీసుకొని వాల్మీకి బోయలు వెనుకబాటు పడడానికి ప్రధానంగా కారణంగా ఆనాడు కాంగ్రెస్ పార్టీ చేసినటువంటి ద్రోహం వలన వాల్మీకులు ఆర్థికంగా విద్యాపరంగా వెనుకబాటు పడటం జరిగింది .2019 అసెంబ్లీ ఎన్నికలలో మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు ఎన్నికలు గెలిచిన వెంటనే వాల్మీకి బోయలను ఎస్టీ పునరుద్ధరణ చేస్తాము హామీ ఇచ్చి నేటికీ ఐదు సంవత్సరాలు అవుతున్న వాల్మీకులకు ఇచ్చినటువంటి హామీ నెరవేరేకపోవడం వాల్మీకులను మోసం చేయడమే కేంద్రం అమలు చేసే విధంగా ఆంధ్రప్రదేశ్లో ఉన్నటువంటి రాజకీయ పార్టీలు తెలుగుదేశం ,జనసేన ,బిజెపి ,వైఎస్ఆర్సిపి ఇతర పార్టీలన్నీ కూడా వాల్మీకులకు అండగా నిలబడి కేంద్రం పునరుద్ధరణ చేసేంతవరకు వాల్మీకులు చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని వారు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాల్మీకి బోయ ఫెడరేషన్ ఏర్పాటు చేశారే గాని ఆ ఫెడరేషన్ కి చైర్మన్ గా కప్పట్రాళ్ల బుజ్జమ్మ గారిని నియమించారు కానీ ఆ ఫెడరేషన్ కు నిధులు ఇవ్వకుండా కాలయాపన చేయడం తగదు. వాల్మీకుల అభివృద్ధి కొరకు వారి భవిష్యత్తు కొరకు ఫెడరేషన్ కు తక్షణమే నిధులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. జూలై రెండవ తేదీ ఎస్టి పునరుద్ధరణ చేయాలని మోడీ గారు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆలూరులో బస్టాండ్ సర్కిల్ సమీపంలో ఉదయం 11 గంటల నుండి నిరసనగలం చేపట్టడం జరుగుతుంది కాబట్టి ప్రతి వాల్మీకి సోదరుడు కూడా ఈ నిరసనగలంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరడమైనది. ఈ కార్యక్రమంలో బివిఎస్ జిల్లా నాయకులు మహేందర్ నాయుడు ఆలూరు బోయ వాల్మీకుల ఎంపీటీసీ, సర్పంచుల



తాలూకా అధ్యక్షుడు లింగప్ప , ఆలూరు నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ రాముడు,దేవనకొండ మండల నాయకులు రంగన్న, కౌలుట్ల, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సోము వీర్రాజును మర్యాదపూర్వకంగా కలిసి వీడ్కోలు పలికిన గుంతకల్లు బిజెపి నాయకులు



**గుంతకల్లు జూన్ 8 (ప్రజా జ్యోతి):** ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు ఆదివారం అనంతపురం జిల్లా పర్యటన ముగింపు అనంతరం విజయవాడకి బయలుదేరు తున్న సందర్భంగా గుంతకల్లు రైల్వే స్టేషన్ నందు స్థానిక బిజెపి నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు కొలిమి రామాంజనేయులు ఆలూరు అసెంబ్లీ నాయకులు తిమ్మప్ప ప్రముఖ పారిశ్రామికవేత్త సత్రశాల జగదీష్ గుప్తా సోము వీర్రాజు ను మర్యాదపూర్వ కంగా కలిసి వీడ్కోలు పలికారు.

## ప్రజలు సైబర్ నేరాలు ట్రాఫిక్ పై అవగాహన కలిగిఉండాలి:

రూరల్ సీఐ నాగభూషణ్

**బద్వేల్ జూన్ 8 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ నియోజకవర్గం. బి కోడూరు మండలం పాయలకుంట్ల గ్రామమును ఆదివారం నాడు బద్వేల్ రూరల్ సీఐ నాగభూషణ్ , బి కోడూరు ఎస్సై వెంకట సురేష్ లతోటి సందర్శించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ నాగభూషణ్ మాట్లాడుతూ వేసవి కాలములో రోడ్ పక్కనే ఉండే ఇండ్లలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున గ్రామ ప్రజలు జాగ్రతగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, మత్తుపదాం



## కత్తివారిపాలెంలో తాగునీటి పథకాలకు శంకుస్థాపన

ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



**బాపట్ల జూన్ 8 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామపంచాయతీ పరిధిలోని కత్తివారిపాలెం హౌసింగ్ కాలనీలో 76.41 లక్షల వ్యయంతో చేపట్టిన జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, ఎం.ఆర్.ఓ. డి. వెంకటేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబి రెడ్డి హాజరయ్యారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆఫ్జల్, స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు ఎంపీ నిధులతో చేపట్టిన ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నేతలను అభినందించారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు తాగునీరు రోడ్డు డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నామని చెప్పారు స్థానిక సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కరించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

# తెలంగాణ కేబినెట్ విస్తరణ..

**హైదరాబాద్:** తెలంగాణ కేబినెట్ విస్తరణలో కొత్తగా ముగ్గురికి అవకాశం దక్కింది. వీరిలో గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలకు రేవంత్ ప్రభుత్వం ఛాన్స్ కల్పించింది. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నూతన మంత్రులతో ఆదివారం రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేశారు.

**నూతన మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు**

ప్రమాణ స్వీకారం చేసిన నూతన మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలకి అభినందనలు చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న రామచంద్ర నాయక్‌కు కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

**తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రనాయక్**

తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రనాయక్‌ని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రెండు రోజుల్లో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ సందర్భంగా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ మాట్లాడారు. డిప్యూటీ స్పీకర్ పదవి దక్కడం గిరిజన జాతికి దక్కిన గౌరవంగా భావిస్తున్నానని రామచంద్రనాయక్ తెలిపారు. డోర్నకల్ ప్రజలందరికీ కృతజ్ఞతలు చెప్పారు. తనకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సహచర ఎమ్మెల్యేలకు రామచంద్రనాయక్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడానికి తనవంతుగా కృషి చేస్తానని రామచంద్రనాయక్ పేర్కొన్నారు.

**నేతలకు బుజ్జగింపులు...**

ఈసారి తెలంగాణ కేబినెట్ విస్తరణలో కాంగ్రెస్‌లో మంత్రి పదవులు ఆశించి పలువురు నేతలు భంగపడ్డారు. వారిని అగ్రనేతలు బుజ్జగిస్తున్నారు. పదవులు రాలేదని నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసంతృప్తితో ఉన్న నేతలకు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్, మహేష్‌గౌడ్, వేం నరేందర్‌రెడ్డి సర్దిచెబుతున్నారు. అయితే మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి నివాసానికి కాంగ్రెస్ పెద్దలు చేరుకున్నారు. మంత్రివర్గ విస్తరణపై సుదర్శన్‌రెడ్డి మొదటి నుంచి ఆశలు పెట్టుకున్నారు. కేబినెట్ విస్తరణలో తనకు అవకాశం రాలేదని అసంతృప్తిలో ఆయన ఉన్నారు. ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డితో సహా ఇతర నేతల ఇళ్లకు మీనాక్షి నటరాజన్, నేతలు వెళ్లారు.

**వివేక్ రాజకీయ ప్రస్థానం**

కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం వెంకటస్వామి తనయుడైన వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీగా రాజకీయ జీవితం ప్రారంభించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలో పనిచేసి, తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. చెన్నూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఎట్టకేలకు మంత్రి పదవి సాధించారు. ఇటీవల జరుగుతున్న రాజకీయ పరిణామాలు ఒక దశలో ఆయనకు పదవి వస్తుందా, రాదా? అనే ఊహాగానాలు వచ్చాయి. అధిష్టానం తొలి విడతలోనే పదవీ ఇస్తున్నట్లుగా ఒకింత ప్రచారం జరిగినా సమీకరణల నేపథ్యంలో సాధ్యం కాలేదు. గతంలో పదవి రాకపోయినా, సామాజిక సమీకరణలు, రాజకీయ పట్టుదలతో అధిష్టానం ఆమోదం పొంది, తన పంతం నెగ్గించుకున్నారు. మరో వైపు జిల్లా నుంచే తన సోదరుడు వినోద్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రయత్నాలు చేశారు. అయితే సామాజిక, రాజకీయ పలు కోణాలను లెక్కలోకి తీసుకుని అధిష్టానం వివేక్ పేరు ఖరారు చేసింది

**శ్రీహరి రాజకీయ ప్రస్థానం**

కర్ణాటక సరిహద్దులో ఉన్న మక్తల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీహరికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేతో మంచి సాన్నిహిత్యం ఉంది. మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తారనే పేరు శ్రీహరికి ఉంది. సర్పంచ్‌గా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుడిగా పనిచేసిన అనుభవం ఉండగా.. నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా సైతం బాధ్యతలు చేపట్టారు.

ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడో యాత్రను మక్తల్ నియోజకవర్గంలో విజయవంతం చేసి ప్రశంసలు పొందారు.

## అత్యంత ఘనంగా మద్దులమ్మ తల్లికి వరద పాశం







**కంచికచర్ల, జూన్ 08 (ప్రజాజ్యోతి)** కంచికచర్ల మండలం గొట్టుముక్కల సమీపంలో గల అడవిలో వేంచేసి ఉన్న మద్దులమ్మ తల్లికి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజా సందోహం మద్దులమ్మ తల్లికి జై అంటూ నినాదాలు చేస్తుండగా పండితులు వరద పాశం పోశారు. మద్దులమ్మ లోయలో నుండి దిగువకు ఈ వరద పాశ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య పాల్గొని మాట్లాడుతూ వర్ష ప్రదాయిని అని ఆ తల్లికి వరద పాశం పోస్తే ఈ ప్రాంతంలో వర్షాలు సకాలంలో పడతాయని పంటలు బాగా పండుతాయి అని అన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుండి వేలాది భక్తులు రావటమే ఇందుకుతార్కారణం అన్నారు. కాగా మద్దులమ్మ తల్లి పుట్టినిల్లు అయిన నరసింహారావుపాలెం గ్రామం నుండి ఆ గ్రామ ప్రజలు పసుపు కుంకుమ పట్టుబట్టలు తీసుకువచ్చారు. నిర్వాహకులు ఊహించని రీతిలో వివిధ గ్రామాల నుండి భక్తులు తరలిరావడంతో మద్దులమ్మ తల్లి లోయ జనసంద్రంగా మారింది. వరదపాశం పోసే సమయంలో మద్దులమ్మ తల్లి లోయ గోవింద నామస్మరణతో మారు మ్రోగింది. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు ఏఎంసీ చైర్మన్ కోగంటి బాబు పాల్గొన్నారు. ఇంకా వివిధ గ్రామాల నుంచి వచ్చిన కూటమినేతల కూడా పాల్గొన్నారు. అంగరంగ వైభవంగా వరద పాశం కార్యక్రమం అత్యంత వైభవృతంగా జరిగింది.

## ఆర్డిటి పరిరక్షణ పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి



**గుంతకల్లు జూన్ 7 (ప్రజా జ్యోతి):** వైయస్సార్ సిపి కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలరి రంగయ్య ఆదివారం ఆర్ డి టి పరిరక్షణ పాదయాత్ర కు శెట్టురు మండలం కైరెవు గ్రామం వద్ద చేపట్టిన పాదయాత్రకు గుంతకల్లు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, సమన్వయకర్త వై.వెంకట్రామి రెడ్డి పాల్గొని తన మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడు తూ ఆర్డీటీ సంస్థను 1960లో విన్సెంట్ ఫెర్రర్, అన్నే ఫెర్రర్ దంపతులు స్థాపించారు. రాయలసీమ,తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో అత్యంత వెనుకబడిన సమాజాల అభ్యున్నతి కోసం ఈ సంస్థ లాభాపేక్ష లేకుండా పనిచేస్తోంది. విద్య,ఆరోగ్యం,మహిళా సాధికారత,వ్యవసాయ అభివృద్ధి,వికలాంగుల సంక్షేమం వంటి రంగాల్లో ఆర్డీటీ గణనీయమైన కృషి చేసింది. అనంతపురం జిల్లాలోని అనేక గ్రామాల్లో స్థానికులకు ఉపాధి,విద్యా, వైద్య సేవలను అందించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించింది. ఆర్డీటీ నిర్వహించే ఆసుపత్రులు,పాఠశాలలు, శిక్షణ కేంద్రాలు లక్షలాది మంది జీవితాలను మార్చాయి. అలాంటి సంస్థను నిర్వీర్యం చేయడం కూటమి ప్రభుత్వానికి మంచిది కాదని,పేదలపై ఎందుకు ఇంత కక్ష అని నిలదీసారు. డాక్టర్ తలారి రంగయ్య చేపట్టిన ఆర్ డి టి పరిరక్షణ పాదయాత్రకు ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వం దిగొస్తుందని. మరలా ఆర్డిటి సంస్థ పూర్వ వైభవం పురుడు పోసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, మాజీ సర్పంచ్ తిక్క స్వామి మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధ తాళలేక కౌలు రైతు మృతి



**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండలం గుడిసెగొప్పురాళ్ల గ్రామము నకు చెందిన దబ్బాల నాగన్న (58 ) మూడు ఎకరాల సొంత పొలము మరియు 10 ఎకరాల కౌలు పొలం తీసుకోని వ్యవసాయము వలన జీవనం. ఇతనికి ఒక కుమారుడు సంతానం. ఇతను సదరు పొలము పెట్టుబడి కోసం మరియు తన సొంత పొలములో నాలుగు సార్లు బోర్లు వేయటం కోసం సుమారు 10 లక్షల రూపాయల అప్పులు చేసాడని పంటలు సరిగా రాక సదరు అప్పు తీర్చలేక బాధపడుతు ఉండేవాడని దానికి తోడు అతను గత ఆరు నెలల నుండి టీబి వ్యాధితో బాధపడుతూ ఉండటముతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక నిన్నటి దినం మధ్యాహ్నం తన పొలములో ఉన్న పురుగుల మందు తాగడముతో విషయము తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతనిని కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ నిన్న రాత్రి చనిపోయాడు అని ఈ రోజు తన కొడుకు దబ్బాల సోమశేఖర్ ఫిర్యాదు మేరకు జొన్నగిరి పోలీస్ వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడమైనది.

# విత్తనానికి తొందర పడొద్దు

**కరీంనగర్ :** ముందస్తు రుతుపవనాల రాకతో సంబరపడిన రైతన్నకు నిరాశే మిగిలింది. వానాకా లం సీజన్ ఆరంభంలో రోహిణికార్తె ప్రవేశించిన తొలిరోజునుంచి నాలుగైదు రోజులపాటు కురిసిన తొలకరి వర్షాలకు రైతులు సంబురపడ్డారు. జిల్లాలోని పలుచోట్ల దుక్కులు దున్ని పత్తి విత్తనాలు సైతం వేశారు. అయితే కొద్దిరోజులకే చినుకు కినుకు వహిస్తోంది. వారం రోజుల నుంచి వర్షం జాడ లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండుతున్న ఎండలతో వేసిన విత్తనం ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల విత్తనాలు వేసేందుకు ఎదురుచూస్తున్న రైతులకు చినుకుజాడ లేకపోవడంతో అదను దాటిపోతోందని ఆవేదన చెందుతున్నారు. నేటినుంచి మృగశిర కార్తె ప్రవేశిస్తుండగా.. ఈ కార్తెలోనైనా వరణుడు కరుణిస్తాడా అని ఆశతో ఎదురుచూస్తున్నారు. పంటల సాగును మృగశిర కార్తె నుంచి రైతులు ప్రారంభిస్తారు. ముందస్తు నైరుతి రుతుపవనాల రాకతో కొందరు రోహిణికార్తెలోనే పత్తి, మొక్కజొన్న విత్తనాలు వేశారు. పదిరోజుల నుంచి ఎండలు దంచికొడుతుండగా ఒక్క వర్షం పడలేదు. ఆదివారం నుంచి ప్రవేశిస్తున్న మృగశిర కార్తెలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. వాతావరణ శాఖ రాబోయే నాలుగురోజుల పాటు వర్షాలు కురుస్తాయనే సూచనతో విత్తనాలు మొ లకెత్తుతాయనే భరోసా కల్పించింది. వర్షాలు కురిసిన అనంతరమే విత్తనాలు వేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.




**3,43,240 ఎకరాల సాగు అంచనా**

జిల్లాలో ఈ వానాకాలంలో 3,43,240 ఎకరాలలో వివిధ పంటలు సాగులోకి వస్తాయని అధికారులు అంచనా వేశారు. వరి 2,76,500 ఎకరాలు, పత్తి 48వేల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేస్తున్నారు. రోహిణి కార్తెలో ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 28వేల ఎకరాల్లో పత్తి విత్తినట్టుగా అధికారులు అంచనా వేస్తున్నారు. వారం రోజులుగా ఎండలు దంచి కొడుతుండడంతో విత్తనాలు మాడిపోయే అవకాశముంది. భారీ వర్షాలు పడితే కానీ.. విత్తనాలు విత్తుకోవడం, నార్లు పోయడం చేయొద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కనీస వర్షపాతం నమోదయ్యాకే వరినాట్లు వేసుకోవాలని చెబుతున్నారు. కొందరు పోసిన నార్లు ఎండలతో దెబ్బతింటున్నాయి. మృగశిరలో మంచి వర్షాలు పడితే తప్పా వ్యవసాయంలో ముందుకు సాగొద్దని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

# సన్నాలకు బోనస్ ఏది?

**నిర్మల్ :** నిర్మల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 260 కొనుగోలు కేంద్రా ల ద్వారా ధాన్నాన్ని కొనుగోలు చేశారు. ఇందులో నుంచి 171 సెంటర్లను ఇప్పటికే మూసేశారు. సన్నరకం ధాన్యాన్ని విక్రయించిన రైతులకు ఇప్పటి వరకు బోనస్ డబ్బులు అందలేదు. ధాన్యం డబ్బులు వారం, పది రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ అయినప్పటికీ బోనస్ డబ్బుల కోసం మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు. నిర్మల్ జిల్లాలో ఇప్పటి వరకు యాసంగి సీజన్‌కు సంబంధించి 25 వేల మెట్రిక్ టన్నుల సన్నరకం వడ్లను కొన్నారు. సన్నాలపై ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు జిల్లా రైతులకు రూ.12.50 కోట్లను చెల్లించాల్సి ఉన్నది. ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ చెల్లింపుల విషయంలో ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇందుకు సంబంధించి డబ్బులు కూడా విడుదల చేయకపోవడంతో ఈ సారి రైతులకు బోనస్ కూడా అందే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో 1,17,085 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఈ సీజన్‌లో 1.83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో 1.38లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డురకం వడ్లు, 24వేల మెట్రిక్ టన్నులు సన్నరకం వడ్ల దిగుబడులు వస్తాయని పంటల ప్రణాళికలో పేర్కొన్నారు. ఇందులో నుంచి కొంతవరకు స్థానిక అవసరాలకు పోను 1,62,414 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి వస్తుందని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. అందుకనుగుణంగా జిల్లాలో మొత్తం 330 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇందులో ఐకేపీ సెంటర్లు 171, పీఏసీఎస్ కేంద్రాలు 147, డీసీఎంఎస్ 7, జీసీసీ ఆధ్వర్యంలో 5 సెంటర్లను ఏర్పాటు చేశారు. కాని కొనుగోళ్లు మాత్రం 260 కేంద్రాల ద్వారా చేపట్టారు. వీటిలో 131 ఐకేపీ సెంటర్లు, 112 పీఏసీఎస్, డీసీఎంఎస్ 13, జీసీసీ 4 కేంద్రాలు ఉన్నాయి. కాగా ఈ యాసంగి ధాన్యం సేకరణ మొత్తం లక్ష్యం 1,62,414 మెట్రిక్ టన్నులు కాగా ఈ సారి లక్ష్యానికి మించి ధాన్యం దిగుబడులు వచ్చాయి.



ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,76,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డురకం 1,51,000 మెట్రిక్ టన్నులు కాగా, సన్నరకం 25 వేల మెట్రిక్ టన్నులుగా ఉన్నది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం వరి కొనుగోళ్లు చివరి దశలో ఉన్నాయి. ఖానాపూర్, కడెం, దస్తూరాబాద్, తదితర మండలాల్లో వరి కోతలు ఆలస్యం కావడంతో ఆయా మండలాల్లో మాత్రమే కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి 38,841 మంది రైతులకు రూ.267 కోట్లను చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.202 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇంకా దాదాపు రూ.67 కోట్ల వరకు ధాన్యం డబ్బులను రైతులకు చెల్లించాల్సి ఉన్నది. వీటితో పాటు సన్నాలు విక్రయించిన రైతులకు చెల్లించాల్సిన రూ.12.50 కోట్ల బోనస్ డబ్బుల గురించి ప్రభుత్వం ఊసే ఎత్తడం లేదు.

**ప్రతిపాదనలు బుట్టదాఖలు**

నిర్మల్ జిల్లాలో కొనుగోలు చేసిన సన్నరకం ధాన్యానికి సంబంధించి 4,170 మంది రైతులకు రూ.12.50 కోట్లను రైతులకు బోనస్‌గా చెల్లించాల్సి ఉన్నది. ఈ బోనస్ చెల్లించాలని ఎప్పటికప్పుడు కొనుగోలు వివరాలను తెలుపుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించినప్పటికీ ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. జిల్లాలో ఇప్పటికీ రూ.267 కోట్ల విలువ చేసే దొడ్డు, సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో నుంచిరూ.202 కోట్ల చెల్లింపులు కూడా పూర్తయ్యాయి. కాని సన్నరకం ధాన్యానికి మాత్రం బోనస్ డబ్బులను చెల్లించక పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే రుతుపవనాలు వచ్చి వానకాలం సాగు కోసం దుక్కులు దున్నుతున్న రైతులకు బోనస్ డబ్బులు వస్తే ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. వానకాలంలో పండించిన సన్నాలకు బోనస్ అందడంతో ఈసారి కూడా బోనస్ డబ్బులు వస్తాయని రైతులు గంపెడాశతో మండు వేసవిలో సైతం సన్న వడ్లను సాగు చేశారు. సాగు నీటి ఇబ్బందులను అధిగమించి కేవలం బోనస్ వస్తుందన్న ఆశతో ధైర్యం చేసి సన్నాలను సాగు చేసిన రైతులకు ప్రస్తుతం ఎదురు చూపులు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే బోనస్ చెల్లించాలని కోరుతున్నారు.

**బోనస్ డబ్బులు రూ.37 వేలు రాలేదు..**

నాకున్న 6 ఎకరాల పొలంలో మూడున్నర ఎకరాల్లో సన్నరకం వడ్లు వేసిన. 75 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అమ్మిన. రూ.37వేల దాకా బోనస్ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అయితాయని చెప్పిన్రు. పంట అమ్మి దాదాపు నెల రోజులవుతున్నది. ఇప్పటి వరకు బోనస్ డబ్బులు రాలే. యాసంగిలో సాగు నీటికి తిప్పలయినా, బోనస్ వస్తుందన్న ఆశతో కష్టపడి సన్నరకం వడ్లను పండించిన. ప్రతిసారి ఎదురుచూపులు తప్పడం లేదు. రైతులంటే ఈ ప్రభుత్వానికి చిన్నచూపుగా ఉన్నది. కష్టపడి పండించిన పంట పైసలే సక్కగా ఇస్తలేరు. ఇంక రైతుబంధు ఇస్తరో ఇయ్యరో గ్యారెంటీ లేకుంటైంది.

# 103 శాతం బొగ్గు ఉత్పత్తి

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి సంస్థ 2025%-%26 ఆర్థిక సంవత్సరంలో 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో మే నెలలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11ఏరియాల్లోని 19 ఓ పెన్‌కాస్ట్ గనులకు, 21భూగర్భ గనులకు 56.50 మిలి యన్ లక్షలటన్నుల లక్ష్యానికి 58.22 లక్షల టన్ను లు 103 శాతం మాత్రమే సాధించినట్లు సింగరేణి తన గణాంకాల్లో తెలిపింది. కాగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11ఏరియాల్లోని భూగర్భగనుల్లో 4.90లక్షల టన్నుల లక్ష్యానికి 3.50లక్షల టన్నులు 72శాతం ఉత్పత్తి చేయగా, ఓపెన్ కాస్ట్ గనుల్లో 51.60 లక్షల టన్నులకు గాను 54.72 లక్షల టన్నులు 106 శాతం సాధించింది. ఓవరాల్‌గా 56.50 లక్షల టన్నుల లక్ష్యానికి 58.22లక్షల టన్నులు 103శాతం ఉత్పత్తి జరిగింది.

**మే మాసంలో మెరుగైన ఉత్పత్తి...**

గడచిన ఏప్రిల్‌లో సాధించిన ఉత్పత్తి (95శాతం) కంటే మే లో 103 శాతం అంటే 8 శాతం (నెలవారీ ఉత్పత్తి) అదనంగా ఉత్పత్తి జరిగింది. అంతేకాకుండా ఏప్రిల్‌లో మణుగూరు ఏరియా 10.88 లక్షల టన్నులు సాధించి మొదటి స్థానంలో నిలవగా, ఆర్జీ%-%2 ఏరియా 4.99 లక్షల టన్నులు సాధించి రెండో స్థానంలో నిలిచింది. మే నెలలో 5 ఏరియాలు (కొత్తగూడెం 107 శాతం, మణుగూరు 119 శాతం, శ్రీరాంపూర్ 100 శాతం, ఆర్జీ%-%2 133 శాతం, ఆర్జీ%-%3 100 శాతం,) 100 శాతం సాధించాయి. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోని భూగర్భ



గనులు, ఓపెన్ కాస్ట్ గనుల్లో 49.90 లక్షల టన్నులు 95 శాతం సాధించగా, మే లో 10.81 లక్షల టన్నులు 99శాతం అంటే గతంలో కంటే మరో 4శాతం అదనంగా సాధించింది.

**తీరు మార్చుకోని ఆరు ఏరియాలు..**

సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో మే మాసంలో ఐదు ఏరియాలు మాత్రమే 100 శాతం ఉత్పత్తి సాధించగా, మిగిలిన ఆరు ఏరియాలు వెనుకంజలో ఉన్నాయి. అయితే సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు ఏరియాలలోని భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనులకు నిర్దేశించిన నెలవారి, వార్షిక లక్ష్యాలను కచ్చితంగా సాధించాలని రివ్యూ మీటింగ్‌లలో పలుమార్లు చెప్పినప్పటికీ అధికారుల పనీతీరులో మార్పు రాలేదు.

లక్ష్యంసాధించిన కొత్తగూడెం మణుగూరు, ఆర్జీ%-2...

మే మాసంలో కొత్తగూడెం ఏరియా 107శాతం, వార్షిక లక్ష్యం 100శాతం సాధించగా, మణుగూరు ఏరియా మే నెలలో 119శాతం, వార్షిక లక్ష్యంలో 118శాతం సాధించినప్పటికీ ఓవరాల్‌గా కొత్తగూడెం ఏరియా 13.96 లక్షల టన్నులు, వార్షిక లక్ష్యం 26.04 లక్షల టన్నులు సాధించి సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో ఉండగా, మణుగూరు ఏరియా మేలో 11.74 లక్షల టన్నులు, వార్షిక లక్ష్యంలో 22.63 లక్షల టన్నులు సాధించి రెండో స్థానంలో నిలిచాయి. కంపెనీ రెండు నెలలో 108 లక్షల్లో కొత్తగూడెం రీజియన్ 53 లక్షలు సాధించటం విశేషం. అయితే మిగతా రెండు రీజియన్‌లు 55 లక్షల టన్నులు సాధించటం గమనార్హం. కాగా, ఆర్జీ%-%2 ఏరియా మే నెలలో 133 శాతం, రెండు నెలలో 159 శాతం సాధించి మూడు స్థానంలో ఉంది.

## ఆర్థిక ఇబ్బందుల వలన ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామమునకు చెందిన రాంపల్లి సతీష్ (25) హైదరాబాద్ లో చెత్త పని చేస్తూ జీవనం చేస్తాడు. ఇతనికి ఒక కొడుకు మరియు ఒక కూతురు సంతానం. నెలరోజుల క్రితం ఇతని అమ్మ గోవిందమ్మ కు ఆరోగ్యం బాగాలేదని జొన్నగిరికి వచ్చి ఇక్కడే ఉన్నాడు. ఇతను హైదరాబాద్లో చెత్త పని చేసుకోవడానికి బండి కొని మరియు తల్లి వైద్యం ఖర్చుల కోసం దాదాపు 5 లక్షల వరకు అప్పు చేశాడని చాల సార్లు అప్పు కట్టలేక తండ్రి తో చెప్పి బాధపడుతుండేవాడని నిన్నటి దినం అనగా 07.06.2025 వ తేది రాత్రి 7 గంటల సమయంలో ఇంటి పైన ఉన్న రేకుల షెడ్డులో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొని చనిపోయినాడు అని తండ్రి రాంపల్లి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు జొన్నగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడమైనది.

## రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

**జొన్నగిరి ఎస్సై ఎన్ ,సి ,మల్లికార్జున**



**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండలంలోని జొన్నగిరి ఎస్ఐ రౌడీషీటర్లకు, అనుమానస్పద వ్యక్తులకు ఎస్సై ఎన్ సి మల్లికార్జున శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీపై పోలీసు నిఘా ఉంటుందని, ఘర్షణలకు, పంచాయతీలు, సెటిల్మెంట్లకు వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో మంచి వాతావరణం కోసం పోలీసులకు సహకరించాలని, రౌడీయిజం చేసినా, ప్రజలను, మహిళలను, వ్యాపారస్తులను ఇబ్బంది పెట్టినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రౌడీ షీటర్లు క్రమం తప్పకుండా పోలీస్ స్టేషన్కు వచ్చి సంతకాలు చేసి వెళ్ళాలని జొన్నగిరి ఎస్సై ఎన్ ,సి,మల్లికార్జున సూచించారు

## పురపాలక సంఘం కార్యాలయం వేదికగా సీనియర్ సిటిజన్లకు యోగా శిక్షణ

**ఉల్లాసంగా ఆసనాలు వేసిన వృద్ధులు...**



**బాపట్ల జూన్ 8 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా బాపట్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పురపాలక కార్యాలయంలో సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక యోగా శిక్షణా శిబిరం నిర్వహించారు. వృద్ధులు ఉత్సాహంగా పాల్గొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచే యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా వారిలో ఆనందం కనిపించింది. యోగా ద్వారా వారి ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపనున్నదన్న నమ్మకంతో కార్యక్రమం నిర్వహించామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ పి. లక్ష్మయ్య పాల్గొని వారిని ప్రోత్సహించారు. పురపాలక సంఘ సానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ కరుణ సిబ్బంది, సచివాలయ సిబ్బంది కూడా యోగాసనాల్లో భాగస్వామ్యమయ్యారు. వృద్ధులు పలు ఆసనాలను పాటిస్తూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడం విశేషం. ఈ కార్యక్రమం వారంలో మరికొన్ని రోజుల పాటు కొనసాగనుంది.పౌరులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు

## మినర్వా విద్యార్థి షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక..



**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ప్రజా జ్యోతి రిపోర్టర్. వీరబాబు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులకు ప్రత్తిపాడు మండలం మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని ఎంపికయింది. ఈ సంవత్సరం జరిగిన పదో తరగతి పరీక్షల్లో 583 మార్కులు సాధించిన వేముల సాయి శరణ్య షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక కావడం వల్ల చైర్మన్ మురళీకృష్ణ గారు , డీన్ ,ఆనంద్ జోష్ కుమార్, హెచ్ఎం మల్లికార్జునరావు, మట్టపర్తి శ్రీ లక్ష్మణ్ కుమార్, అభినందించారు

# మటన్‌తో చేసుకోవాల్సిన ఐదు రుచిగల వంటకాలు



బక్రీద్ పండుగ వచ్చేసింది. జూన్ 7వ తేదీన ముస్లిమ్స్ అందరూ బక్రీద్ పండుగను జరుపుకుంటారు. అయితే ఈ ఫెస్టివల్‌కు అనేక రకాల వంటకాలు చేస్తుంటారు. కాగా, బక్రీద్ స్పెషల్ చాలా మందికి ఇష్టమైన మటన్‌తో ఈ ఐదురకాల వంటలు చేస్తే రుచి అదిరిపోవడమే కాకుండా ఈ పండుగ ఎప్పుడూ గుర్తుండిపోతుందంట. ఈ సారి బక్రీద్ పండగకు చాలా స్పెషల్ గా పార్సీ మటన్ కీమా కట్లెట్ చేస్తే విందు అదిరిపోతుందంట. దీని కోసం మటన్, కీమా, బంగాళదుంపలు, పార్సీ మసాలాదినుసులు తీసుకోవాలంట. తర్వాత మాంసం, ఉల్లిపాయలు,మిరపకాయాలు రెండు, సుంగంధ ద్రవ్యాలను వేయించుకోవాలంట. తర్వాత వీటికి బంగాళ దుంపలు కలిపి టిక్కీ తయారు చేయాలంట. ఆ తర్వాత ఎగ్ వైట్ లో బ్రెడ్ ముక్కలను ముంచి డీప్ ఫ్రై చేసుకోవాలి. తర్వాత మటన్ టిక్కీని బ్రెడ్ ముక్కలతో కలిపి తింటే రుచి అదిరిపోతుందంట. కొబ్బరి నూనెలో వేయించిన మటన్, కరివేపాకు, సుగంధ ద్రవ్యాలతో తయారు చేసే ఈ కేరళ స్టైల్ మటన్ కర్రీ టేస్ట్ అదిరిపోతుందంట. దీని కోసం ఉల్లిపాయ, అల్లం, వెల్లుల్లి పేస్ట్, మసాలా దినుసులు, వేయించి ఉడికించిన మటన్ తో కలిపి, వీటన్నింటిని ఒక బౌల్ లో ఉడికించాలంట. తర్వాత మసాలా , కొత్తిమీర వేస్తే కేరళ స్టైల్ మటన్ వర్టియత్ రెడీ. ఎర్రపండుమిర్చి, వెనిగర్ తో తయారు చేసే గోవా స్టైల్ మటన్ వంటకం తింటే జీవితంలో మర్చిపోలేరంట. దీని కోసం ఎర్ర మిరపకాయలను, వెల్లుల్లి, సుగంధ ద్రవ్యాలు, వెనిగర్ పేస్ట్ లా కలుపుకోవాలంట. తర్వాత మటన్ ను మ్యారినేట్ చేసి ఉల్లిపాయలతో వేయించి, గ్రేవీలా చేసుకొని, తక్కవ మంట మీద ఉడికించాలి. కోరంగట్టు మటన్ వంటకం నెయ్యితో తయారు చేస్తారు. దేశీ నెయ్యి, పొడి సుగంధ ద్రవ్యాలు, చింతపండు కలిపి చేసే ఈ మటన్ వంటకం బ్రకీద్ విందులో స్పెషల్ గా నిలుస్తుంది. అంతే కాకుండా దీని రుచి అద్భుతంగా ఉంటుందంట. దీని కోసం కారం, కొత్తిమీర, జీలకర్ర, వెల్లుల్లి పేస్ట్ లా తయారు చేసుకోండి. తర్వాత కరివేపాకు, ఈ పేస్ట్ ని నెయ్యిలో వేయించాలి. ఉడికించిన మటన్, చింతపండు వేసి, మటన్ రంగు మారి నెయ్యి మిగిలే వరకు ఉడికించాలి. పైన కొంచెం నెయ్యి వేస్తే మీ కొరంగట్టు మటన్ రెడీ. లక్నో వీధుల నుండి వచ్చే ఈ ప్రత్యేకమైన నవాబీ వంటకం లక్నోవి మటన్ చాప్. గ్రేవీ, మటన్ కలయికతో ఉంటుంది, దీని టేస్ట్ వావ్ అనిపిస్తుందంట. అంతలా బాగుంటుంది. అయితే దీని కోసం మటన్ చాప్ ని పెరుగు, సుగంధ ద్రవ్యాలు, జీడిపప్పు పేస్ట్,నిమ్మరసంలో 4 గంటలు మ్యారినేట్ చేయండి. తరువాత నెయ్యిలో మెత్తగా, కొద్దిగా క్రిస్పీగా అయ్యే వరకు నెమ్మదిగా ఉడికించాలి. దానిపై కొత్తిమీర, ఉల్లిపాయలు వేయండి. అంతే, మీ లక్నోవి మటన్ చాప్ రాయల్ స్టైల్ లో రెడీ అయిపోతుంది.

# ఉదయాన్నే ఖాళీ కడుపుతో తమలపాకులు తింటే ఏమౌతుందో తెలిస్తే



తమలపాకు.. ఇది ఆకుపచ్చ రంగులో ఎంతో అందంగా మెరుస్తూ కనిపిస్తుంది. ఇలాంటి తమలపాకుని పూజాది శుభకార్యాలు మొదలుకుని చాలా రకాలుగా వాడతారు. ఆయుర్వేదంలో కూడా తమలపాకు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. తమలపాకులో చాలా ఆరోగ్య ప్రయోజనాలు దాగివున్నాయని చెబుతున్నారు. తాజా తమలపాకులో కాల్షియం, విటమిన్ సి, రైబోఫ్లేవిన్, కెరోటిన్, నియాసిన్, క్లోరోఫిల్, యాంటీఆక్సిడెంట్స్ ఉంటాయి. తమలపాకుని సరిగ్గా తింటే చాలా ఆరోగ్య సమస్యల నుంచి రక్షణ లభిస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపున తమలపాకు తింటే జీర్ణవ్యవస్థ బలపడుతుంది. తేపులు, అజీర్తి వంటి సమస్యలు తగ్గుతాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దగ్గు, జలుబుకి కూడా తమలపాకు మంచి మందులా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. తమలపాకు కషాయం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. తమలపాకులో యాంటీసెప్టిక్ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణనిస్తాయి. తిన్న ఆహారం జీర్ణం కావడానికి సహాయపడుతుంది. పాన్ తింటే సున్నం బదులు గుల్కంద్, సోంపు, డ్రై ఫ్రూట్స్ వాడితే మంచిది. సున్నం ఆరోగ్యానికి హానికరం. భోజనం చేసిన తరువాత రోజూ కొన్ని తమలపాకులు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రక్తంలో బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో ఉంటాయి. తమలపాకుల కషాయం తాగడం వల్ల శరీరంలో ఫ్రీ రాడికల్స్ ప్రభావం తగ్గుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరం. నోటి దుర్వాసనను దూరం చేస్తాయి. చిగుళ్ల నుంచి వచ్చే బ్లీడింగ్ తగ్గుతుంది. చర్మంపై ఉండే అలర్జీ, దురద వంటి సమస్యలు దూరమౌతాయి. తమలపాకులు తింటే ఆరోగ్యపరమైన సమస్యలు తొలగిపోతాయి. ఓ గిన్నె నీటిలో తమలపాకులు వేసి బాగా మరగబెట్టాలి. ఆ తరువాత ఈ నీటిని రోజూ తాగితే వివిధ రకాల అనారోగ్య సమస్యలు దూరమౌతాయి. వైద్య నిపుణుల ప్రకారం, రోజుకి రెండు, మూడు తమలపాకుల కంటే ఎక్కువ తినకూడదు. అలాగే వడలిన తమలపాకులో బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవులు పెరుగుతాయి. ఇవి జీర్ణవ్యవస్థ మీద ప్రభావం చూపి, ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. అందుకే పాత తమలపాకు తినకూడదు. ఇది శరీరానికి హానికరం అంటున్నారు నిపుణులు.

# గృహ ప్రవేశం రోజు అస్సలే ఈ తప్పులు చేయకూడదంట..



వ్యక్తులపై, కుటుంబంపై వాస్తు అనేది చాలా ఎఫెక్ట్ చూపిస్తుంటుంది. అందుకే వాస్తు బాగుండేలా చూసుకోవాలని చెబుతుంటారు. లేకపోతే చాలా కష్టాలు నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. వాస్తు శాస్త్ర నియమాలు సరిగ్గా పాటిస్తే మంచి ఫలితాలు పొందడమే కాకుండా, చాలా శుభప్రదంగా కూడా ఉంటుంది. కాబట్టి పండితులు తప్పకుండా వాస్తు నియమాలు పాటించాలని చెబుతుంటారు. ముఖ్యంగా కొత్తగా ఇల్లు నిర్మించుకునే సమయంలో లేదా, కొత్త ఇంట్లోకి గృహ ప్రవేశం చేయబోతున్న సమయంలో చాలా జాగ్రత్తగా వాస్తు నియమాలు పాటించాలంట. లేకపోతే మీరు చేసే ఈ చిన్న తప్పులే భవిష్యత్తులో మీ ఇంటి ఆనందాన్ని, శ్రేయస్సును దూరం చేసే అవకాశం ఉండటమే కాకుండా, అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందంట. గృహ ప్రవేశం చేస్తున్న వారు వాస్తు శాస్త్రం ప్రకారం ఆ రోజు నీలి రంగు దుస్తులు లేదా నలుపు రంగు దుస్తులను అస్సలే ధరించకూడదంట. వాస్తు శాస్త్రం ప్రకారం గృహ ప్రవేశం రోజు ఈ రంగు దుస్తులు ధరించడం శుభ ప్రదం కాదు అంటున్నారు పండితులు. అదే విధంగా నూతన గృహ ప్రవేశం రోజున మరో తప్పు కూడా అస్సలే చేయకూడదంట. మీరు వాస్తు శాస్త్రాన్ని నమ్మినట్లు అయితే ఈ రోజున అస్సలే కుటుంబ సభ్యులు ఎవరూ కూడా ఖాళీ చేతులతో ఇంట్లోకి ప్రవేశించకూడదంట. కుటుంబ సభ్యులందరి చేతుల్లో బియ్యం, పండ్లు, పూల వంటివి ఉండాలంట. ఇది చాలా మంచిఫలాలితాలను ఇస్తుందంట. అలాగే వాస్తు శాస్త్రం ప్రకారం గృహ ప్రవేశం చేసేటప్పుడు తప్పకుండా కుడి పాదాన్నే ముందు పెట్టాలంట. ఎట్టి పరిస్థితుల్లో ఎడమకాలు పెట్టి గృహ ప్రవేశం చేయకూడదంట. కుడి పాదం పెట్టి కొత్త ఇంట్లోకి అడుగు పెట్టడం వలన అనేక శుభ ఫలితాలు కలుగుతాయంట. అలాగే గృహ ప్రవేశం చేసే రోజు గోమాతను ఇంటిలోకి ముందుగా ప్రవేశ పెట్టడం వలన అన్ని విధాలుగా కలిసి వస్తుందంట. అంతే కాకుండా ఈ రోజు మీ ఇంటి ఆడపిల్లకు బట్టలు పెట్టి, ఆమెకు బియ్యం పోయడం పూజించడం కూడా చాలా శుభప్రదం అంటున్నారు పండితులు.

# వారంలో 3 సార్లు తింటే ముసలోళ్లు అయ్యే ఛాన్సే లేదంట!



ఈ ఆరోగ్యకరమైన మీల్ మేకర్‌ను సోయాతో తయారు చేస్తారు. మీల్ మేకర్‌లో పోషకాలు సమృద్ధిగా ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కొవ్వు ఉండదు. ప్రొటీన్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, జింక్, సెలీనియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వెజిటేరియన్ వాళ్లకు మాంసానికి ప్రత్యామ్నాయంగా దీనిని పిలుస్తారు. మీల్ మేకర్‌ను సోయా చంక్స్ అని కూడా పిలుస్తుంటారు. ఈ ఆరోగ్యకరమైన మీల్ మేకర్‌ను సోయాతో తయారు చేస్తారు. మీల్ మేకర్‌లో పోషకాలు సమృద్ధిగా ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కొవ్వు ఉండదు. ప్రొటీన్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, జింక్, సెలీనియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. మీల్ మేకర్‌ను తరచుగా మన డైట్‌లో చేర్చుకుంటే.. లెక్కలేనన్నీ ఆరోగ్య లాభాలు అందుతాయని నిపుణులు చెబుతున్నారు.? ప్రోటీన్ .. అత్యధికంగా ఇచ్చే ఆహారాల్లో సోయా చంక్స్ ఒకటి. వెజిటేరియన్ మటన్ గా పిలిచే దీని వల్ల మసిల్స్ పెరిగేందుకు సహాయపడుతుంది. తక్కువ క్యాలరీలు, ఎక్కువ ప్రోటీన్ అందిస్తుంది. కాల్షియం, ఐరన్ అధికంగా ఉండడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అన్నిటికన్నా ముఖ్యంగా ఇది..డైబెటిక్ ఫ్రెండ్లీ ఫుడ్ అంటున్నారు నిపుణులు. మీర ముఖ్యంగా సోయా ఫుడ్స్‌తో అకాల వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. శరీరంలో రక్త ప్రసరణను నిర్వహించడంతో పాటు వివిధ సీజనల్ సమస్యలను దూరం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. మీల్ మేకర్ తినటం వల్ల మహిళల్లో ఎముకలకు బలాన్నిస్తుంది. ఎముకల దృఢత్వాన్ని పెంచుతుంది. ఈ పోషకమైన మీల్ మేకర్ అన్ని వయసుల వారికి సమానంగా ప్రయోజనాలను అందిస్తుంది. వీటిలో చికెన్, మటన్, గుడ్లు కంటే ఎక్కువ ప్రొటీన్ ఉంటుంది. వెజిటేరియన్స్ వీటిని మాంసానికి ప్రత్యామ్నాయంగా తీసుకోవచ్చు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా ప్రొటీన్ లోపంతో బాధపడేవారు.. మీల్ మేకర్ తీసుకుంటే మంచిదని చెబుతున్నారు.? రోజుకి ఒక కప్పు సోయా చంక్స్ ని ఉడికించి కూర లేదా సలాడ్ రూపంలో తినాలి. ఎక్కువగా తినకుండా పరిమితంగా తీసుకోవాలి.

# పుదీనా మజాకా..! అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు



వంటల్లో పుదీనా వేస్తే రుచి మారిపోతుంది. ఎందుకంటే దీని ఫ్లేవర్ అలా ఉంటుంది. పుదీనా ఆకుల్లోని విటమిన్ సి, రోగనిరోధక శక్తిని పెంచే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. పుదీనాలో ఐరన్, మాంగనీస్, ఫోలేట్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీవక్రియ విధులు, కణాల పెరుగుదలకు తోడ్పడతాయి. పుదీనా ఆకులు తినడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలు తగ్గుతాయి. పుదీనాలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి కాపాడుతాయి. పుదీనాలో విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. దాంతో ఇమ్యూనిటీ పెరుగుతుంది. ముఖ్యంగా నాన్ వెజ్ వంటకాలు బిర్యానీ, మటన్ ,చికెన్ వండేటప్పుడు పుదీనా ఆకులు వేస్తే అద్భుతమైన రుచి కలిగి ఉంటాయి. వర్షకాలం వచ్చిందంటే చాలు జలుబు, ముక్కుదిబ్బడ వంటి సమస్యు ఎదురవుతుంటాయి.. ఈ క్రమంలో పుదీనా ఆకుల వాసన పీల్చితే ఉపశమనం లభిస్తుంది. ఇందులో విటమిన్ ఎ పుష్కలంగా ఉండటం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. కంటి ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఉండే కెరోటిన్, యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి. పేలు , చుండ్రు సమస్యలను తొలగిస్తాయి. వంటల్లో పుదీనా వేస్తే రుచి మారిపోతుంది. ఎందుకంటే దీని ఫ్లేవర్ అలా ఉంటుంది. పుదీనా ఆకుల్లోని విటమిన్ సి, రోగనిరోధక శక్తిని పెంచే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. పుదీనాలో ఐరన్, మాంగనీస్, ఫోలేట్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీవక్రియ విధులు, కణాల పెరుగుదలకు తోడ్పడతాయి. ప్రతి రోజూ ఉదయం పుదీనా ఆకులు, పుదీనా టీ తాగితే కడుపు ఉబ్బరం, గ్యాస్, వికారం సమస్యలు దూరం అవుతాయి. పుదీనా కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలకు తక్షణ ఉపశమనం ఇస్తుంది. పుదీనా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు చర్మాన్ని సంరక్షిస్తాయి. పుదీనాలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ గుణాలు ఫ్రీరాడికల్స్ నుంచి చర్మ కణాలను రక్షిస్తాయి. పుదీనా చర్మానికి తాజాదనం అందిస్తాయి, రియాక్టివేట్ చేస్తాయి.

## బిజినెస్

# రేర్ ఎర్త్స్ ఎగుమతులపై చైనా ఆంక్షలు..
# స్విఫ్ట్ కార్ల ఉత్పత్తిని నిలిపివేసిన సుజుకీ!

## టాటా కారు ఓనర్లకు గుడ్‌న్యూస్




ముంబై: ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ తమ కస్టమర్ల కోసం దేశవ్యాప్తంగా మాన్సూన్ చెకప్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. జూన్ 6న ప్రారంభమైన ఈ క్యాంపులు 20వ తారీఖు వరకు కొనసాగుతాయని వివరించింది. 500 నగరాల్లో 1,090 ఆథరైజ్డ్ వర్క్‌షాప్‌లలో ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని కంపెనీ పేర్కొంది. ఈ క్యాంపులో భాగంగా వాహనంలోని ముప్పై కీలక పాయింట్లను పరీక్షించే సమగ్ర హెల్త్ చెకప్ సేవలు పొందవచ్చని వివరించింది. కార్ టాప్ వాష్, ఒరిజినల్ స్పేర్ పార్ట్‌లు, ఇంజిన్ ఆయిల్, యాక్సెసరీలు, లేబర్ చార్జీలపై ప్రత్యేక డిస్కౌంట్లు పొందవచ్చని టాటా మోటార్స్ తెలిపింది. టాటా మోటార్స్ ఇండియా దేశంలో కర్వ్, టియాగో, టిగోర్, పంచ్, నెక్సాన్, హారియర్, సఫారీ, ఇటీవల లాంచ్ చేసిన టాటా ఆల్ట్రోజ్ ఫేస్ లిఫ్ట్ తో సహా ఏడు ఐసీఈ కార్లను అందిస్తోంది. అలాగే కర్వ్.ఈవీ, నెక్సాన్.ఈవీ, పంచ్.ఈవీ, టియాగో.ఈవీ, టిగోర్.ఈవీ, ఇటీవల లాంచ్ చేసిన టాటా హారియర్.ఈవీ వంటి ఆరు ఎలక్ట్రిక్ వాహనాలు కూడా బ్రాండ్ జాబితాలో ఉన్నాయి.

## అమెరికా స్టాక్‌మార్కెట్‌లో ఇండియన్ కంపెనీ




**న్యూఢిల్లీ:** దేశీ మెడికల్ టెక్నాలజీ కంపెనీ ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఇంటర్నేషనల్ తాజాగా అమెరికాలోని నాస్డాక్ ఎక్స్చేంజీలో లిస్టయ్యింది. ఈ సందర్భంగా ఓపెనింగ్ బెల్ మోగించే కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు స్యుదీర్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు. కంపెనీ రూపొందించిన ఎస్ఎస్ఐ మంత్ర సర్జికల్ రోబోటిక్ సిస్టం ప్రస్తుతం దేశీయంగా 75 ప్రాంతాల్లోని 80 ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంది. వీటితో 100 పైగా సర్జికల్ ప్రొసీజర్లకు సంబంధించి 4,000 పైగా రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు సంస్థ తెలిపింది. అటు అంతర్జాతీయంగా నేపాల్, కొలంబియా, ఉక్రెయిన్, ఈక్వెడర్ తదితర దేశాల్లోనూ కంపెనీ కార్యకలాపాలు విస్తరించింది. 2024 డిసెంబర్‌తో ముగిసిన సంవత్సరంలో కంపెనీ ఆదాయం 3.5 రెట్లు వృద్ధి చెంది 5.9 మిలియన్ డాలర్ల నుంచి 20.6 మిలియన్ డాలర్లకు పెరిగింది. స్థూల మార్జిన్లు 12.3 శాతం నుంచి 40.9 శాతానికి ఎగిశాయి.


జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ సుజుకీ మోటార్స్ కీలక నిర్ణయం తీసుకున్నది. కంపెనీకి చెందిన పాపులర్ మోడల్ కార్ స్విఫ్ట్ ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేసింది. చైనా సర్కారు రేర్ ఎర్త్ పదార్థాల ఎగుమతులపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆంక్షల కారణంగా విడిభాగాలు లభించకపోవడంతో ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలుస్తున్నది. చైనా రేర్ ఎర్త్స్ ఎగుమతులపై ఆంక్షలు అమలు చేయడం వల్ల ప్రభావితమైన తొలి ఆటోమొబైల్ కంపెనీ సుజుకీ. స్విఫ్ట్ సబ్‌కాంపాక్ట్ మోడల్ (స్విఫ్ట్ స్పోర్ట్ మినహా) ఉత్పత్తిని మే 26 నుంచి జూన్ 6 వరకు నిలిపివేస్తున్నట్లు కంపెనీ గతంలోనే ప్రకటించింది. విడిభాగాల కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో తెలిపింది. అయితే, కొరతకు దారితీసిన కారణాలపై మాత్రం స్పందించలేదు. ఉత్పత్తి నిలిపివేతకు సంబంధించిన కారణాలపై స్పందించేందుకు కంపెనీ ప్రతినిధి నిరాకరించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అంతర్జాతీయ మీడియా సంస్థ కథనం ప్రచురించింది. ఏప్రిల్ నెలలో చైనా ప్రభుత్వం అనేక రకాల రేర్ ఎర్త్ పదార్థాలు, వాటితో ముడిపడిన అయస్కాంతాల ఎగుమతులను నిలిపివేసింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా ఆటోమొబైల్ తయారీ సంస్థలు, ఏరోస్పేస్ కంపెనీలు, సెమీకండక్టర్ల తయారీదారులు, సైనిక కాంట్రాక్టర్ల సరఫరా వ్యవస్థలపై చైనా నిర్ణయం తీవ్ర ప్రభావం పడుతున్నది. రేర్ ఎర్త్ పదార్థాలు అనేక కీలకమైన ఎలక్ట్రానిక్,



మాగ్నెటిక్ భాగాల తయారీలో వినియోగిస్తారు. చైనా ఆంక్షలతో కొన్ని యూరోపియన్ ఆటో విడిభాగాల తయారీ ప్లాంట్లు సైతం ఇప్పటికే ఉత్పత్తులను నిలిపివేశారు. ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ సైతం రేర్ ఎర్త్స్ కొరతను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నది.

## డబ్బులు ఊరికే రావు: ఐపీవోకి వస్తున్న లలితా జ్యువెలరీ

తమిళనాడుకు చెందిన ప్రముఖ జువెలరీ రిటైలర్ లలితా జ్యువెలరీ మార్ట్ క్యాపిటల్ మార్కెట్లలోకి అడుగు పెడుతోంది. ఐపీవో ద్వారా నిధుల సమీకరణకు వస్తోంది. ఈమేరకు సెబీకి ప్రాథమిక పత్రాలు సమర్పించింది. ఈ ఐపీవోలో భాగంగా ఫ్రెష్ ఈక్విటీ షేర్ల కింద రూ.1,200 కోట్ల విలువైన షేర్లను, ఆఫర్ ఫర్ సేల్ కింద రూ.500 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ కిరణ్ కుమార్ జైన్ జారీ చేయనున్నారు. 1985లో ఏర్పాటైన లలితా జ్యువెల్లరీ తాజా ఇష్యూ ద్వారా వచ్చే రూ.1,014.5 కోట్లను భారత్ లో 12 కొత్త స్టోర్ల ఏర్పాటుకు, మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించాలని యోచిస్తోంది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలోని 46 నగరాల్లోని 56 స్టోర్ల ద్వారా ఆభరణాల ఉత్పత్తులను ఈ సంస్థ విక్రయిస్తోంది. లలితా జ్యువెల్లరీ 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.359.8 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అలాగే ఆదాయం 26 శాతం పెరిగి రూ.16,788 కోట్లకు చేరింది. 2024 డిసెంబర్‌తో ముగిసిన




తొమ్మిది నెలల కాలానికి రూ.262.3 కోట్ల లాభం, రూ.12,594.7 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. లలితా జ్యువెలరీ మార్ట్ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్ గా ఆనంద్ రాఠీ అడ్వైజర్స్, ఎక్విరస్ క్యాపిటల్‌ను నియమించారు.

# భారత అథ్లెట్లకు నాలుగు స్వర్ణాలు..
# రజతంతో మెరిసిన యశాస్!

## స్పోర్ట్స్

భారత అథ్లెట్లు తైవాన్ ఓపెన్‌లో పతకాల పంట పండించారు. శనివారం జ్యోతి ఎర్రాజీ, అబ్దుల్లా, పూజలు స్వర్ణాలతో మెరవగా.. పోటీల చివరి రోజైన ఆదివారం కూడా మరో నాలుగు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. మూడుసార్లు జాతీయ ఛాంపియన్ విథ్యా రామరాజ్ రోహిత్ యాదవ్, పూజా, క్రిష్ణ కుమార్‌లు తమ తమ విభాగాల్లో పసిడితో గర్జించారు. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో యశాస్ పలాక్ష వెండి వెలుగులు విరజిమ్మాడు. తైవాన్ చివరిరోజున భారత అథ్లెట్లు పసిడి మోత మోగించారు. మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో వైథ్యా చిరుతలా పరుగెత్తి స్వర్ణం కొల్లగొట్టింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఆమె 56.53 సెకన్లలోనే లక్ష్యానికి చేరుకుంది. తద్వారా త్వరలో జరుగబోయే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో వైథ్య ర్యాంకింగ్స్ మెరుగవ్వనుంది. జావెలిన్ త్రోలో రోహిత్ అత్యుత్తమ ప్రదర్శన చేయకపోయినా 74.42 మీటర్ల దూరం ఈటెను విసిరి బంగారు పతకం సాధించాడు. ఇక మహిళల, పురుషుల 800 మీటర్ల పరుగులో భారత అథ్లెట్లు అదరగొట్టారు. అంచనాలను అందుకుంటూ పూజ భారత్‌కే చెందిన ట్వింకిల్ చౌదరీని రెండో స్థానానికి పరిమితం చేస్తూ 2.02 79 సెకన్లలో ఫినిషింగ్ లైన్ దాటింది. పురుషుల ఫైనల్లో క్రిష్ణ కుమార్ ప్రత్యర్థులకు షాకిస్తూ 148 46 సెకన్లలోనే లక్ష్యానికి చేరుకొని గోల్డ్ మెడల్ ఖాతాలో వేసుకున్నాడు.

**100 మీటర్ల హర్డిల్స్‌లో..**







పది రోజుల క్రితం ఆసియా ఛాంపియన్‌షిప్స్ లో స్వర్ణం సాధించిన జ్యోతి ఎర్రాజీ మరోసారి మెరిసింది. 100 మీటర్ల హర్డిల్స్‌లో తనకు తిరుగులేదని చాటుతూ తైవాన్ ఓపెన్ లోనూ పసిడి వెలుగులు విరజిమ్మింది. శనివారం జరిగిన 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో చిరుతలా పరుగెత్తిన జ్యోతి 12.99 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది. పురుషుల ట్రిపుల్ జంప్‌లో అబ్దుల్లా అబూబాకర్, మహిళల 1500 మీటర్ల పరుగులో పూజలు కూడా స్వర్ణంతో మనదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేశారు.

## రోహిత్, కోహ్లి ఫేర్‌వెల్‌కు ప్లాన్ చేస్తున్న క్రికెట్ ఆస్ట్రేలియా

భారత క్రికెట్ దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి టీ20, టెస్ట్ ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ ఇరువురు వన్డేలకు మాత్రమే అందుబాటులో ఉన్నారు. రోకో (రోహిత్, కోహ్లి) 2027 వన్డే వరల్డ్‌కప్ వరకు అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతామని సూచనప్రాయంగా తెలిపినట్లు సమాచారం. రోకో ఈ ఆగస్ట్‌లో బంగ్లాదేశ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో టీమిండియా తరఫున బరిలోకి దిగవచ్చు. అనంతరం అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లోనూ పాల్గొనవచ్చు. ఒకవేళ ఈ సిరీస్‌లో రోకోకు పాల్గొంటే కెరీర్‌లో వారికి అదే చివరి ఆస్ట్రేలియా పర్యటన అవుతుంది. ఈ నేపథ్యంలో క్రికెట్ ఆస్ట్రేలియా రోహిత్, కోహ్లి ఫేర్‌వెల్‌కు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. హిందుస్తాన్ టైమ్స్ కథనం ప్రకారం.. క్రికెట్ ఆస్ట్రేలియా సీఈవో టాడ్ గ్రీన్‌బర్గ్ అక్టోబర్‌లో జరిగే భారత్, ఆస్ట్రేలియా వన్డే సిరీస్ సందర్భంగా రోహిత్, కోహ్లీలకు ఘనంగా వీడ్కోలు పలకాలని ?ప్లాన్ చేస్తున్నారు. ఓ సందర్భంగా టాడ్ ఇలా అన్నారు. మా దేశంలో (ఆస్ట్రేలియా) విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడటం అదే చివరిసారి కావచ్చు. ఒకవేళ అలా అయితే వారికి




గొప్పగా వీడ్కోలు పలకాల్సిన ధర్మం మాకుంది. వారిరువురు భారత క్రికెట్‌తో పాటు అంతర్జాతీయ క్రికెట్‌కు ఎంతో చేశారు. అలాంటి వారికి గౌరవించుకోవాల్సిన అవసరం? ఎంతైనా ఉంది. త్వరలో ఈ విషయమై అధికారిక ప్రకటన చేస్తాము. ఇదిలా ఉంటే, రోహిత్, కోహ్లి తాజాగా ముగిసిన బోర్డర్ గవాస్కర్ సిరీస్ తర్వాత టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించారు. వారిద్దరి కెరీర్‌లో చివరి టెస్ట్‌లు ఆస్ట్రేలియా గడ్డపైనే ఆడారు. అయితే ఆ సిరీస్ జరిగే నాటికి రోహిత్, కోహ్లి రిటైర్మెంట్ గురించి ఆలోచించకపోయి ఉండవచ్చు. ఇంగ్లండ్ పర్యటనకు ముందు చోటు చేసుకున్న పరిణామాల అనంతరం వారిద్దరు రోజుల వ్యవధిలో టెస్ట్‌లకు గుడ్‌బై చెప్పారు. బీసీసీఐ సైతం రోహిత్, కోహ్లిలకు ఫేర్‌వెల్ పలకలేకపోయింది. ఈ జోడీ టెస్ట్‌ల్లో ఇంకొంతకాలం కొనసాగుతారని అంతా అనుకున్నారు.


## లార్డ్స్‌లో భారత క్రికెటర్లు.. అప్పుడే ప్రాక్టీస్ షురూ చేసేశారు!



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ కొత్త సైకిల్‌లో తొలి సిరీస్‌కు భారత జట్టు పక్కాగా సిద్ధమవుతోంది. ఇంగ్లండ్ గడ్డపై 18 ఏళ్లుగా చేజారుతున్న సిరీస్‌ను ఒడిసిపట్టేందుకు సమాయత్తమవుతోంది. ఆతిథ్య జట్టుతో ఐదు టెస్టుల సిరీస్‌లో విజయమే లక్ష్యంగా పెట్టుకున్న టీమిండియా.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రాక్టీస్ షురూ చేసింది. పర్యటన మొదలైన రెండో రోజే ఆటగాళ్లు కసరత్తు చేస్తూ కనిపించారు. లార్డ్స్‌లోని ఇండోర్ స్టేడియంలో హెడ్‌కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో స్క్వాడ్‌లోని 15 మంది వామప్ వ్యాయామాలు, ఫీల్డింగ్ విన్యాసాలతో చెమటోడ్చారు. భారత క్రికెటర్ల ప్రాక్టీస్‌కు సంబంధించిన వీడియోను ఆదివారం బీసీసీఐ ఎక్స్‌లో షేర్ చేసింది. ఐదు టెస్టుల సిరీస్ కోసం టీమిండియా బృందం శనివారం ఇంగ్లండ్ చేరుకుంది. డబ్ల్యూటీసీలో కీలకమైన సిరీస్ కావడంతో బారత ఆటగాళ్లు మరుసటి రోజే శిక్షణ శిబిరంలో పాల్గొన్నా రు. సిరాజ్, బుమ్రా, ప్రసిధ్ కృష్ణ, అర్షదీప్ సింగ్‌లతో కూడిన పేస్ దళం వామప్ వ్యాయ మాల తర్వాత బౌలింగ్ ప్రాక్టీస్‌తో బిజీగా గడిపింది. ఇక కెప్టెన్ గిల్, సిరాజ్, ప్రసిధ్‌లతో ఫుట్‌బాల్ ఆడుతూ కనిపించాడు. ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్ సమక్షంలో క్యాచ్‌లు పట్టడం, బంతిని వికెట్లవైపు త్రో చేయడం, వికెట్లను గురి చూసి కొట్టడం వంటివి సాధన చేశారు.

**4 రోజుల ప్రాక్టీస్ మ్యాచ్**

భారత్, ఇంగ్లండ్‌ల మధ్య తొలి టెస్టు జూన్ 20 మొదలవ్వనుంది. అయితే.. అంతకంటే ముందు ఇంగ్లండ్‌లోనే ఉన్న ఏ జట్టుతో సీనియర్ టీమ్ నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. ఇంగ్లండ్ పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ఈ మ్యాచ్ చాలా ఉపయోగపడనుంది. కానీ, రికార్డులు మాత్రం ఆతిథ్య జట్టుకే అనుకూలంగా ఉన్నాయి. 2007లో చివరిసారిగా ఇక్కడ సిరీస్ గెలుపొందింది టీమిండియా. ఆ తర్వాత పలుమార్లు వెళ్లినా పరాజయమే పలకరించింది. కుర్రాళ్లు, సీనియర్లతో కూడిన భారత జట్టు ఈసారి 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించాలనే పట్టుదలతో ఉంది. అనుభవజ్ఞులైన విరాట్ కోహ్లీ రోహిత్ శర్మ, అశ్విన్‌లు లేకుండా సిరీస్ విజయం కష్టమే. కానీ, అసాధ్యం కాదని చాటాలనుకుంటన్నాడు గంభీర్. ఇప్పటికే స్క్వాడ్‌లోని కేఎల్ రాహుల్ సెంచరీతో, కరుణ్ నాయర్ ద్విశతకంతో ఇంగ్లండ్ లయన్స్‌పై విరుచుకుపడ్డారు. సో.. వీళ్లు ఐదు టెస్టుల సిరీస్‌లో పరుగుల వరద పారించే అవకాశముంది.




# చిరు ఫ్యాన్స్‌కి డబుల్ ట్రీట్ ఇవ్వబోతున్న అనీల్ రావిపూడి

మెగాస్టార్ చిరంజీవి కుర్ర హీరోలతో పోటీ పడుతూ సినిమాలు చేస్తున్నారు. ఆయన ఇటీవల విశ్వంభర చిత్ర షూటింగ్ పూర్తి చేసి ఇప్పుడు అనీల్ రావిపూడి దర్శకత్వంలో చేస్తున్నాడు. డైరెక్టర్ వశిష్టతో చేసిన విశ్వంభర చిత్రం సోషియో ఫాంటసీ సినిమాగా తెరకెక్కుతుంది . ఈ సినిమాలో త్రిష హీరోయిన్ గా నటిస్తుండగా, కీరవాణి విశ్వంభరకు సంగీతం అందిస్తున్నాడు.అయితే విశ్వంభర సినిమాపై ఇప్పటి వరకు ఎటువంటి అప్ డేట్ రాలేదు. కాని ఇటీవల మొదలైన అనిల్ రావిపూడి సినిమా మాత్రం పరుగులు పెడుతోంది. ఇక ఈసినిమా స్టార్ట్ అయిన అప్పటి నుంచి నిత్యం ఏదో ఒక వార్త టాలీవుడ్‌లో హల్‌చల్ చేస్తూనే ఉంది. ఈ మూవీ ఇప్పటికే తొలి షెడ్యూల్ పూర్తి చేసుకున్నట్టు తెలుస్తుండగా, మరి కొద్ది రోజులలో రెండో షెడ్యూల్ మొదలు పెట్టనున్నారట. చిరంజీవి కెరీర్లో 157వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్లో చిరంజీవి డ్యూయల్ రోల్ లో కనిపించనున్నారనే వార్త ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అయింది. రెండు పాత్రలలో ఒక పాత్ర వింటేజ్ చిరంజీవిని గుర్తు చేసేలా ఉంటుందని, మరో పాత్ర ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఉంటుందట. అయితే దీనిపై మూవీ టీమ్ నుంచి ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. కాని టాలీవుడ్ సర్కిల్ లో మాత్రం ఈ రూమర్ షికారు చేస్తోంది.ఇప్పుడు నయనతార , చిరంజీవిపై ఫ్యామిలీ సీన్స్ చిత్రీకరిస్తున్నాడట అనీల్ రావిపూడి. వారిద్దరి మధ్య వచ్చే కామెడీ సీన్స్ చాలా బాగా వచ్చాయని అంటున్నారు. ఈ సీన్స్ సినిమాకి హైలైట్ అవుతాయని అంటున్నారు. ఈ సినిమాను సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిరంజీవి గత సినిమాలన్నీ యాక్షన్ డ్రామాలు కాగా, ఈసారి ప్యూర్ కామెడీ ఎంటర్‌టైనర్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ తో పాటు, కామన్ ఆడియన్స్ కూడా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మెగా157 సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, ఆయన ఈ మూవీ కోసం అద్భుతమైన బాణీలు రూపొందిస్తున్నట్టు తెలుస్తుంది.



# ఓటీటీలో ఆకట్టుకుంటున్న రీతూ వర్మ తొలి వెబ్ సిరీస్

బ్యూటిఫుల్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ రీతూ వర్మ నటించిన తొలి వెబ్ సిరీస్ 'దేవిక అండ్ డాని. 'శ్రీకారం' ఫేమ్ బి. కిశోర్ ఈ సిరీస్ కి దర్శకత్వం వహించగా, సూర్య వశిష్ట, శివ కందుకూరి హీరోలుగా నటించారు. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ కామెడీ, హారర్ వెబ్ సిరీస్ ప్రస్తుతం జియో హాట్ స్టార్ స్ట్రీమింగ్ అవుతుంది. రీతు వర్మ ఓటీటీ లో డెబ్యూ , పల్లెటూరి అమ్మాయి గా క్యారెక్టర్ కి చాలా బాగా సెట్ అయింది అందంగా ఉంది , టీచర్ గా ప్రాబ్లం వస్తే ఎదిరించే అమ్మాయి లాగా  బాగా చేసింది. సూర్య వశిష్ఠ స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంది , శివ కందుకూరి పల్లెటూరి అబ్బాయి గా బాగా సెట్ అయ్యాడు. సుబ్బరాజు నీ పల్లెటూరి క్యారెక్టర్ లో కొత్తగా అనిపించాడు. చాలా రోజుల తర్వాత కోవై సరళ గారు ఒక మంచి పాత్రలో కనిచించారు... సిరీస్ కి ఫ్రెష్ ఫీలింగ్ అనిపించింది.




# గోపీచంద్ మలినేనితో మరోసారి చేతులు కలిపిన బాలకృష్ణ

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ రెండు రోజుల్లో తన 65వ పుట్టినరోజును జరుపుకోబోతున్నాడు. ఈ క్రమంలోనే ఆయన బర్త్‌డే సందర్భంగా వరుస అప్‌డేట్‌లు రాబోతున్నాయి. ఇప్పటికే అఖండ 2 టీజర్‌ను ప్రకటించిన చిత్రయూనిట్ తాజాగా మరో అప్డేట్‌ను ప్రకటించారు. తనకు వీరసింహారెడ్డి లాంటి బ్లాక్ బస్టర్‌ను అందించిన దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలయ్య తన తదుపరి సినిమాను చేయనున్నాడు.





# షూటింగ్ పూర్తిచేసుకున్న కార్తీ 'సర్దార్ 2'

తమిళ నటుడు కార్తీ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రాలలో సర్దార్ ఒకటి. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తమిళంతో పాటు తెలుగులోనూ రూ.100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అయితే ఈ సినిమాకు తాజాగా సీక్వెల్‌ను రాబోతున్న విషయం తెలిసిందే. పీఎస్ మిత్రన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మాళవిక మోహనన్ కథానాయకగా నటిస్తుంది. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా సాలిడ్ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమా షూటింగ్ తాజాగా కంప్లీట్ చేసుకున్నట్లు కార్తీ సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. థాయిలాండ్‌లోని హావా హిన్ ఎయిర్‌పోర్ట్‌లో చిత్రయూనిట్‌తో కేక్ కట్ చేస్తూ.. సర్ధార్ 2 షూటింగ్ పూర్తయినట్లు తెలిపాడు. 'సర్దార్ 2' సినిమాకు యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. పార్ట్ 1కు జీవీ ప్రకాష్ కుమార్ సంగీత దర్శకుడిగా పని చేయగా, సీక్వెల్‌కు యువన్ శంకర్ రాజాను తీసుకోవడం సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతోంది. అంతేకాకుండా, ఈ సీక్వెల్‌లో స్టార్ నటుడు ఎస్‌జే సూర్య కీలక పాత్రలో నటించబోతున్నారు. 'సర్దార్ 2' చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై లక్ష్మణ్ కుమార్, ఇషాన్ సక్సేనా నిర్మిస్తున్నారు.

# కన్నప్ప ఓటీటీ గురించి మంచి విష్ణు క్లారిటీ

ప్రస్తుతం తెలుగు సినిమా వ్యవహారాలు దాదాపు ఓటీటీ సంస్థల చేతుల్లోకి వెళ్లిపోయాయి. మూవీని ఏ తేదీన థియేటర్లలో విడుదల చేయాలనేది వారే నిర్ణయిస్తున్నారు. పాన్ ఇండియా మూవీస్‌కి పర్లేదు గానీ చాలామంది చిన్న, మీడియం బడ్జెట్ పెట్టే నిర్మాతలు.. తమ చిత్రాల్ని పూర్తి చేసినా సరే రిలీజ్ చేయలేకపోతున్నారు. ఈ క్రమంలోనే మంచు విష్ణు 'కన్నప్ప' ఓటీటీ గురించి పలు రకాల రూమర్స్ వినిపిస్తున్నాయి. వాటి గురించి అడగ్గా.. విష్ణు తాజా ఇంటర్వ్యూలో సమాధానమిచ్చాడు. 'కన్నప్ప' ఓటీటీ డీల్ కుదిరిందా? అని అడగ్గా.. 'వాళ్లు ఓ ఫిగర్ చెప్పారు అది నాకు నచ్చలేదు. హిట్ అయ్యాక అమ్మితే ఎంత ఇస్తారని అడిగాను. అప్పుడు వాళ్లు చెప్పిన ఫిగర్ నాకు నచ్చింది. డబ్బులు రెడీ చేస్కోండి. విడుదలయ్యాక వస్తాను అని చెప్పాను' అని విష్ణు చెప్పుకొచ్చాడు. ఇతడి కాన్ఫిడెన్స్ చూస్తుంటే సినిమాపై చాలా నమ్మకంతోనే ఉన్నాడనిపిస్తుంది. చూడాలి మరి ఫలితం ఎలా వస్తుందో? మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'. గత చిత్రాలు సరిగా ఆడకపోవడంతో చాన్నాళ్ల పాటు గ్యాప్ తీసుకుని ఈ సినిమా చేశాడు. భారీ బడ్జెట్ పెట్టి స్వయంగా నిర్మించాడు. ఇందులో ప్రభాస్, మోహన్ లాల్, మోహన్ బాబు, అక్షయ్ కుమార్, కాజల్.. ఇలా చాలామంది స్టార్స్ కీలక పాత్రలు పోషించారు. మార్కెట్ పరంగా చూసుకుంటే దక్షిణాది స్టార్స్ చాలామంది ఉన్నారు. సినిమా హిట్ అయితే ఓటీటీల నుంచి డిమాండ్ ఉండొచ్చు. ఒకవేళ తేడా కొడితే మాత్రం అంతే సంగతులు. జూన్ 27న 'కన్నప్ప' సినిమా థియేటర్లలోకి రానుంది. చాన్నాళ్ల క్రితం తొలుత ఓ టీజర్ రిలీజ్ చేయగా.. విపరీతమైన ట్రోలింగ్ వచ్చింది. కాస్త గ్యాప్ తీసుకుని మరో టీజర్ రిలీజ్ చేయగా, నెగిటివిటీ కాస్త తగ్గింది. ప్రస్తుతం ప్రమోషన్ల బాధ్యత విష్ణునే తీసుకున్నాడు. పలు ఇంటర్వ్యూలు ఇస్తూ బిజీగా ఉన్నాడు. త్వరలో తెలుగు రాష్ట్రాల్లో ఈవెంట్ చేయబోతున్నాడు. దీనికి ప్రభాస్ కూడా హాజరవుతాడని టాక్.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com